ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఒంగోలు

భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'!
కర్ణాటకలో సిఎం మార్పు అనివార్యమా? 9లో

fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-7-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 159 పేజీలు: 12 వెల: 6.50

# అడ్డంకులు సృష్టిస్తే సహించం

ప్రభుత్వ పథకాలకు అడ్డుపడేవారిపై కఠిన చర్యలు

వైఎస్సార్సీ కుట్రలపై విచారణ జరిపిస్తాం: సిఎం చంద్రబాబు

రాజధానికి మలివిడతలో 34,964 ఎకరాల భూ సమీకరణ

స్పోర్ట్స్ అకాడెమీకి భూముల కేటాయింపు

క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

మోటార్ వెహికిల్ బిల్లుల్లో పలు సవరణలు



బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు తదితరులు

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ బ్రాండ్ దెబ్బతినేలా వివిధ సంస్థలకు ఈ మెయిల్లు పెట్టడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైఎస్సార్సీ అడ్డుకోవడం క్షమించరాని విషయం అన్నారు. ఆ పార్టీకుట్రలపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. చేసిన తప్పులను ప్రత్యర్థులపైకి నెట్టేసే కుట్రలను వైఎస్సార్సీ అమలు చేస్తుందని విమర్శించారు. నిధులు రాకుండా తెరవెనుక అడ్డుకోవడం వారికి అలవాటుగా మారిందని ఆరోపించారు. పథకాలు ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తుందని ఆక్షేపించారు. వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. ఈ విషయంలో మంత్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిన సంస్థలతో సమన్వయం చేసుకోవాలన్నారు.

బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు అధ్యక్షతన కేబినెట్‌భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎజెండాలో అంశాలతో పాటు పలు విషయాలపై ఆయన చర్చించారు. ప్రభుత్వ పథకాలకు అడ్డంకిగా ఉంటున్న శక్తులపై తగిన రీతిలో బదులు చెప్పాలన్నారు.ఇక 20 ఏజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. అదేవిధంగా 50వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశం నిర్ణయాలకు మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది. ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ.672 కోట్ల విడుదలకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. తద్వారా 31,000ల మంది రైతులకు బకాయిలు అందనున్నాయి. అన్నదాతలఖాతాల్లో 24 గంటల్లో బకాయిలు జమ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ధాన్యం పాత బకాయిలు రూ.1000 కోట్లలో రూ. 672 కోట్ల నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నగదును 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. నిధులు రైతుల ఖాతాల్లో వేసే బాధ్యతను పౌర సరఫరాల శాఖ మంత్రి >>2



బుధవారం నమీబియా అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్‌షియా మిరాబిలిస్' ను ప్రధాని మోడీకి అందజేస్తున్న అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్‌డైత్వా

## ప్రధాని మోడీకి నమీబియా అత్యున్నత పురస్కారం

**విండ్‌హాక్(నమీబియా), జూలై 9:** ఐదుదేశాల పర్యటనలోభాగంగా తన చిట్టచివరి పర్యటనగా నమీబియా పర్యటనలో ఉన్న ప్రధానిమోడీ ఆదేశ అత్యున్నత పురస్కారం అందుకున్నారు. 'ఆర్డర్ ఆఫ్‌ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్‌షియా మిరాబిలిస్' పురస్కారాన్ని ఆదేశ అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది ఎన్‌డైత్వా ప్రధానిమోడీకి బుధవారం ఈ పురస్కారం అందచేసారు. నమీబియా రాజ్యాంగం దఖలుపరిచిన అధికారాల ఆధారంగా నమీబియా అత్యున్నత పురస్కారాన్ని విభిన్న రంగాల్లో విశిష్టసేవలందించిన భారతప్రధాని నరేంద్రమోడీకి అందచేస్తున్నందుకు ఎంతో గర్వంగా >>2

# నదుల అనుసంధానమే లక్ష్యం

## కృష్ణా డెల్టాకు వరప్రదాయిని పట్టిసీమ ఎత్తిపోతలు

## రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు



బుధవారం పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు హారతినిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** నదుల అనుసంధానం వలన వ్యవసాయరంగానికి ఎంతో ప్రయోజనం ఉందని ఎపి జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం అందుకు కీలక ఉదాహరణ అన్నారు. డెల్టా భూములకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఈ పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూసిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో నదుల అనుసంధానానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు హారతి ఇచ్చారు. కృష్ణమ్మ చెంతకు గోదావరి జలాలు చేరిన చోట హారతి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రతి ఏటా మూడు వేల క్యూసెక్కుల గోదావరి నీరు వృధాగా సముద్రంలోకి పోయేదని ఆయన అన్నారు. ఆ నీరు వృధాగా పోకుండా సిఎం చంద్రబాబు పట్టిసీమ నిర్మాణం చేశారని గుర్తుచేశారు.

తాను 2014- 19 మధ్య ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు స్వయంగా ఆ పనులు తాను చూశానని నిమ్మల వెల్లడించారు. అసెంబ్లీలో ఆనాడు జగన్, పట్టిసీమను వట్టిసీమ అని హేళన చేశారని మండిపడ్డారు. ఇప్పుడు ఈ పట్టిసీమ ద్వారా 13 లక్షల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. చంద్రబాబు ముందుచూపు ఎలా ఉంటుందో, పట్టిసీమ నీరు ఉపయోగిస్తుండడమే ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని స్పష్టం చేశారు. పట్టిసీమ కట్టినప్పటి నుంచి ఇప్పటివరకు కృష్ణ డెల్టాకు 263 టీఎంసీల నీటిని ఇచ్చామని నిమ్మల వివరించారు.

ఇప్పటివరకు 50వేల కోట్ల రూపాయల సంపదను ఈ పట్టిసీమ ఇచ్చిందని మంత్రి తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో ఒక్క లిఫ్టుకు కూడా జగన్ ప్రభుత్వం మరమ్మతులు చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి లిఫ్టులను మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి నిమ్మల వెల్లడించారు. వైఎస్సార్సీ ప్రభుత్వంలో షట్టర్లకు కనీసం గ్రీస్ కూడా పెట్టలేదని నిమ్మల ఆక్షేపించారు. గత ప్రభుత్వ పాపాలు మనకు శాపాలుగామారాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌వద్ద రిపేర్ పనులకు ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ధవళేశ్వరం, శ్రీశైలం ప్రాజెక్టుల >>2

# డిసెంబరుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు

## నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు



బుధవారం నిర్మాణంలో ఉన్న క్వార్టర్లు పరిశీలిస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, జులై9, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతి క్వార్టర్స్‌లోనే ఉంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అమరావతిలో నిర్మాణంలోఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లను సభాపతి అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. రాజధాని అమరావతిలో పనులు ఊపందుకున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శాశ్వత సచివాలయం, హైకోర్టు నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి. గత నెలలో అమరావతికి వచ్చిన నిపుణుల బృందం ఐకానిక్ టవర్లు, శాశ్వత హైకోర్టుపునాదులను పరిశీలించింది. వారి సూచనల మేరకు ముందుకు సాగుతున్నారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల >>2

# మామిడి రైతులు రౌడీలా?

## తోతాపురి కేజీకి రూ.12 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్

## బంగారుపాళ్యం మార్కెట్ యార్డు మామిడి రైతుల పరామర్శలో మాజీ సిఎం జగన్



బుధవారం మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వానికి మామిడి రైతులు రౌడీల్లా కన్పిస్తున్నారా! మామిడిరైతులను పరామర్శించడానికి వస్తున్న తనవద్దకు రావడానికి మామిడి రైతులు ప్రయత్నిస్తే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తారా! చిత్తూరు జిల్లాలో 500మంది మామిడి రైతులు మాత్రమేవున్నారా! చిత్తూరు జిల్లాలో 76 వేల మామిడి రైతులు వున్నారనే విషయం సైతం ప్రభుత్వం మరచిపోయిందని మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేయడంతో పాటు మామిడి రైతులను పరామర్శించడానికి బుధవారం వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మామిడి మార్కెట్ యార్డులో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుటున్నాడన్నారు. చిత్తూరు జిల్లాలో మే మూడవ వారంలో పల్ప్ ఫ్యాక్టరీలు ప్రారంభించాల్సివుండగా జూన్ 3వ వారం నాటికి సైతం ప్రారంభించలేదన్నారు. పల్ప్ ఫ్యాక్టరీలపై ఒకేసారి ఒత్తిడి పెరగడంతో పల్ప్‌ఫ్యాక్టరీలు రైతులనుండి మామిడి కొనుగోలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం మామిడి రైతుకు కేజీకి రూ.12 చెల్లిస్తామని ప్రకటించిందని, ఇందులో ఫ్యాక్టరీలు కేజీకి రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం కేజీకి రూ.4 సబ్సిడీ ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఫ్యాక్టరీలు, ప్రభుత్వం ఎంత మంది రైతులకు కేజీకి రూ.12 చెల్లించారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరోజు మామిడి రైతులు రోడ్డెక్కిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతు జీవితం సర్వనాశం అయ్యిందని, పంటలు సాగు చేసిన ప్రతి రైతు మద్దతు ధర కోసం రోడ్డెక్కి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నిన్నటి వరకు ఫ్యాక్టరీలు మామిడి రైతుకు కేజీ తోతాపురి మామిడికి రూ.3, రూ.2.50 చెల్లించేవని, ఈ వేళ ఇక్కడికి తాను రావడంతో కేజీకి రూ.4 చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వం మామిడి రైతు ప్రతి ఒక్కరికి కేజీకి రూ.12 వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



## వాహనాలకు భారీగా గ్రీన్‌టాక్స్ తగ్గింపు

### - మంత్రి కె. పార్థసారథి

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఎపి సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ హడ్కో నుంచి తీసుకున్న రుణాలకు గ్యారంటీ ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి వెల్లడిం >>2

# రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా మాధవ్ బాధ్యతల స్వీకరణ

## విజయవాడలో లెనిన్ సెంటర్‌ను విశ్వనాథ సెంటర్‌గా పిలవాలని పిలుపు



బిజెపి ఎపి అధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవ్

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి ఎపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు పివిఎన్ మాధవ్ విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఎపి బిజెపి నూతన అధ్యక్షుడిగా మంత్రి సత్యకుమార్ యాదవ్,ఎంపీ పురందేశ్వరి తదితరుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాకంటే ముందు అధ్యక్షులైనవారి శక్తియుక్తులతో ముందుకువెళ్తాను అన్నారు. ప్రతీ కార్యకర్త తానే అధ్యక్షుడయ్యానని అన్నంతగా పని చేస్తున్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పలుకుతూ ఒక నిర్ణయాన్నిచ్చారని పేర్కొన్నారు. బిజెపి ఇచ్చిన ఈ పదివిని గౌరవంగా భావించి పని చేస్తాను. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించాను. కవిసామ్రాట్ విశ్వనాథ్ సత్యనారాయణకు నివాళులు అర్పించాను. రాష్ట్రానికి శాసన భాషగా తెలుగు ఉండాలని అని ఒక శాసన నిఘంటువు తయారు చేసిన విశ్వనాథ సత్యనారాయణకు నివాళులర్పించాను అని పేర్కొన్నారు మాధవ్. అయితే ఎపి బిజెపి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి ముందు తుమ్మలపల్లి >>2

# కుప్పంలో ప్రతిగ్రామానికి ఇ-ఆటోలు



## ఎయిర్‌పోర్టు పనులు డిసెంబర్‌లో మొదలు

### 110కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైన్ల నిర్మాణానికి చర్యలు: కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

**కుప్పం, జులై 9 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో దేశంలోనే తొలిసారిగా కుప్పంనియోజకవర్గంలో ప్రతి గ్రామానికి చెత్త సేకరణకై ఇ -ఆటోలు ఏర్పాటుచేస్తున్నట్లు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడ ప్రాంత అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థచే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కుప్పంలో ఎయిర్ పోర్టుకు భూసర్వే పూర్తయిందని త్వరలోనే అవార్డు పాస్ (పరిహారం)చేస్తామని పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో పనులు మొదలు పెడతామన్నారు.చిన్న చిన్న సమస్యలు ఉన్న రైతులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన రైతులకు 13కోట్ల బకాయిలు ఉండగా వడ్డీతో కలిపి డబుల్‌గా 25 కోట్లు చెల్లించాలని సిఎం చంద్ర బాబు ఆదేశించారన్నారు. కుప్పం నియోజక వర్గంలో త్వరలోనే 110 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైన్ల నిర్మాణ పనులకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలోనే కుప్పంలో ఆరు పెద్ద పరిశ్రమలు వచ్చాయన్నారు. వీటిద్వారా 13వేల ఉద్యోగాలు ఖరారవుతాయన్నారు.

## సచివాలయ ప్రవేశ విధానంలో మార్పులు

**విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సచివాలయంలో భద్రతను ఎపి ప్రభుత్వం కట్టుదిట్టం చేస్తోంది. ఆ క్రమంలో ప్రవేశద్వారాల వద్ద నూతన సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని పరికరాలూ వచ్చాయి. ప్రవేశద్వారాల వద్ద వాటిని అమరుస్తున్నారు. అది పూర్తికాగానే సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, పాత్రికేయులకు స్మార్ట్‌కార్డులు ఇవ్వనున్నారు. గుర్తింపు కార్డునకు అదనంగా ఇది ఉంటుంది. ప్లెయిన్‌గా ఉండే ఈ కార్డులోని చిప్‌లో మనకు సంబంధించిన అన్ని వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. దీన్ని స్కాన్ చేయగానే...డేటాబేస్‌లో ఉన్న వివరాలతో సరిపోల్చి టకొని ఆటోమేటిక్‌గా తలుపులు తెరుచుకుంటాయి. బెంగుళూరుకు చెందిన 'సత్యాలజీ'అనే సంస్థకు ప్రభుత్వం ఈ భాధ్యతలు అప్పగించింది. వారం రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామని సంస్థ ప్రతినిధులుతెలిపారు. వాహనాల్లోవచ్చే ఉద్యోగులు, సిబ్బందికి రేడియో ఫ్రీకేన్సీ గుర్తింపు (ఆర్ఎఫ్ఐడీ)ను ఇస్తారు. ఈ ఆర్ఎఫ్‌డీ స్టిక్కర్‌ను వాహనం ముందు అతికిస్తారు. దాన్ని 'బూమ్ వారియర్' స్కాన్ చేస్తుంది. అనంతరమే గేట్లు తెరుచుకుంటాయి. ఫాస్ట్ ట్యాగ్ తరహాలో ఇది పని చేస్తుంది. ఇందుకు ఉద్యోగుల వాహనాల నెంబర్లను ఓ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయనున్నారు.

# నేడు మెగా 'పేరెంట్-టీచర్స్' మీట్

## హాజరుకానున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

## 2 కోట్ల మంది టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చే అవకాశం


**విజయవాడ, జులై 9, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఒకే రోజున 2 కోట్ల మందితో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ప్రభుత్వం నిర్వహించనుంది. విద్యార్థులు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు...ఇలా అందరినీ ఒక చోటుకు ప్రభుత్వం తీసుకొస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది రెండో కార్యక్రమం. రేపు పుట్టపర్తి నియోజకవర్గం, కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ హాజరు కానున్నారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఉపాధ్యాయులతో సిఎం మాట్లాడనున్నారు. ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, జూనియర్ కాలేజీలలో మెగా పిటిఎం 2.0ను ఒక ఉత్సవంలా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 74,96,228 మంది >>2



బుధవారం నమీబియాలోని విండ్‌హోక్‌లో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ప్రవాసభారతీయులు

## నమీబియా అత్యున్నత పురస్కారం

>> ఉందని వ్యాఖ్యానించారు. నమీబియాలో శాంతి, సమన్యాయం స్థాపనకోసం సామాజిక ఆర్థిక అభివృద్ధికోసం ప్రధాని మోదీ అవిరళ కృషిచేసారని ఆమె ఈసందర్భంగా పేర్కొన్నారు. కేవలం నమీబియాకే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా శాంతిసామరస్యం కోసం విశేష కృషిచేసారన్నారు. ఈ పురస్కారంతో ప్రధానిమోదీ ప్రపంచ దేశాలనుంచి 27 అత్యున్నత పురస్కారాలను అందుకున్నట్లయింది. ప్రస్తుత పర్యటనలో ఇది నాలుగో పురస్కారం. 1995లో స్థాపించిన ఈపురస్కారాన్ని 1990లో నమీబియా స్వాతంత్ర్యం పొందినప్పటినుంచి అమలులోకి తెచ్చారు. విశిష్టరంగాల్లో నమీబియాకోసం అందించిన సేవలు, నాయకత్వ లక్షణాలున్న ప్రముఖులు, విదేశీ ప్రముఖులకు ఈపురస్కారాన్ని అందచేస్తున్నారు. నమీబియాలో అత్యంత పేరున్న ప్రముఖ ఎడారిమొక్క వెల్‌విట్చియా మిరాబిలిస్ పేరుతో ఈ అవార్డును అందిస్తున్నారు. అంతకుముందు ప్రధానిమోదీ నమీబియా అధ్యక్షురాలు నెటుంబో నాండిఎన్‌డైత్వాతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. డిజిటల్ టెక్నాలజీ, రక్షణరంగం, భద్రత, వ్యవసాయం, హెల్త్‌కేర్, విద్యారంగం, సంక్లిష్ట ఖనిజ వనరులవంటి వాటిపై సహకరించుకోవాలని నిర్ణయించారు. ప్రతినిధిబృందం స్థాయిలో ఇరువురునాయకులు భారత్ నమీబియా సంబంధాలను పునఃసమీక్షించారు. వాణిజ్యం, ఇంధనం, పెట్రోకెమికల్స్ రంగాల్లోపరస్పర సహకారంపైనా విస్తృత స్థాయిలో చర్చలు జరిపామన్నారు. ప్రాజెక్టుచీతాలో నమీబియా సహకారాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించిన ప్రధానిమోదీ ఆదేశ అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అతిథిగృహంలో ఉభయులమధ్య చర్చలుజరిగిన తర్వాత నాలుగు ఒప్పందాలు జరిగాయి. హెల్త్, ఔషధాలు, నమీబియాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి కేంద్రం ఏర్పాటు, సిడిఆర్ఐ ఫ్రేమ్‌వర్క్, గ్లోబల్ బయోఫ్యూయల్స్ ఫ్రేమ్‌వర్క్ విభాగాల్లో ఈఒప్పందాలు చేసుకున్నారు. నమీబియాలో భారత ప్రధానిహోదాలో నరేంద్రమోదీ పర్యటన ఇదే మొదటిసారికాగా ఈ ఆఫ్రికా దేశంలో మూడుసార్లు భారత ప్రధానులు పర్యటించినట్లయింది.



బుధవారం మంత్రి లోకేష్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న బిజెపి నూతన అధ్యక్షుడు మాధవ్

## రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుపై అడ్వోకేట్స్ కమిటీ!

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు అంశంపై ఏపీ హైకోర్టు సందేహాన్ని వ్యక్తం చేసింది. ఈ అంశంపై అడ్వోకేట్ కమిటీ వేస్తామని వెల్లడించారు. ఒక హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా విజయవాడ మూడవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నివేదికను హైకోర్టు ధర్మాసనం పరిశీలించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఒక సీసీ కెమెరా మాత్రమే ఉన్నట్లు మేజిస్ట్రేట్ నివేదికలో పేర్కొన్నారని గుర్తుచేసింది. అయితే, స్టేషన్‌ను వ్యక్తిగతంగా తనిఖీ చేసి రాజా మొత్తం కవర్ అయ్యేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు విజయవాడ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సర్టిఫై చేస్తూ కోర్టుకు సమర్పించిన నివేదిక పేర్కొన్నారని తెలిపింది. పరస్పర భిన్న నివేదికల నేపథ్యంలో ఎవిడెన్స్‌ను సమర్పించిన నివేదికల వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీని ఏర్పాటు చేస్తామని హైకోర్టు పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పోలీసుస్టేషన్లల్లో పర్యటించి ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు? స్టేషన్ మొత్తం కనిపించేలా ఏర్పాటు చేశారాలేదా? తదితర అంశాలపై కమిటీ నుంచి నివేదిక కోరతామని పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ని స్టేషన్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసిందో వివరాలు తమ ముందు ఉంచాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ని ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆ మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని 2019 జులై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాకపోవడంతో యోగేష్ 2022లో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడుజిల్లా, మాచవరం పోలీసులు తన పోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారంటూ కటారు నాగరాజు గతేడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పోలీసు యంత్రాంగం ఏపీ హైకోర్టుకు వివరించింది. ఇందుకు సంబంధించి ఆయా డిఎస్‌పిలు రూపొందించిన నివేదికలు హైకోర్టుకు సమర్పించారు.

పోలీస్ స్టేషన్ లోపల, బయట కనబడేలా వాటిని ఏర్పాటు చేశామన్న నివేదికలపై హైకోర్టు సందేహాలను లేవనెత్తింది. సిసి కెమెరాల ఏర్పాటుపై వాస్తవాల నిర్ధారణ కోసం అడ్వకేట్స్ కమిటీ వేస్తామని స్పష్టం చేసింది. పోలీసులు ఇచ్చిన నివేదికలో క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదని వ్యాఖ్యానించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పిఎస్‌పై నిర్వహించిన తనిఖీల్లో వాళ్ల పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు ఎందుకు చేయలేదో చెప్పాలంది. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అన్నీ కనిపించేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని విజయవాడ అసిస్టెంట్ కమిషనర్ నివేదిక ఇచ్చారని, ఇక్కడికి వెంచిన మరో కేసులో సంబంధిత మెజిస్ట్రేట్ మాత్రం కేవలం ఒక్క సిసి కెమెరా ఉందని తమకు నివేదిక ఇచ్చారని చెప్పింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అన్ని పిఎస్‌లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ 2019లో వేసిన పిల్‌ను మంగళవారం జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలో 1,392 పోలీస్ స్టేషన్లు ఉంటే 1,001 స్టేషన్లలో మాత్రమే సిసి కెమెరాలు ఉన్నాయని పిటిషనర్ వాదన. లాకప్‌లున్న అన్ని పిఎస్‌లలో ఏర్పాటు చేశామని ప్రభుత్వ వాదన. లాకప్‌లు లేనిచోట కెమెరాలు పెట్టలేదని చెప్పింది.

## ముఖ్యమంత్రి పర్యటన సాగేది ఇలా..

**సత్యసాయి జిల్లా, జులై 09, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువులో మెగా పేరెంట్ టీచర్ మీట్ (పిటిఎం) కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేయనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఇలా కొనసాగనుంది. అధికార వర్గాలు తెలియజేసిన మేరకు ముఖ్యమంత్రి పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ముఖ్యమంత్రి ఉదయం 8 గంటలకు ఉండవల్లి నుండి విజయవాడ ఎయిర్‌పోర్ట్ బయలుదేరి 8:10 కి చేరుకుంటారు. 8.15 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుండి బయలుదేరి ఉదయం 9 గంటలకు శ్రీ సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. 9:10 గంటలకు ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరి 9:25 గంటలకు కొత్తచెరువులోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 9:30 గంటల నుండి 9:50 గంటల వరకు విద్యార్థుల వారి తల్లిదండ్రులతో ఇష్టాగోష్టి నిర్వహిస్తారు. 9:55 నుండి మధ్యాహ్నం 1:00 వరకు మెగా పేరెంట్ టీచర్ మీట్ సభలో పాల్గొంటారు. ఒంటిగంటకు కొత్తచెరువులోని బాలుర జడ్పీహెచ్‌ఎస్ స్కూలను సందర్శించి అక్కడినుండి పుట్టపర్తి ప్రశాంతి నిలయంకు 1:15 గంటలకు చేరుకుంటారు. 02:15 గంటల వరకు ప్రశాంతి నిలయంలో గడిపిన అనంతరం అక్కడి నుండి బయలుదేరి 02:25 గంటలకు శ్రీ సత్య సాయి విమానాశ్రయంకు చేరుకోనున్నారు. 02:35 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 3:30 గంటలకు విజయవాడ విమానాశ్రయంకు బయలుదేరి వెళ్లనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.

## లోకేష్‌ను కలిసిన రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడు మాధవ్

**విశాఖపట్నం ప్రతినిధి, జులై 9, ప్రభాత వార్త :** రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన పివిఎన్ మాధవ్... మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లి నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్... మాధవ్‌ను మంగళగిరి శాలువాతో సత్కరించారు. ప్రతిపక్షంలో ఉండగా శాసనమండలిలో ప్రజాసమస్యలపై కలిసి పోరాడిన సందర్భాన్ని ఇద్దరు నేతలు నెమరు వేసుకున్నారు. మృదు స్వభావిగా పేరున్న మాధవ్‌కు రాష్ట్ర సమస్యలపై సంపూర్ణ మైన అవగాహన ఉంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని లోకేష్ అన్నారు.

## డిసెంబరుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు

>> క్వార్టర్లను సభాపతి అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. ఈ డిసెంబర్ నాటికి అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతి క్వార్టర్స్‌లోనే ఉంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అక్కడ జోరుగా పనులు సాగుతున్న పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని నివాస సముదాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. చట్టసభ సభ్యులకోసం మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 35 మంది మంత్రులు, 36 న్యాయమూర్తుల క్వార్టర్స్ మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ నివాస సముదాయాలు మంత్రుల క్వార్టర్స్‌తో పాటే ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూడాలని సూచించారు. స్విమ్మింగ్ పూల్, ఆసుపత్రి, క్లబ్ హౌస్ వంటివి కూడా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను స్పీకర్ ఆదేశించారు. సోలార్, గ్రౌండ్ వాటర్ రీఛార్జ్, వేస్ట్ వాటర్ యూజెస్ వంటి అన్ని వసతులు ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం, రాజ్ భవన్‌లు కృష్ణా నది వెంబడి ఉంటాయన్నారు.అమరావతి నిర్మాణానికి మలివిడతలో మరో 34,964 ఎకరాల సేకరణకు సిఆర్‌డిఎ ఇప్పటికే ఆమోదం తెలిపింది.తొలివిడతలో ఇచ్చిన ప్యాకేజీనే దీనికీ వర్తించనుంది. అలాగే రాజధానిలో 58 ఎకరాల్లో పిపిఎవిధానంలో నివాస, మిశ్రమఅభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని అథారిటీ సమావేశంలో నిర్ణయించారు.. మరికొన్ని సంస్థలకు సైతం భూకేటాయింపులు చేస్తూ ఆమోదం తెలిపారు.

మహిళ సాధికార సభ్యుల సదస్సు సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతి వేదికగా చట్టసభల జాతీయ మహిళ సాధికార సభ్యుల సదస్సు ఉంటుందని శాసనసభపతి అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో సభాపతి అయ్యన్నపాత్రుడు మీడియాతో ముచ్చటించారు. ఏపీ ఆతిథ్యం ఇవ్వాలన్న పార్లమెంట్ స్పీకర్ సూచన మేరకు దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. దాదాపు 500 మంది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొంటారన్నారు.

## మాధవ్ బాధ్యతల స్వీకరణ

>> కళాక్షేత్రం వద్ద బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన మాధవ్ అనంతరం ర్యాలీగా బిజెపి రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన వెంట భారీ సంఖ్యలో బిజెపి శ్రేణులు తరలివచ్చారు. ఇక, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పుష్ప మాల వేసి బాధ్యతలు స్వీకార కార్యక్రమానికి పివిఎన్ మాధవ్ బయలుదేరారు. అయితే ఈ సందర్భంగా పుస్తకప్రియులకు స్వర్గధామంగా ఉన్న విజయవాడలోని లెనిన్ సెంటర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. లెనిన్‌కి భారత దేశానికి ఎటువంటి సంబంధం లేదన్న ఆయన విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం చుట్టూ మంచి వాతావరణం నిర్మాణం చేయాలి. వారి పట్ల నిర్లక్ష్యం తగదు అన్నారు. ఇక మీదట ఇది లెనిన్ సెంటర్ కాదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సెంటర్‌గా పిలవాలిఅంటూ వ్యాఖ్యానించారు పివిఎన్ మాధవ్. ఇక సంస్థాగతంగా సభ్యత్వాలు ఎన్నికలు సంపూర్ణంగా జరిగాయి. బిజెపి ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పని చేయడం వల్ల 25 లక్షల సభ్యత్వం చేరుకున్నాం అన్నారు. బిజెపి ఎంపి పురందేశ్వరి బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం ఆధారంగా అన్నిస్థాయిలలో అధ్యక్షుల ఎన్నిక జరిగింది. జాతీయ కౌన్సిల్ మెంబర్ల నియామకం కూడా జరిగింది. మాధవ్ తండ్రి చలపతిరావు పోరాట పటిమ కలిగిన వ్యక్తి ఎమర్జెన్సీలో కూడా చలపతిరావు దంపతులు జైలుకువెళ్లారు. సంస్థాగత అంశాలపట్ల పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి మాధవ్ అని పేర్కొన్నారు. కార్యకర్తలు అందరూ బిజెపి కుటుంబసభ్యులు రెండు సంవత్సరాల నా ప్రస్థానంలో నాకు సహకారం అందించిన వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు పురందేశ్వరి. ఇక రాష్ట్ర కార్యకర్తలు అందరూ మాధవ్‌ని అధ్యక్షుడిగా స్వాగతిస్తున్నారు. మాధవ్ అధ్యక్షుడుగా ప్రకటన జరిగాక పాజిటివ్ వైబ్రేషన్స్ వచ్చాయి అన్నారు. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు రాష్ట్రంలో బిజెపిని మంచి స్థాయికి తీసుకెళ్లే పరిస్థితులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో బలోపేతం అవ్వడమే ఎమ్మెల్సీ సోము వీర్రాజు బిజెపి ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

## వాహనాలకు భారీగా గ్రీన్‌టాక్స్ తగ్గింపు

>> చారు. ఈ నిర్ణయంతో పాటుఅమరావతిలో వరల్డ్ ఎకానమీ ఫోరం నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది. కుళాయి నీరు అందించేందుకు రూ.10 వేలకోట్ల రుణాల సమీకరణకు క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటు ద్వారా రూ.4 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావిస్తున్నాం. ఎపి స్పేస్ పాలసీ 2025-30కి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. వైకాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్‌ట్యాక్స్‌ను దారుణంగా పెంచింది. దాన్ని రూ.3 వేల వరకు తగ్గించాం అని పార్థ సారథి తెలిపారు.గ్రీన్ ట్యాక్స్ రేటును తగ్గిస్తూ, ఈ వాహనాలు చెల్లించే త్రైమాసిక పన్నుపై ఆధారపడటం కాకుండా కొత్త పన్ను రేట్లను రూ.1,500 మరియు రూ.3,000/ గా నిర్ధారించారు. ఈ నిర్ణయం ద్వారా 9,56,429 మందికి లబ్ధి చేకూరనుంది.కాలం చెల్లిన వాహనాల సంఖ్యను తగ్గించడానికి గ్రీన్ ట్యాక్స్ పెంచే అవకాశం కేంద్రంఇవ్వగా గత ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్‌ను భారీగా పెంచింది. గతంలో ఏడేళ్లు దాటిన సరకు, ప్రజా రవాణా వాహనాలకు ఏడాదికి రూ.200 ఫీజు ఉండేది. కానీ గత ప్రభుత్వం దానిని మార్చి ఎక్కువ పన్నులు వేసింది. 7-10 ఏళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను, 10-12 ఏళ్ల వాహనాలకు ఒక త్రైమాసిక పన్ను, 12 ఏళ్లు దాటిన వాహనాలకు రెండు త్రైమాసికాల పన్నులు వసూలు చేసే విధానాన్ని 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. దీనివల్ల వాహనదారులపై చాలా భారం పడింది. లారీ యజమానులు చాలా ఇబ్బంది పడ్డారు. గత విధానంలో ఏడాదికి రూ.20 వేల వరకు ఉన్న పన్నును ఇప్పుడు రూ.1,500 నుంచి రూ.3 వేలకు తగ్గించారు. ఈ నిర్ణయం ద్వారా 9,56,429 మందికి లబ్ధి చేకూరనుంది.

## నేడు మెగా 'పేరెంట్-టీచర్స్' మీట్

>> విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 మంది తల్లిదండ్రులు, దాతలు ఈ వేడుకలో పాల్గొనున్నారు. మొత్తంగా 2.28 కోట్ల మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ మెగా పేరెంట్ టీచర్ సమావేశం సరికొత్త రికార్డు సృష్టించనుంది. ఇక ప్రతీ ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ సమావేశాన్ని పిటిఎం పేరిట ప్రభుత్వం నిర్వహించనుంది. కార్పొరేట్ స్కూళ్లకు మాత్రమే పరిమితమైన ఈ పేరెంట్ టీచర్ మీటింగ్స్‌ను ప్రభుత్వ అధీనంలో నడిచే పాఠశాలలో నిర్వహించాలని మంత్రి నారా లోకేష్ సంకల్పించారు. ఈ మేరకు వరుసగా రెండో ఏడాదికూడా పండుగవాతావరణంలో విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర భాగస్వాములతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

**తల్లిదండ్రులకు పురోగతి కార్డుల అందజేత**

తమ పిల్లలు చదువులో ఎంత పురోగతి సాధిస్తున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉంది, సామాజిక సమస్యలపై అవగాహన చేసుకుంటున్నారా అనే అంశాలపై తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది. అంతేకాదు...విద్యార్థుల చదువులకు సంబందించిన సమగ్ర పురోగతి కార్డులను తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించనుంది.

తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయాలను, సూచనలను ఈ వేదిక ద్వారా ప్రభుత్వంతో పంచుకోవచ్చు. పాఠశాల విద్యలో పనితీరు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై చర్చించుకునే సదావకాశం ఈ కార్యక్రమం ద్వారా కలగనుంది.

## అడ్డంకులు సృష్టిస్తే సహించం

>> నాదెండ్ల మనోహర్‌కి ప్రభుత్వం అప్పగించింది.ఇదే అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ.672కోట్లు విడుదలకు మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 32 వేల మంది రైతులకు ఈ నిధులు మంజూరు ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో పెండింగ్ బకాయిలు జమ చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ప్రజా పంపిణీ అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థ ద్వారా గత రబీ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించింది. ఆ క్రమంలో మద్దతు ధరను రైతుల ఖాతాల్లో జమ చేయడంలో జాప్యం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1,000 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతిస్తూ జులై 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది .ఈ నిధులు వచ్చిన వెంటనే ధాన్యం బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసేలా పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు చేపట్టనున్నారని మంత్రి సమావేశంలో వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైఎస్సార్సీ చూస్తుందని కేబినెట్‌లో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. ఎపిఎండీసీ బాండ్లల్లో పెట్టుబడులు పెట్టవద్దని ఈ మెయిళ్లు పెట్టారని తెలిపారు. 200 కంపెనీలకు తప్పుడు ఈ మెయిళ్లు పెట్టారని సిఎం చంద్రబాబు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. వైఎస్సార్సీనే తమ పార్టీ సానుభూతిపరుడితో ఈ మెయిళ్లు పెట్టించిందని చెప్పారు. అదేవిధంగా అమరావతికి నిధులు రాకుండా తప్పుడు ఫిర్యాదులు చేసిందని, ఈ మెయిళ్ల అంశాన్ని కూడా తీవ్రంగా పరిగణించాలని మంత్రులు సిఎంకు తెలియజేశారు. ఈ క్రమంలో వీటిపై చంద్రబాబు స్పందించారు. ప్రభుత్వ బ్రాండ్ దెబ్బతినేలా వివిధ సంస్థలకు ఈ మెయిళ్లు పెట్టడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. నిధులు రాకుండా తెరవెనుక అడ్డుకోవడం వారికి అలవాటుగా మారిందని ఆరోపించారు. పథకాలు ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తుందని ఆక్షేపించారు. వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. రాజధానికి మలివిడతలో 34,964 ఎకరాల భూ సమీకరణకు ఆమోదం.13 గ్రామాల పరిధిలో ఈ భూ సమీకరణ,అమరావతి నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను కృష్ణానది నుండి డ్రెడ్జింగ్,సిబిఐ,జడ్ఎస్ఐ భూములు కేటాయించే అంశాలపై చర్చించారు.స్పోర్ట్స్ అకాడమీకి భూముల కేటాయింపుపై చర్చ జరిగింది.జలవనరుల శాఖలో 71 పనులకు ఆమోదం తెలపనున్నారు. జలవనరుల శాఖలో వివిధ మీడియం ప్రాజెక్టుల మరమ్మత్తులకు నిధులపై చర్చించారు. ఎపి జలజీవన్ నీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటుపై కేబినేట్‌లో చర్చ జరిగింది. ఎపి మోటార్ వెహికల్ బిల్లులో పలు చట్ట సవరణలు,పరిశ్రమలు,కార్మిక బిల్లులో పలు చట్ట సవరణలు చేసే అంశంపై చర్చించారు.అమరావతి పరిధిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అమరావతి పరిధిలో భూమి లేని 1,575 పేద కుటుంబాలకు పింఛన్ కొనసాగింపుపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్ కొనసాగించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.సమావేశంలో అభివృద్ధి పథకాలకు అడ్డంకులు సృష్టించాలనుకుంటున్న వైకాంగ్రెస్‌పార్టీకి తీవ్ర స్థాయిలో గుణపాఠం చెప్పాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.ఇంటింటికి మంచి నీటిని అందించే దిశలో ఎపి జలజీవన్ నీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటుపై ఆయన సమావేశంలో ప్రస్తావించారు.సీఎం చంద్రబాబు ఇదే సమావేశంలో కొందరు మంత్రులు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య లిమిటెడ్‌కు (ఇప్పటికే పొందిన రూ.6700.00 కోట్ల రుణంతో పాటు) రూ.1000.00 కోట్ల అదనపు రుణాన్ని మంజూరు చేయడానికి, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుండి క్రెడిట్ పొందేందుకై ప్రభుత్వ హామీని పొడిగిస్తూ మరియు 2024- 25 రబీ కార్యకలాపాల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను (పెండింగ్‌లో ఉన్న రైతు బకాయిల కోసం) తీర్చడానికి మరియు వాటా మూలధనాన్ని 10 కోట్ల నుండి 20 కోట్లకు పెంచడానికి ఇంటర్‌కార్పొరేట్ లోన్‌గా విజయవాడలోని స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు బదిలీ చేయడానికి జీవో నెంబరు.25, వ్యవసాయ కోఆపరేటివ్ విభాగం, ద్వారా జారీ చేయబడిన ఉత్తర్వులను ఆమోదించడానికి వ్యవసాయ,సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

కోకో రైతులకు సరసమైన ప్రోత్సాహక ధరలను అందించడానికి, వారి ఆర్థిక ప్రగతికి మద్దతునివ్వడానికి, రాష్ట్రంలో కోకో సాగును స్థిరీకరించేందుకు మరియు నష్టాలతో అమ్ముకోకుండా రైతులను రక్షించడానికి ప్రభుత్వ మద్దతు ధరగా కిలోకు రూ. 50/ చొప్పున రూ. 14.884 కోట్లు మంజూరు చేయడానికి మరియు ప్రస్తుత సీజన్‌లో నిర్దేశించిన అమ్ముడుపోని 2976.76 మెట్రిక్ టన్నుల కోకో గింజలను ప్రామాణిక ఆపరేటింగ్ విధానంతో సేకరించేందుకు వ్యవసాయ మరియు సహకార శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

### వారం - వర్జ్యం

10-07-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు
పౌర్ణమి రా.2.05
పూర్వాషాఢ పూర్తి
వర్జ్యం : మ.2.52-4.33
దు.ఉ.10.03-10.55, 2) మ.3.16-4.08
శుభసమయం:ఉ.6.15-7.00, సా.6.10-7.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల సహాయంతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తిచేస్తారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**వృషభం:** ఆస్తి వ్యవహారాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి. వివాహం ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**మిథునం:** కొంతకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**కర్కాటకం :** జీవిత భాగస్వామి సహాయ సహకారాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వస్తులాభాలు.

**సింహం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు.ఆస్తి వ్యవహారాలో ఎదురైన చికాకులు కొంతవరకు తీరుతాయి.

**కన్య :** కాంట్రాక్టులు అతికష్టం మీద దక్కించుకొంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి కొంత అనుకూలంగా వుండును.

**తుల :** మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**వృశ్చికం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.సంతానం నాకు సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మకరం:** కొత్త కార్యక్రమాలకం, వ్యాపారాలు ప్రారంభిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మీనం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నదుల అనుసంధానమే లక్ష్యం

>> మరమ్మతులకు రూ. 350 కోట్ల నిధులు విడుదల చేశామని వెల్లడించారు. శ్రీశైలం ప్రాజెక్టు జాతి సంపద అని, మనం దాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వెంటిలేటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థను ఐసీయూలకు తెచ్చామని వ్యాఖ్యానించారు. నీళ్లు పారించాలని చంద్రబాబు అనుకుంటూ ఉంటే, జగన్ రప్పరప్ప అంటూ రక్తం పారించాలనుకుంటున్నారని నిమ్మల దుయ్యబట్టారు. మహిళలను కించపరిచే సంస్కృతి వైఎస్సార్సీ అధినాయకత్వం నుంచి ఉందని మండిపడ్డారు. ఆరోజు చెల్లిని తల్లిని జగన్ అవమానించారని, ఇవాళ కూడా ఆ పార్టీ అదే తీరులో ఉందని దుయ్యబట్టారు. పట్టిసీమ నిర్మాణమైన రోజు నుంచి ఇప్పటి వరకూ గోదావరి వరద జలాలను కృష్ణా డెల్టాకు ఉపయోగించుకుంటున్నామన్నారు. రాయలసీమకు సంబంధించిన ఏ రిజర్వాయర్‌ను చూసినా 90 నుంచి 95 శాతం నీటి సామర్థ్యంతో నిల్వ చేయగలిగాం. దీనికి ప్రధానంగా సీఎం చంద్రబాబు ముందుచూపు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అప్పట్లో కేవలం రూ.1300 కోట్లతో పట్టిసీమను నిర్మిస్తే ఇప్పుడు దాని ద్వారా రూ.50,000 వేల కోట్ల సంపదను సృష్టించిందంటే ఇది కృష్ణాడెల్టాకు వరప్రదాయినిగా భావించవచ్చునన్నారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన క్వాంటమ్ వ్యాలీకి భూమి

**విజయవాడ, జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి రాజధాని అమరావతిలో స్థల సేకరణ దిశలో కార్యచరణను చేపట్టారు. రూ.4వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ కోసం ఉద్దండరాయునిపాలెం,లింగాయపాలెం మధ్య సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది.ఈ స్థలంలో మట్టి పరీక్షలు నిర్వహించారు.జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయి. ఈ-3 రోడ్డు,ఎన్-10 రోడ్డు అనుసంధానమయ్యే ప్రాంతంలో ప్రాజెక్టు రానుంది. క్వాంటమ్ వ్యాలీ లోని ఐకానిక్ భవనం కోసం డిజైన్లు తయారవుతున్నాయి. సిద్ధమైన వాటిలో సిఎం చంద్రబాబు పలుమార్పులు సూచించారు. దీంతో నమూనాకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ఖరారైనతర్వాత టెండర్లు పిల్చి కాంట్రాక్టరును ఎంపిక చేయనున్నారు.వచ్చే జనవరి నాటికి క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో అందుబాటులోకి తీసుకుని రావాలని ఎపి ప్రభుత్వం భావిస్తోంది.,అనుకున్న సమయానికి వ్యాలీని పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది.

## హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్మోహన్ రావు అరెస్టు

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** గత మార్చిలో జరిగిన ఐపిఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు (ఎస్ఆర్‌హెచ్)ను టికెట్ల విషయంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఘటనలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు సహా ఇతర సభ్యులను సిఐడి అధికారులు బుధవారం నాడు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అప్పట్లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలకు సంబంధించి కీలక పత్రాలను కూడా సిఐడి జప్తు చేసింది. అనంతరం అరెస్ట యిన వారిని లక్‌డికాపూల్‌లోని సిఐడి కార్యాలయానికి తరలించి అక్కడ ప్రశ్నిస్తున్నారు.

బిసిసిఐ పరిధిలో దేశ వ్యాప్తంగా వున్న రాష్ట్రస్థాయి క్రికెట్ సంఘాలలో తీవ్రమైన అభియోగాలను ఎదుర్కొంటున్న హెచ్‌సిఎ మరోమారు వార్తల్లో నిలిచింది. హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు సహా ఆయన సహచర సభ్యులను సిఐడి అరెస్టు చేయడం సంచలనం రేపింది. ఈ ఏడాది ముగిసిన ఐపిఎల్ సీజన్‌లో హైదరాబాద్ ప్రాంఛైజీ అధిపతి ఎస్ఆర్‌హెచ్‌కు ఉప్పల్ స్టేడియం వాడుకునేందుకు హెచ్‌సిఎ అనుమతి ఇచ్చింది.

10-07Pg3exHMNWJQERTKL.qxd:10-07Pg3exHMNWJQERTKL.qxd 01/01/01 8:32 AM Page 1



# తిరుమల సమాచారం

## టిటిడి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

### - బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి దాతలు,భక్తులు ఇచ్చిన భూములు తెలంగాణాలో కూడా ఉన్నాయని, భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన చీఫ్: రామచంద్రరావు తెలిపారు. ఖమ్మంలో కూడా టిటిడి స్థలాలు ఉన్నాయని, అక్కడ అన్యమతస్తులు కొందరు రాజకీయ అండతో వాటిని కబ్జాచేసుకుని గోడను కూలగొట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని అన్నారు. దేవుని స్థలాలను వాణిజ్యకార్యకలాపాలకు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆక్రమణలు ఆపాలని, టిటిడి భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడేందుకు బిజెపి తరపున ప్రయత్నిస్తానని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతానన్నారు. బిజెపి తెలంగాణ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బుధవారం ఉదయం అనురులతో కలసి తిరుమలకు చేరుకున్న రామచంద్రరావుకు టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఆలయ అదికారులు రంగనాయకులు మండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ బిజెపి చీఫ్‌గా శ్రీవారి దర్శనం చేసుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

## హోటళ్ల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత ప్రధానం

### - టెండర్‌ప్రాసెస్‌పై యజమానులకు అవగాహన



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం తిరుమలకు వస్తున్న భక్తుల అవసరాలకు తగ్గట్లు సాంప్రదాయమైన ఆహారపదార్థాలను అందించేందుకు టిటిడి తాజాగా జనతా,పెద్ద హోటళ్ళకు టెండర్లు ఖరారుచేస్తోంది. ఈ టెండర్లలో వ్యాపారులు పాల్గొని నిర్వహణకు ముందు హోటళ్ళ నిర్వాహకులతో బుధవారం మధ్యాహ్నం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమావేశం నిర్వహించారు. తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు జనతా,పెద్ద హోటళ్ళు, క్యాంటీన్లలో నాణ్యమైన రుచికరమైన సాంప్రదాయ ఆహారపదార్థాలను అందించాలన్నారు. తిరుమలకు వస్తున్న భక్తులకు సేవా దృక్పథంతో నాణ్యమైన ఆహారపదార్థాలు, లాభాపేక్ష లేకుండా పరిశుభ్రతతో నిర్దేశించిన ధరలకు అందించాలని ఇఒ తెలిపారు. గతనెల 23న జారీచేసిన నోటిఫికేషన్ మేరకు సదరు ఈఐఒ సంబంధించిన సందేహాలపై గుర్తింపు ఉన్న హోటళ్ళ నిర్వాహకులు తమ ఆసక్తిని వ్యక్తం చేసేందుకు ప్రీ బిడ్ సమావేశమయ్యారు. నిర్ధారించిన నియమాలకు లోబడి హోటళ్ళు, క్యాంటీన్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పెద్దహోటళ్ళ నిర్వాహకులు, టిటిడి అదనపు ఎఫ్ఎఒ రవిప్రసాదు, తిరుమల ఎస్టేట్ అధికారి కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వానరాల నుండి భక్తులకు రక్షణ

### - స్మార్ట్‌స్టిక్స్‌తో ఆలయ పరిసరాల్లో నిఘా



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో వానరాలు(కోతులు)బెడద తీవ్రమైంది. అటవీప్రాంతంలో ఉండే వానరాలు ఆహారం కోసం జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. గత వారంరోజులుగా తిరుమల ఆలయం పరిసరాల్లో మాఢవీధుల్లో కూడా వానరాలు సంచారం పెరిగింది. కాటేజీలు,అతిధిగృహాలు, ప్రముఖులు బసచేసే ప్రాంతాల్లోనూ వీటి సంచారంతో భక్తులు భయపడుతున్నారు. భక్తుల చేతుల్లో సంచులను లాగేయడం, ప్రసాదాలను లాక్కెళ్లడం చేస్తున్నాయి. దీంతో టిటిడి ఈ వానరాలను పట్టుకోవడం, లేదా దూరంగా తరిమేయడం చేసేందుకు టిటిడి అటవీశాఖను ఆదేశించింది. టిటిడి డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు వానరాల బెడదను తప్పించేందుకు బ్యాటరీతో పనిచేసే స్మార్ట్‌స్టిక్స్ తెప్పించారు. ఈ స్టిక్స్‌కు పైభాగంలో ఫోకస్‌లైటింగ్ అమర్చారు. ఎక్కడైనా వానరాలు ఉంటే వాటిని తరిమేయడానికి ఈ స్టిక్‌క్రింద ఉన్న బటన్ నొక్కితే లైట్ వెలిగి ఆ కాంతికి వానరాలు పరారవుతాయి. వీటిని ప్రస్తుతం రెండు తెప్పించారు. అవసరమైన ప్రాంతాల్లో ఈ రెండింటిని అటవీశాఖ సిబ్బంది వినియోగిస్తారు.

## వెంకటేశ్వరస్వామి దర్శనంతో అనుభూతి

### - శ్రీవారి సేవలో తమిళనాడు సిజె జస్టిస్ శ్రీరామ్



**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** భగంతుని నామస్మరణతో ప్రజలు భక్తిభావంతో మెలిగినపుడే ఆ దేవుని దర్శనం అనుభూతి కలుగుతుందని తమిళనాడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీరామ్ విశ్వాసం వెలిబుచ్చారు. కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటే మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని అన్నారు. తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకోగలుగుతున్నారన్నారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో తమిళనాడు సిజె జస్టిస్ శ్రీరామ్ కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


## కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం: ఎమ్మెల్యే సిఎం రమేశ్



**తిరుమల,జూలై 9ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఏడాది పాలనలో అమలుచేస్తోందని, విజయవంతంగా ప్రజలకు సంక్షేమఫలాలు అందిస్తోందని బిజెపి ఎమ్మెల్యే సిఎం రమేశ్ తెలిపారు. క్రమక్రమంగా హామీలు అమలుచేసుకుంటూ వాగ్దానాలను నిలబెట్టుకుంటోందన్నారు. కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు, సాఫ్ట్‌వేర్ సంస్థలు వస్తున్నాయన్నారు. పురోబివృద్ధిని కూటమి ప్రభుత్వం సాధిస్తుందన్నారు. కృష్ణగోదావరి నదులు నీటితో పుష్కలంగా నిండాయని, రైతులకు ఎటువంటి నీటిసమస్యలేకుండా దేవదేవుడు కరుణించాడని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులతో కలసి బుధవారం ఎమ్మెల్యే సిఎంరమేశ్ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్థానికత ఉన్న హోంగార్డులను రాష్ట్రానికి రప్పించండి

### - సిఎం చంద్రబాబుకు విజ్ఞాపన పత్రాలు ఇచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



హోంగార్డులు, విదేశీ వైద్యా గ్రాడ్యుయేట్లు సమస్యలపై సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ కె.రామకృష్ణ

**విజయవాడ, జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** హోంగార్డుల వేతనాల పెంపు, విదేశీ వైద్య విద్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ప్రభుత్వాన్ని కోరింది.సుదీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఈ సమస్యలున్నాయని ప్రభుత్వానికి తెలిపింది.సీపీఐ రాష్ట్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటనను అనుసరించి ఈ అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీ ఎంఎల్ఏ కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. వైద్యవిద్యలో విదేశాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఏపీకి చెందిన విద్యార్థులకు ఏపీ వైద్య మండలి శాశ్వత రిజిస్ట్రేషన్ నిరాకరిస్తోందని ఈ నిబంధనను సవరించేలా చూడాలని ఆయన ముఖ్యమంత్రికి విన్నవించారు. వైద్య నిపుణుల కొరత ఉన్న ప్రస్తుత తరుణంలో ఏపీఎంసీ నిబంధనల్ని మార్చుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణా, మహారాష్ట్ర, ఒడిశా, యూపీ లాంటి రాష్ట్రాల్లో ఇప్పటికే నిబంధనల్ని సవరించారని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో హోంగార్డుల వేతనాల పెంపు, పోలీసు సెలక్షన్లలో రాయితీలు కల్పించే అంశంపైనా నిర్ణయం తీసుకోవాలని రామకృష్ణ కోరారు. ఏపీ తెలంగాణా రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 400 మంది ఏపీ స్థానికత కలిగిన హోం గార్డులు తెలంగాణాలో పనిచేస్తున్నారని వారిని రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రామకృష్ణ సీఎంను కోరారు. వేతనం పెంపుతో పాటు పోలీసు సెలక్షన్లలో నిబంధనలను సడలించి హోంగార్డులకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## మహిళల పట్ల వైకాంగ్రెస్ తీరు సిగ్గుచేటు

### నారా భువనేశ్వరి



**విజయవాడ,జులై 9, ప్రభాతవార్త ప్రతి నిధి:** వైకాంగ్రెస్ పార్టీకి మహిళల పట్ల ఎటువంటి ద్వేష పూరిత అభిప్రాయం ఉందో మాజీ ఎంఎల్ఏ ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు బహిర్గతం చేశాయని నారా భువనేశ్వరి అన్నారు. 'ఎక్స్' వేదికగా ఆమె మహిళల పట్ల వైకాపా తీరు సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మహిళా వ్యతిరేక మనస్తత్వాన్ని ఆయన వ్యాఖ్యలు బహిర్గతం చేశాయని చెప్పారు.సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలకు స్థానం లేదు. ఎంఎల్ఏ ప్రశాంతి రెడ్డికి నా సంఘీభావం ప్రకటిస్తున్నా... ఆమెపై చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నన్నారు.,.మహిళల పట్ల అవమానకర పదాలు వారి విలువను తగ్గించలేదు. స్త్రీల గౌరవాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నమైనా ఖండించాల్సి ఒదేనన్నారు.వైకాంగ్రెస్ పార్టీ నేతలు ఇంకా ఈ విషయంలో ప్రసన్నకుమార్‌రెడ్డిని సమర్ధించడం సరికాదన్నారు.

## ఉచిత బస్సు పథకం అమలుకు సన్నద్ధం

### ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులనే తీసుకోవాలని ఆర్టీసీ పాలకవర్గం నిర్ణయించిందని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. వీటికోసం బస్టాండ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా తగిన వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన పాలకమండలి తొలి సమావేశం విజయవాడలోని ఆర్టీసీ కార్యలయంలో జరిగింది. ఇందులో అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్టీసీ సంస్థ గతంలో 1,489 బస్సులు కొనుగోలు చేయగా, వీటిలో 904 బస్సులకు బాడీబిల్డింగ్‌కు టెండర్లు పిలిచి ఇచ్చారు. 518 ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రం రీటెండరు పిలిచి అదనపు ధరతో బాడీ బిల్డింగ్‌కు కాంట్రాక్టరు కు అవకాశం కల్పించారు. దీనికి రూ.75 కోట్ల చెల్లింపుల అంశం బోర్డులో చర్చకు రాగా కొందరు సభ్యులు దీన్ని ప్రశ్నించారు. మళ్లీ టెండరు పిలిచి, ధర ఎందుకు పెంచాల్సి వచ్చిందో వివరాలన్నీ వచ్చే బోర్డు సమావేశం నాటికి తెలియజేయాలని అన్నారు. రాయలసీమ జిల్లాల్లో బస్టాండ్ల పరిస్థితి ఎలా ఉందో కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నెరవేర్చడంలో భాగంగా ఆగస్టు 15 మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా దీన్ని అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ అధ్యక్షతన ఏపీఎస్ ఆర్టీసీ పాలక మండలి సమావేశమైంది. విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో జరిగిన భేటీకి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్లు, ఈడీలు, సహా బోర్డు సభ్యులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆర్టీసీకి సంబంధించి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేశారు.

## అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం అర్హుల జాబితా సిద్ధం

### - వ్యవసాయ శాఖ సంచాలకులు ఢిల్లీరావు

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:**అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం అర్హుల జాబితా సిద్ధమైంది. ఏపీ వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్హులైన రైతుల జాబితాలను సంబంధిత రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న జాబితాలో రైతులు వారి పేర్లను పరిశీలించుకోవచ్చని వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు తెలిపారు. అన్నదాత సుఖీభవ పోర్టల్ లోనూ ఆధార్ నెంబర్ ద్వారా తన అర్హతను తెలుసుకోవచ్చని వెల్లడించారు. మన మిత్ర వాట్సాప్ ద్వారా కూడా రైతులు వారి అర్హతను తెలుసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఆధార్ నెంబర్‌ను మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు పంపితే వివరాలు లభ్యమవుతాయని సూచించారు. రైతు పేరు లేని పక్షంలో, అర్హత ఉందని భావిస్తే రైతు సేవా కేంద్రంలో అర్జీతో పాటు పత్రాలు సమర్పించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పోర్టల్ లోనీ గ్రీవెన్స్ మాడ్యులులో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 13 వరకు మాత్రమే గ్రీవెన్స్ నమోదు చేసుకునే అవకాశం ఉందని ఢిల్లీరావు స్పష్టం చేశారు. వివరాలు రైతులకు మరింత చేరేలా వ్యవసాయ శాఖ సిబ్బంది ముమ్మర ప్రచారం చేయాలని ఢిల్లీరావు ఆదేశించారు. అర్హులుగా 47.77 లక్షల రైతులు: ఖిఅన్నదాతా సుఖీభవ పీఎం కిసాన్ఖి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 47.77 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించామని కొద్ది రోజుల క్రితం వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయాల సర్వే ఆధారంగా 98 మందికి ఈకేవైసీ పూర్తయిందని తెలిపారు. ఈ ప్రక్రియ ఇంకా 61,000 మందికి పూర్తి చేయాల్సి ఉందని ఢిల్లీరావు వివరించారు. సొంతభూమి కలిగిన డీ.పట్టాదారులు, ఎసైన్డ్, ఈనాం భూముల రైతులను కూడా అర్హులుగా గుర్తించామని ఢిల్లీరావు పేర్కొన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ జత కాకున్నా, తప్పుగా జోడించినా, చనిపోయిన ఖాతాలు, నోషనల్ ఖాతాలు కలిగిన రైతులు రెవెన్యూ అధికారులను వద్దకు వెళ్లి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. అనంతరం వారికి కూడా ఈ సుఖీభవ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. రైతుల అభ్యర్థనలు స్వీకరించేందుకు త్వరలో అన్నదాతా సుఖీభవ పోర్టల్ అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. భూమిలేని ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందడంతోపాటు ఈపంటలో పేరు నమోదు చేసుకోవాలని ఢిల్లీరావు సూచించారు. అర్హత ప్రకారం అందరికి లబ్ధి చేకూరుస్తామని అక్టోబరు, 2026 జనవరి నెలల్లో 2 విడతలుగా కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ పీఎం కిసాన్ మొత్తాన్ని అందిస్తామన్నారు.

## ఐఐటి, నీట్‌లో అర్హత సాధించిన గురుకుల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహకం

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఐఐటీ, నీట్ లో అర్హత సాధించి మెడిసిన్ ఇంజనీరింగ్ లో సీట్లు సాధించిన డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం అందించాలని ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధ్యక్షతన ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యాలయంలో 75 వ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఐఐటి, నీట్ లో అర్హత సాధించి మెడిసిన్, ఇంజనీరింగ్ లో సీట్లు సాధించిన డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులకు రూ.1 లక్ష ప్రభుత్వ ప్రోత్సాహం ఐఐటి, నీట్ లో అతి తక్కువ మార్కులతో అర్హత సాధించలేకపోయిన 120 మంది విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ రాష్ట్రంలోని 10 ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లలో డిప్యూటేషన్ పై గురుకులాల్లో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయుల నియామకం గురుకులాలు, ఎస్సి సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మోటిక్ కిట్స్ ప్రతి గురుకులంలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు వీటితో పాటు గురుకులాల్లో పదవ తరగతి, ఇంటర్ సెకండియర్ లో ఖాళీ సీట్ల అడ్మిషన్లకు బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఆమోదం తెలిపింది. ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సమావేశంలో కీలకంగా నిర్ణయం తీసుకున్నారు.ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో అనారోగ్యంతో మృతి చెందిన పల్నాడు జిల్లా వినుకొండ డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకులానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని సంకీర్తన భాయ్ తల్లిదండ్రులకు సాంత్వన పథకం కింద ఆర్థిక సాయంగా రూ.3 లక్షల చెక్కును మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అందజేశారు.ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎం.ఎం నాయక్, సెక్రటరీ ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ డైరక్టర్ లావణ్య వేణి, ఎపీఎస్‌డబ్ల్యు ఆర్ఇఐఎస్ అడిషన్ ల్ సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్, ఎపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ డిప్యూటీ సెక్రటరీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## గరివిడి పశువైద్య కళాశాలకు లభించని విసిఐ అనుమతులు

### ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇతర కళాశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు అనుమతి

### ఉత్తర్వులు జారీచేసిన తిరుపతి ఎస్‌వివియు రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్

**గరివిడి (విజయనగరం జిల్లా), జూలై 9 ప్రభాతవార్త:** గరివిడి పశువైద్య కళాశాలకు వి సి ఐ (వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) అనుమతులు లభించ లేదు. ప్రభుత్వం కృషి ఫలితంగా హౌస్ సర్జన్(ఇంటర్షిప్)కి వెళ్లే ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మాత్రం విసిఐ అనుమతులు రాకపోయిన నేపథ్యంలో వి సి ఐ అనుమతులు ఉన్న తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం పరిధిలో గల గన్నవరం,తిరుపతి, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో జాయిన్ చేసేందుకు అనుమతులు మంజూ రయ్యాయి. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ (న్యూ ఢిల్లీ) డైరెక్టర్ జయచంద్ర భానురెడ్డి గరివిడి కళాశాల పశువైద్య విద్యార్థులకు వేరే కళాశాల ద్వారా ఇంటర్షిప్‌కి అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ పి. రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు ప్రతులను నాలుగు కళాశాలల డీన్, అసోసియేట్ డీన్‌లకు రిజిస్ట్రార్ రవికుమార్ పంపించారు. విసిఐ అనుమతులు లభించని విద్యార్థులకు వేరే కళాశాల ద్వారా ఇంటర్షిప్ చేసేందుకు అనుమతి, ఆపై సర్టిఫికెట్ చెల్లుబాటుకి అవకాశం లభించడంతో విద్యార్థుల ఊరట ఏర్పడింది. ఈ అనుమతులకి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి కృషి ఫలించిందని చెప్పవచ్చు.

## కొమ్మినేనికి హైకోర్టులో ఊరట, బెయిలు షరతుల్లో సవరణ

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** జర్నలిస్ట్ కొమ్మనేని శ్రీనివాసరావుకు ఏపీ హైకోర్టు స్వల్పఊరట నిచ్చింది.బెయిల్ షరత్తుల్లో సవరణ చేసింది.రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో జర్నలిస్ట్ కొమ్మనేని శ్రీనివాసరావుకు మంగళగిరి కోర్టు విధించిన షరతులను అనుసరించి కొమ్మినేని తుళ్ళూరు పోలీసు స్టేషన్‌కు నిర్దేశిత వారాల్లో హాజరు కావాల్సి ఉంది. ఈ నిబంధనను .హైకోర్టు పాక్షికంగా సవరించింది. ఇకపై ఆయన తుళ్ళూరుకు బదులుగా తాడేపల్లి పోలీసు స్టేషన్ హాజరు అయ్యేందుకు ఆయనకు వీలు కల్పిం చింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లిఖార్జునరావు ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై తుళ్ళూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ఓ టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీం కోర్టు బెయిలు మంజూరు చేస్తూ,షరతులను విధించే అధికారం ట్రయల్ కోర్టుకు ఇచ్చింది.. దీంతో మంగళగిరి కోర్టు,ప్రతి నెలా రెండు,నాలుగో శనివారాలు తుళ్ళూరు పోలీసు స్టేషన్లో హాజరుకావాలని కొమ్మినేని శ్రీనివాసరావుకు షరతులు విధించింది. తుళ్ళూరు ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకు వెళితే తనపై దాడి జరిగే ప్రమాదం ఉందని,తాడేపల్లి పీఎస్‌కు వెళ్లేందుకు వెసులుబాటు ఇవ్వాలని కొమ్మినేని కోరారు.

## స్లీపర్ సెల్స్ పై సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలు నిలుపుదల!

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో రాష్ట్రంలో స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు పిటిషనర్లు సమర్పించిన వివరాల ఆధారంగా విచారణ జరపాలంటూ డీజీపీని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే నేతృత్వంలోని ధర్మాసనం నిలిపివేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అనంతరం కేంద్ర నిఘా వర్గాల సమాచారం ప్రకారం పాకిస్థాన్–ఐఎస్ఐకి చెందిన పలువురు స్లీపర్ సెల్స్‌గా భారతదేశంలో ఉన్నారని అందులో కొందరు ఏపీలోని నంద్యాల, గుంటూరు, కడప, తదితర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని పేర్కొంటూ న్యాయవాది ఎస్.గౌతమి ప్రొద్దుటూరుకు చెందిన ఎ.శివకుమార్ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి పిటిషనర్లు సమర్పించిన వివరాల ఆధారంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీజేపీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ చేసింది. మంగళవారం జరిగిన విచారణలో ప్రభుత్వం తరపున ఏజీ వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించాలని అభ్యర్థించారు.

## రాజధానిలో ఎన్టీఆర్ విగ్రహానికి 10 నమూనాలు

### మంత్రి నారాయణ

**విజయవాడ,జూలై 9,ప్రభాత వార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో అత్యంత ఎత్తయిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది.ఇందుకు పూర్వరంగం సిద్ధమైంది.రాజధాని లోని నీరుకొండ హిల్ ఏరియాలో ఎన్టీఆర్ భారీ విగ్రహం స్మారకాన్ని నిర్మించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. క్రమంలో రాజధానిలో నిరి ్మంచే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి పది నమూనాలు సిద్ధం చేయాలని పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సంబంధిత కన్సల్టెన్సీ ప్రతినిధులకు సూచించారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. విగ్రహ నమూనా దాని చుట్టుపక్కల చేపట్టే నిర్మాణాలపై కన్సల్టెన్సీ ప్రతినిధులతో పురపాలక శాఖ మంత్రి సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు.

విగ్రహ నమూనాలు,ఇతర డిజైన్లపై ప్రాథమిక ప్రతిపాదనలను షెలాడియా సంస్థ ప్రతినిధులు వివరించారు. నిర్మాణ ప్రాంతంలో మట్టి పరీక్షలు,ఇతర సర్వేలు చేస్తున్నట్లు చెప్పారు. నమూనాల రూపకల్పనలో టిడిపి నేత టీడీ జనార్ధన్ సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి వారికి సూచించారు.

KAKINADA MUNICIPAL CORPORATION

**'e' PROCUREMENT TENDER NOTIFICATION**

Roc No. 1389/2025/E4, Dated: 09.07.2025

Tenders invited through ap e procurement platform for 14 works, Tenders invited through with an estimated amount value of **Rs. 4,12,10,724/-** from the eligible contractors in the following manner.

**Four Works for an amount of Rs. 22,09,776/-**
Last date and time for downloading bid documents: Dt: 15-07-2025 upto 10-00 AM
**Four Works for an amount of Rs. 23,08,032/-**
Last date and time for downloading bid documents: Dt:21-07-2025 upto 10-00 AM
**Six Works for an amount of Rs. 3,66,92,916/-**
Last date and time for downloading bid documents: Dt:28-07-2025 upto 10-00 AM
Tender Inviting Authority: Commissioner, Municipal Corporation, Kakinada
**Mail: kkd_mplcorp@yahoo.com, Call Centre Phone:0884-2357722**
Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

**OFFLINE TENDER RFP**

R.o.c.No. 3088/2025/E2 Dated: 09-07-2025

Kakinada Municipal Corporation is inviting Tenders from interested reputed firms/ organizations/ agencies. **FOR 3RD PARTY QUALITY CONTROL**
The interested agencies are paying Rs. 10,000/- for each work respectively which is Non-refundable in the form of DD drawn in favour of the Commissioner, Municipal Corporation at any Nationalized Bank payable at Kakinada.

| S.No | Description | | Date & Time |
|---|---|---|---|
| 1 | RFP Issue Start Date & time | : | From 11.00 A.M. 14/07/2025 |
| 2 | RFP Issue End Date & time | : | 4.00P.M. 21/07/2025 |
| 3 | RFP document receiving Closing Date & time | : | 4.00P.M. 22/07/2025 |
| 4 | Opening of Technical Bids Date & time | : | 5.00 P.M. 22/07/2025 |

Contact Mobile No: **9849906516; kmcengineeringsection@gmail.com**
Sd/- **Bhawna,** I.A.S,
Commissioner, Municipal Corporation, Kakinada

వార్త

దోష రహితమైన దాన్ని నిందించడం, ప్రశంసకు అర్హత లేనిదాన్ని పొగడ్డం, మనిషి డబ్బుకోసం ఏం చేయడానికి అయినా వెనుకాడడు.

-పంచతంత్ర

# ద్వంద్వ ప్రమాణాలకు చెక్!

అంతర్యుద్ధాలు, దేశాల మధ్య అనుచిత వైరుధ్యాలు, వాదోపవాదాలు ఉద్యమాలతో సతమతమవుతున్న పెక్కు దేశాల ఏర్పాటు వాద ఆకాంక్షలు తీరేందుకా అన్నట్లు బ్రెజిల్‌లో జరిగిన 'బ్రిక్స్' సమావేశాలు ఒకింత ఊరటనిచ్చాయనే చెప్పాలి. సమస్య, పరిష్కారం రెండూ ఒకదానివెంట ఒకటి ఉన్నా ముందు సమస్యలపై విశ్లేషణ జరగందే పరిష్కార మార్గాలు ఎంచుకోలేని పరిస్థితి ఉంటుంది. కానీ మొదటి ప్రస్తావనలోనే రియో డీ జనీరో ప్రకటన ద్వారా ఉగ్రవాదంపై పోరుబాటను బ్రిక్స్ నేతలు ఆవిష్కరించినట్లయ్యింది. పశ్చిమాసియా దేశాల మధ్య ఏర్పడిన వైరుధ్యాలు, విభిన్న తల మధ్య కొన్ని ఆందోళన పరిస్థితులు ఏర్పడ్డాయన్న విషయం తెలిసిందే. 'బ్రిక్స్' సభ్యదేశం అమెరికా ఇతర దేశాల వాణిజ్యంపై విపరీతంగా సుంకాల విధింపు కూడా ఈ సదస్సులో ప్రస్తావనార్హంగా మారింది. వివిధ దేశాల మధ్య ఆంక్షలు, పక్షపాతం, వంటి అంశాలన్నీ చర్చనీయాంశాలయ్యాయి. తొలుత బ్రెజిల్, రష్యా, చైనాలతో ఏర్పడిన 'బ్రిక్స్'లో ఆ తర్వాత భారత్ చేరింది. దక్షిణాఫ్రికా కూడా సభ్యత్వం తీసుకుంది. ప్రస్తుతం 11 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈసారి ఈ సదస్సుకు రష్యా, ఈజిప్టు, ఇరాన్, చైనా అధ్యక్షుడు హాజరుకాలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గతంలో అన్ని సమావేశాలకు హాజరైనా ఈసారి ఆ దేశ అంతర్గత రాజకీయ సమస్యలవలన రాలేదు. ఆయా దేశాల ఆకాంక్షల మధ్య బ్రిక్స్, సార్క్, వంటి అనేక దేశాల గ్రూపులు ఎప్పటికప్పుడు భవిష్యత్ నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటాయి. స్నేహ సౌహార్ద్ర సంబంధాలను మెరుగుపరుచుకుంటూనే ఉంటాయి. చాలా కాలంగా అచేతనంగా ఉన్న దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) స్థానంలో భారత్‌తో సహా అన్ని దక్షిణాసియా దేశాలతో మారో గ్రూపు ఏర్పాటు చేసేందుకు చైనా నాయకత్వంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు కలిసి వస్తే కొత్త కూటమిని ఏర్పాటు చేసే ప్రయత్నాలు చాపకింద నీరులా జరుగుతున్నాయి. సార్క్‌కు కేవలం ఇది కొత్త రూపంగా ఉండబోతోంది. సార్క్‌లో భారత్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక దేశాలు సభ్యదేశాలుగా ఉన్నా, వాటి బంధాన్ని భారత్‌లోని 'యురీ' సైనిక శిబిరంపై ఉగ్రదాడి ద్వారా పాకిస్థాన్ 'సార్క్'ను చెల్లాచెదురు చేసింది. అందుకే 'సార్క్'ను కొత్త రూపంలో తేవడం ద్వారా దక్షిణాసియాలో ఉద్రికత్తలను పరస్పర అవగాహన ద్వారా నియంత్రించుకోవచ్చుననే భావనలో కొన్ని ప్రధాన దేశాలు యోచిస్తున్నాయి. 'బ్రిక్స్' సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోడీ వివరించిన అంశాలన్నీ ప్రధానంగా అన్ని సభ్యదేశాలూ ఆలోచించదగినవే. కృత్రిమ మేధాయుగంలో దేశాభ్యుదయం గురించి ఆలోచించేవారు వెనుకబడి ఉండరాదన్నది ఆయన సందేశం. పర్యావరణ పరిరక్షణకు ఆర్థిక సహాయం, సుస్థిరాభివృద్ధి, సాంకేతికత లభ్యత వంటి అంశాలో గ్లోబల్‌సౌత్‌కు తగిన ప్రాతినిధ్యం కానీ, వెసులుబాటు కానీ దక్కలేదని మోడీ ఆవేదన. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత సహా అన్ని అంశాలలోనూ ద్వంద్వప్రమాణాలే పాటించబడుతున్నందున గ్లోబల్ సౌత్ దేశాలకు అన్యాయమే జరిగిందన్నారు. అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్యం దక్కకపోవడం పట్ల మోడీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత అవసరాలకువీలుగా భద్రతా మండలిని 'సంస్కరించుకోవాల్సిన పరిస్థితిని ప్రధాని నొక్కిచెప్పారు. ఆదివారం నాటి బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోడీ స్వరమే ప్రధానంగా వినపడింది. ఇటీవల పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు సాగించాలని, ఉగ్రవాదులపై ఆంక్షలు విధించేందుకు సంకోచించడం సరికాదని హితవు చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థిస్తే అది మనల్నే కబళిస్తుందన్న ధోరణిని వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ, ఆర్థిక వ్యవహారాలు, బహుళపక్షవాద అనే అంశాలపై 'బ్రిక్స్' సమావేశంగా ప్రధానంగా దృష్టి సారించింది. చాలా కాలంగా అన్యాయమవుతున్న దక్షిణాఫ్రికా దేశాలను ముందుగా సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న తర్వాతనే నరేంద్రమోడీ బ్రెజిల్ 'బ్రిక్స్' సమావేశంలో వారికి ప్రాతినిధ్య ప్రతినిధిగా సమస్యలకు ఆవేదనను ఏకరువు పెట్టారు. పూర్తిగా కాకపోయినా కొంతలో కొంతైనా 'బ్రిక్స్' సమావేశం అనేక దేశాలకు ఆశాకిరణంగా కనపడింది. ఏ మాత్రం మొహమాటం లేకుండా అమెరికా, చైనాలు భారత్ వాణిజ్యంపై పెడుతున్న ఆంక్షలు, సుంకాల విషయాన్ని నిర్ద్వంద్వంగా మోడీ బయటపెట్టారు. 'క్రిటికల్ మినరల్స్' అనబడే లిథియం, నికెల్, గ్రాఫైట్స్ వంటి ప్రధాన ఖనిజాల ఎగుమతులపై చైనా విధిస్తున్న ఆంక్షలు ఆహ్వానించదగినవి కావని ప్రధాని ఎలుగెత్తారు. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ, డ్రోన్ల వంటి అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తుల తయారీలో క్రిటికల్ మినరల్స్' ఉపయోగిస్తుంటారు. కృత్రిమ మేధవల్ల కలిగే ప్రయోజనాలు, దుష్పరిణామాలను గురించి చర్చించేందుకే వచ్చే యేడాది భారత్‌లో 'ఎఐ ఇంపాక్ట్ సదస్సు'కు బ్రిక్స్ దేశాలను భారతప్రధాని ఆహ్వానించడం భవిష్యత్ సాంకేతికత విషయమై ఓముందడుగు వేసినట్లే. బ్రిక్స్ శాస్త్ర పరిశోధనల బాంఢాగారాన్ని ఏర్పాటును ప్రత్యేకించి ప్రధాని ప్రకటించారు. వాతావరణంలో ప్రతికూల మార్పుల నుండి తట్టుకోడానికి వీలుగా పారిస్ వాగ్దానాలను భారత్ తనవంతుగా ఇప్పటికే నెరవేర్చిందని, 2070కల్లా 'నెట్‌జీరో' స్థాయికి చేరి పుడమిని రక్షించే నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు ప్రధాని వివరించారు. ఈ 'బ్రిక్స్' సదస్సు నిర్ణయాలు. విశ్వమానవాళికి శుభదాయకం కావాలి. సమన్వయం, సహకారం విధానాలలో వచ్చే యేడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సమావేశంలో సౌహార్ద్ర సంబంధాలు ఇనుమడిస్తాయని ఆశిద్దాం.

ఎవరిని ప్రశంసిస్తున్నాం అన్నది గొప్ప విషయం కాదు. ఎవర్ని నిందిస్తున్నాం అనేదే బాధాకరమైన విషయం.



విలియం ఆస్లర్

ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే, గొప్ప సైన్యానికి మించిన శక్తి మనికి లభిస్తుంది.



ఉడ్రోవిల్సన్

# ప్రజావాక్కు



### విషపూరిత రసాయనాలను వాడొద్దు

ఇటీవలవ్యవసాయంలో విస్తృతంగావినియోగిస్తున్న గ్లైఫోసేట్ అనే విషపూరిత రసాయనంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అనేక పరిశోధనలు, నివేదికలు దీని ప్రమాదకరతను స్పష్టం చేస్తున్నప్పటికీ, మన దేశంలో ఇది ఇంకా వ్యవసాయ చట్టాల కింద నియంత్రణలో లేకుండా వినియోగించబడుతోంది. ఇది రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పర్యావరణానికి, జల వనరులకు, వన్యప్రాణులకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుంది. గ్లైఫోసేట్ అనేది హెర్బిసైడ్‌గా ఉపయోగించే రసాయనం. ఇది ముళ్లపొదల్లో స్పష్టమైన ప్రభావం చూపుతుందనేది నిజమే. కానీ దీని దీర్ఘకాలిక ప్రభావాలు మాత్రం అత్యంత భయంకరమైనవిగా బయటపడుతున్నాయి. ఇది కేన్సర్‌ను తేవచ్చు అనేవిషయం ప్రపంచ ఆరోగ్య సంస్థకి చెందిన అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ నివేదిక ద్వారా స్పష్టం అయింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రమాదంలో ప్రాథమిక హక్కులు

హక్కుల గురించి మాట్లాడడడం రాయడం ఒక మృగ్యం అయిపోతున్న పరిస్థితిలో ఉన్నాం. సంచార స్వేచ్ఛ లేదు జైళ్లలో కనీసం విచారణ లేకుండా కుక్కబడిన పరిస్థితి ఉంది. దళితులలోఆదివాసులలో ఈతీవ్రత మరింత ఎక్కువ అయితే రాజ్యాంగం ఆశించింది అందించింది ఇదేనా అనే భావన కలుగుతుంది. ఇవ్వాళ ఆదివాసులు తమకు ఏమి కావాలి అని దానిని వాళ్లే నిర్ణయించుకుంటారు అని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దాని అమలులో మాత్రం ఆ ఛాయలు కనిపించవు. నిరసన తెలిపేందుకు అవకాశం లేదు. చివరికి తనకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛకూడా లేదు. రాజ్యాంగ సభచర్చలలోఎక్కువ కాలం నలిగిన ప్రాథమిక హక్కుల ఉనికే ప్రమాదంలో ఉంది.

- భారత అవినాష్, జనగామ

### తండాలకు తారు రోడ్డు వేయాలి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలోని మారుమూల గిరిజన తాండాలకు తారు రోడ్డువేయాలి. గిరిజన తాండాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తండాల రోడ్ల పరిస్థితి అధ్వాన్నస్థితిలో ఉంటున్నాయి. కావున ప్రభుత్వాలు తక్షణం గిరిజన తండాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### పోటీకి అనర్హులు

అమెరికా అధ్యక్షుడి ఎన్నికలలో డోనాల్డ్ ట్రంప్‌కు కుడి భుజంగా అహర్నిశలు పనిచేసి లక్షల డాలర్లు ఖర్చు చేసి తన స్నేహితుడి విజయానికి బాటలు పరచిన అపర కుబేరుడు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ట్రంప్ నిర్ణయాలతో విభేదించి స్నేహబంధాన్ని విడనాడి ప్రజాస్వామ్య పరిరక్షణకు 'అమెరికా పార్టీ' అనే పేరుతో ఓ కొత్త పార్టీకి పునాది రాయిని వేయడం జరిగింది. అమెరికాలో దాదాపు 55రాజకీయ పార్టీలున్నాయి. ఎన్ని ఉన్నా ఎన్నికల పోటీలో నిలబడేవి ముఖ్యంగా డెమొక్రటిక్, కన్సర్వేటివ్ పార్టీలు మాత్రమే. అదే ఇండియాలో రెండు వేల అయిదు వందల పార్టీలున్నాయని మన ప్రధాని ఘానా దేశ పర్యటనలో చెప్పారు. మస్క్ పెడుతున్న పార్టీకి అమెరికాలో అనూహ్య మద్దతు లభిస్తోందని వార్తలొస్తున్నాయి. ఇందులో రాజ్యాంగ పరమైన చిక్కేమిటంటే మస్క్ పుట్టింది సౌత్ ఆఫ్రికాలో. అందుచేత అమెరికా అధ్యక్షునిగా పోటీ చేయడానికి ఆయన అర్హత ప్రశ్నార్థకమే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడం లేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగ కులస్తులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయాం. రాజకీయాల్లో రాణించలేకపోయం. అందుకే మా జీవితాల్లో ప్రగతి సూర్యోదయాన్ని చూడలేకపోయాం. అందుకే ఉత్తరాంధ్రలో తెలగకులాన్ని జాగృతం చేయాలి.

-జి.అశోక్ కుమార్, విశాఖపట్నం

### వికలాంగుల నైపుణ్యాలు మెరుగుపరచాలి

వైకల్యం అనేది శరీరాలకి కానీ మనసుకు, నైపుణ్యాలకు, చైతన్యానికి అడ్డు కాదని వికలాంగులు వివిధ రంగాలలో నిరూపిస్తున్నారు. వికలాంగులలో ఉన్నత విద్యావంతులు, రచయితలు, గాయకులు, ఆర్టిస్ట్, క్రీడలు, నటన, చిత్రకారులు, వివిధ సంస్కృతిక రంగాలలో అద్భుతమైన ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఆయా రంగాలలో పేరు ప్రతిష్టలు పొందిన వారి చేత వికలాంగులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విద్యాహక్కు చట్టంపై అవగాహన పెంచాలి

*నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో విద్యలో విలువైన విద్యా ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యతను పోషిస్తాయి. విషయ అవగాహన, ప్రశ్నించడం పరికల్పన చేయడం, ప్రయోగాత్మకమైన సమాచార నైపుణ్యాలు నిజ జీవిత వినియోగం విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం. కాబట్టి ఇలాంటి విద్యా ప్రమాణాలు లేని జీవన ప్రయాణం గాఢాంధకారమైన మార్గంగానే గోచరిస్తుంది. అందుకే జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోగలిగే మహాయుధంగా ప్రతి ఒక్కరికి విద్యాహక్కు చట్టంకు అనుగుణంగా మానవీయ విలువలతో కూడిన గుణాత్మక విద్య తప్పనిసరి.*

దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్యను సామాజిక అంశంగా నాటి నుండి నేటి తరం వరకు గుర్తిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఆధునిక జీవన విధానంలో ప్రామాణికమైన, గుణాత్మకమైన విద్యను అభ్యసించిన పరిజ్ఞానమే దేశాభివృద్ధిలో అత్యంత కీలకంగా మారుతుంది. కచ్చితత్వం, విశ్వసనీయ ఆదర్శవంతమైన మంచి ఆలోచనాత్మక ధోరణితో ఉన్న విద్యావ్యవస్థ దేశానికి ఎంతో ఉపయోగకరమైనది. ఇందుకు అవసరమైనటువంటి విధి విధానాలపై ప్రభుత్వాలు ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టాల రూపకల్పన చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యాహక్కు చట్టాల అమలు విధానంలో అనేక సందేహాత్మక అనుమానాలు రేకెత్తుతున్నాయి. విద్యా విభాగం రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ విద్యా బడ్జెట్ కేటాయింపుల్లో ఇంకా ఎక్కువ నిధిని ముఖ్యంగా పాఠశాల విద్యకు కేటాయించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్న భిన్న వాదనలు ఉండటం గమనార్హం. భారత దేశంలో రెండు వేల పది సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి అమల్లోకి వచ్చిన విద్యా హక్కుచట్టం దేశంలోని బడిఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా వివిధ యాజమాన్యాల కింద పనిచేసే విద్యాసంస్థలలో గుణాత్మక విద్యను అభ్యసించే విధంగా విద్యాహక్కు చట్టం ఉచిత నిర్బంధ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, చట్టపరంగా దేశంలోని ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల బాలబాలికలకుఉచిత నిర్బంధ విద్యను కఠినంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వం బాల కార్మిక వ్యవస్థ లేకుండా నిర్దిష్టమైన చర్యలు చేపట్టింది. విద్యాహక్కు చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం వివిధ యాజమాన్యంలోని పాఠశాలలో విద్యార్థులకు అనువైనటువంటి కనీస మౌలిక వసతులు కల్పించే విధానాలను రూపొందించింది. అయితే కార్యచరణలో పూర్తిస్థాయిలో ఏ మేరకు సఫలీకృతమవుతున్నదో, లేదో అనే చర్చ సమాజంలో జరుగుతున్నది. సంస్కారవంతమైన విలువలతో కూడిన ఉత్తమమైన విద్య ఎంతో ఉన్నతమైనది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే రీతిలో మంచి ఆలోచన విధానాలకు పదును పెట్టే విధంగా పాఠశాల విద్యకు విద్యాహక్కు చట్టం అధిక ప్రాధాన్యతనీ మరింతగా ఇవ్వవలసిన అవసరం ఉందనే అభిప్రాయం లేకపోలేదు. మారుమూల ప్రాంతాల్లో సైతం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా పాఠశాలలను నెలకొల్పి ఉచిత విద్యతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలు తదితరమైనవి ఉచితంగా అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలోమాత్రం అనుకున్నంత స్థాయిలో విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో నమోదు కావడం లేదన్న విమర్శలు, విద్యావ్యవస్థ మొత్తం ప్రభుత్వ పరంగా నడిపించాలనే వాదనలు ఉన్నప్పటికీ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలదే పై చేయి అవు




తుండడం, ఆర్థిక వైవిధ్యాలతో ఉన్నా కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలపై మొగ్గు చూపుతుండడం గమనార్హం. కానీ ప్రైవేట్ పాఠశాలలో విద్యా హక్కు చట్టం అమలు విధానంపై అనేక సందేహాలు ఉండడం, విద్యా హక్కు చట్టం కేవలం ప్రభుత్వ పాఠశాలకే వర్తిస్తాయా లేక ప్రైవేట్ పాఠశాలకు కూడా వర్తిస్తుందా అనే సంశయం విద్యార్థుల తల్లిదండ్రులలో ఉండటం దీనిపై ప్రభుత్వాలు కూడా ఖచ్చితమైన దిశానిర్దేశం సూచించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. విద్యాహక్కు చట్టాల అమలు విషయంలో కూడా ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉండాలన్న వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. గతంలో దేశంలో విద్యాభివృద్ధి కొరకు ఓబిబి, అపెప్, డిపెప్, సర్వశిక్ష అభియాన్ లాంటి కార్యక్రమాలు జాతీయ విద్యా ప్రణాళిక ప్రకారం నిర్వహించబడినప్పటికీ, రెండు వేల ఐదు సంవత్సరంలో విద్యా లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు భావవ్యక్తీకరణ కీలకమైనదని భావించిన విద్యా కమిషన్, నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానంతో ఒకటి నుండి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను కూడా సమగ్ర మూల్యాంకను ఆధారంగా రూపొందించి పాఠశాలల్లో బోధనభ్యాసనాలు కొనసాగిస్తూ వస్తున్నాయి. అయితే దేశంలో విద్యా హక్కు చట్టం అమలు అనుకున్న స్థాయిలో లేకపోవడానికి గల కారణాలు ఏవైనా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు మరింత అభివృద్ధి పరచవలసి ఉంది. ప్రభుత్వాలు విద్య విషయమై అనేక సందర్భాల్లో ప్రస్తావిస్తున్నప్పటికీ, విద్యకు బడ్జెట్ మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోతుందనే భిన్న వాదనలు ఉన్నాయి. విద్యాహక్కు అమలు విధానంలో భాగమైన పాఠశాల మౌలిక వసతులు, పరిపూర్ణమైన స్థాయిలో విద్యార్థులు ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా తరగతి గదుల నిర్మాణం చేస్తున్నప్పటికీ, ప్రాథమిక తరగతి స్థాయిలో ప్రతి విషయం బోధనకు ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి ఉండవలసిందే అనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో కొన్ని సందర్భాల్లో చదువుకు అయ్యే ప్రవేశ రుసుములపై నియంత్రణ లేకపోవడం, ఒకఎత్తు అవుతుంటే విద్యాహక్కు చట్ట ప్రకారం ఒకటి నుండి పదవ తరగతి వరకు దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వికలాంగులకు సంబంధించినటువంటి వారి విషయంలో ఇరవై ఐదు శాతం ఉచిత విద్యను అందించవలసినటువంటి కార్పొరేట్ విద్యా సంస్థలు ఏ మేరకు విద్యా హక్కు చట్టాన్ని అమలు పరుస్తున్నాయో పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న విభిన్నమైన వాదనలు తెరపైకి వస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో విద్యలో విలువైన విద్యా ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యతను పోషిస్తాయి. విషయ అవగాహన, ప్రశ్నించడం పరికల్పన చేయడం, ప్రయోగాత్మకమైన సమాచార నైపుణ్యాలు నిజ జీవిత వినియోగం విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం. కాబట్టి ఇలాంటి విద్యా ప్రమాణాలు లేని జీవన ప్రయాణం గాఢాంధకారమైన మార్గంగానే గోచరిస్తుంది. అందుకే జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోగలిగే మహాయుధంగా ప్రతి ఒక్కరికి విద్యాహక్కు చట్టంకు అనుగుణంగా మానవీయ విలువలతో కూడిన గుణాత్మక విద్య తప్పనిసరి. ●

# చేపల రైతు చేతుల్లోనే ఆహార భద్రత!

రామ కిష్టయ్య సంగనభట్ల

ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాకుండా, దేశ మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపుకోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ కె.హెచ్. అలీకున్హి ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి నీలి విప్లవానికి నాంది పలికింది. నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131 లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతే కాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8 శాతంగా ఉంది. ఈ రంగం దాదాపు 2.8 కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35 శాతం వాటాను కలిగి ఉంది. సరైన విధా




నాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్యరంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి. కేంద్ర ప్రభుత్వం నీలి విప్లవాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్‌హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో దాదాపు 2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్ఏఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటివనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలో మార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం, రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్ని పంచుకుంటూ వ్యవస్థను మెరుగుపరిచే మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగా మారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ ఉద్దేశం. ●

# సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తత అవసరం

కామిడి సతీష్‌రెడ్డి

నిత్యం మనం వాడే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, చార్జింగ్ కేబుల్ డివైజ్ ఏదైనా సరే వానిని ఏమార్చి కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు ప్రతిచోటా మాటు వేసి ఉంటున్నారు. వీరు చేసే మోసాల గురించి అవగాహన కలిగి ఉండటం, తగిన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారానే వారికి అడ్డుకట్ట వేయగలమని సంబంధిత శాఖ అధికారులు, ఆయా బ్యాంక్ అధికారులు అంటున్నారు. నేటి ఆధునిక కాలంలో ఆన్‌లైన్ షాపింగ్, ఆన్లైన్ డబ్బు చెల్లింపులు అతి సర్వ సాధారణమైనాయి. జేబులో డబ్బులు అవసరం లేకుండానే మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే ఏ విధమైన చెల్లింపులైనా చేసే అవకాశం ఉంది. అతి తెలివిగా కేటుగాళ్లు (హ్యాకర్లు) మనంమొబైల్ వాడకంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డబ్బులు కొల్లగొట్టేస్తారు. మనం చేసే ఏ చిన్న పొరపాటైనా సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతుంది. కాబట్టి చాలా అప్రమత్తం, జాగ్రత్తగా ఉండాలి. పాస్‌వర్డ్లు సరిగ్గా పెట్టుకోకపోయినా, వారి మాయమాటలకు పడిపోయినా ఖాతాల్లో ఉన్నదంతా ఊడ్చిపెట్టుకుపోతుందని హెచ్చరిస్తున్నారు. ప్రతీ రోజు ఏదో ఒకచోట సైబర్ క్రైమ్ జరుగుతూ వుంది. మన అలసత్వం, అమయాకత్వాన్నే ఆసరాగా చేసుకొని కూర్చున్నచోటి నుంచే కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు సైబర్ నేరగాళ్లు. వీరి బారి నుంచి కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు సూచిస్తూ ఆర్బీఐ కొన్ని సూచనలు చేసింది. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు సెక్యూర్ పేమెంట్ గేట్‌వేస్‌ను ఎంచుకోవాలి. లేదంటే మన సమాచారం మూడో వ్యక్తికి చేరే ప్రమాదం ఉన్నట్టే. మీ పాస్‌వర్డ్లు, పిన్ నంబర్లు, క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు, సీవీవీ నంబర్లు భద్రంగా ఉంచుకోవాలి. మీ బ్యాంకు ఖాతాల వివరాలు క్రెడిట్, డెబిట్‌కార్డుల నంబర్లు సహా ఇతర వివరాలు ఎప్పుడూ మీ ల్యాప్‌టాప్స్, డెస్క్‌టాప్స్, వెబ్‌సైట్స్‌లో సేవ్ చేసి పెట్టుకోవద్దు. మీకు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే ఈ మెయిల్స్‌లోని అటాచ్‌మెంట్లు, ఫైళ్లపై ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వాటితో మీ కంప్యూటర్‌లోకి ఫిషింగ్ లింక్‌లు వచ్చే ప్రమాదం ఉంది. కొత్తవారితో మీ చెక్‌బుక్ కాపీలు, కేవైసీ డాక్యుమెంట్లు షేర్ చేయవద్దు. డివైజ్ లేదా కంప్యూటర్ సెక్యూరిటీ ఇలా తరచూ మీ పాస్‌వర్డ్లు మారుస్తూ ఉండాలి. మీ డివైజ్‌ల్లో మంచి యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవడంతోపాటు తరచూ డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలి. మీ కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్లకు తప్పక పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. మనకు తెలియని సోర్స్‌ల నుంచి యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు. మోసపోతే వెంటనే ఫిర్యాదు చేయాలి. మనం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తించిన వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అదేవిధంగా 24 గంటలపాటు పనిచేసే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. మన తెలుగు రాష్ట్రాలతో సహా ఇతర రాష్ట్రాల్లోనూ ఈ హెల్ప్‌లైన్ సేవలు ఉంటాయి. మనం కాల్ చేసిన వెంటనే పోలీసులు మన బ్యాంక్ ఖాతాను స్తంభింపజేస్తారు. దీనివల్ల మరింత సొమ్ము



మనఖాతా నుంచి పోకుండా కాపాడుకోవచ్చు. తర్వాత కేసు దర్యాప్తు ఉంటుంది. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేస్తున్నప్పుడు ఎల్లప్పుడు వర్చువల్ కీబోర్డు (కంప్యూటర్ స్క్రీన్‌పైన కీబోర్డు కనిపిస్తుంది)ను వాడాలి. సాధారణ కీబోర్డుపై మనం ఏయే నంబర్లు నొక్కామన్నది ఇతరులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. మీరు ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేసిన వెంటనే లాగ్‌అవుట్ కావాలి. తరచూ మీ పాస్‌వర్డ్‌ను మారుస్తూ ఉండాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు మీ ఈ మెయిల్‌కు ఒకే పాస్‌వర్డ్‌ను ఎట్టిపరిస్థితుల్లో పెట్టకోవద్దు. సైబర్‌కేఫ్‌లు, ఇతర పబ్లిక్ కంప్యూటర్లలో ఇంటర్నెట్ బ్యాంకింగ్ చేయకపోవడం ఉత్తమం. పాస్‌వర్డ్ పక్కాగా ఉండేలా చూసుకోవాలి. మీ పాస్‌వర్డ్ మీ ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలకు, సోషల్ మీడియా ఖాతాలకు తాళం వంటిది. ఇది పక్కాగా ఉండేలా చూసుకోవాలి. అవకాశం ఉన్న ప్రతి చోటా టూ ఫ్యాక్టర్ (రెండంచెల సెక్యూరిటీ) ఆథంటికేషన్ పెట్టుకోవాలి. సైబర్ క్రైమినల్స్, హ్యాకర్లు స్పైవేర్‌ను టార్గెట్ చేసిన ఫోన్లలో ప్రవేశపెట్టేందుకు చాలా ఈజీ మార్గం ఫేక్ యాప్స్. మామూలుగా స్మార్ట్‌ఫోన్ల యూజర్లకు అవసరమైన యాప్స్‌ను పోలినట్టుగానే ఉండే నకిలీ యాప్స్ ప్లేస్టోర్‌లో పెడతారు. వాటిలో వాస్తవానికి అసలైన యాప్ ఉండదు. మనం తెలియక ఆ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేశామంటే ఆటోమేటిక్‌గా ఫోన్ హ్యాక్ అయిపోతుంది. సోషల్ మీడియాలో, కొన్ని రకాల వెబ్‌సైట్లలో, పోర్న్ సైట్లలో కూడా ఈ ఫేక్‌యాప్స్‌కు సంబంధించిన లింక్ ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. పొరబాటున కూడా వాటిని క్లిక్ చేయకూడదు. అలాగే కొత్త యాప్స్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవడం మంచిది. వాట్సాప్, ఈమెయిల్స్, ఎస్ఎంఎస్ ద్వారా కూడా హ్యాకర్లు స్పైవేర్ లింకులు పంపుతారు. లోన్లు ఇస్తామని, జాబ్ ఆఫర్ అని, సర్‌ప్రైజ్ గిఫ్ట్ అని, లక్కీ డిప్ అని, ఫోన్‌కు కొత్త ఫీచర్స్ అని ఇలా రకరకాల ఫేక్ లింక్స్ క్రియేట్ చేసి వాట్సాప్, ఈమెయిల్, లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపి, మీ ఫోన్‌ను హ్యాక్ చేసే ముప్పు ఉంటుంది. పొరబాటున ఆ లింక్‌ను క్లిక్ చేస్తే ఫోన్‌లో హ్యాకర్ పంపిన వైరస్ ఇన్‌స్టాల్ అవుతుంది. దీంతో అది మన డేటాను మొత్తం హ్యాకర్‌కు పంపేస్తుంది. ఫోన్ ఆ హ్యాకర్ కంట్రోల్‌లోకి వెళ్లిపోతుంది. అందుకే అనవసరంగా పనికిరాని లింకులు ఓపెన్ చేయకుండా ఉంటే బెటర్. మన పర్సనల్ డేటా పొరబాటున హ్యాకర్లకు దొరికితే హ్యాకర్లు సిమ్ కార్డు స్వాప్ టెక్నిక్ వాడుతారు. ఆ డేటా సాయంతో హ్యాకర్లు టెలికాం ఆపరేటర్‌కు కాల్ చేసి సిమ్ రిప్లేస్‌మెంట్ కోసం డిమాండ్ చేస్తారు. ఒకవేళ సిమ్ ఇష్యూ అయితే మన ఫోన్‌లో ఉన్న పాత సిమ్ డీయాక్టివేట్ అవుతుంది. దీంతో ఇక హ్యాకర్‌కు మన ఫోన్ నంబర్ ఫుల్ యాక్సిస్ వచ్చేస్తుంది. దీంతో మన బ్యాంక్ లావాదేవీలు, ఓటీపీలు అన్నీ ఆ ఫోన్‌కే వెళ్తాయి. అయితే ప్రస్తుతం సిమ్ తీసుకోవాలంటే ఆధార్ లింక్, బయో మెట్రిక్ తప్పనిసరి కావడంతో ఈ ప్రమాదం కొంత వరకు తగ్గుతుంది. కానీ సిమ్ క్లోనింగ్ అనే మరో ప్రక్రియ ద్వారా మన సిమ్ యాక్టివ్‌లో ఉండగానే, మన నంబర్‌తోనే ఇంకో సిమ్ క్రియేట్ చేసే టెక్నాలజీ కూడా వచ్చింది. ఇది ఇంకా ప్రమాదకరం. అందుకే ఆధార్ నంబర్ లాంటి మన పర్సనల్ డేటాను లీక్‌కాకుండా చూసుకోవాలి. బ్లూటూత్ సహాయంతో కూడా హ్యాకర్లు ఒక నిర్ణీత దూరంలో ఉన్న ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను హ్యాక్ చేసే చాన్స్ ఉంది. ఇందుకోసం హ్యాకర్లు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. ఈ హ్యాకింగ్ ఎక్కువగా బహిరంగ ప్రదేశాల్లో జరుగుతుంది. పబ్లిక్ వైఫైని వాడే వాళ్లు హ్యాకర్లకు ఈజీ టార్గెట్ అవుతారు. అందుకే పబ్లిక్ వైఫైని వాడకపోవడం మంచిది. అలాగే మీ వైఫైని ఓపెన్‌గా వదిలేయకుండా ఉండాలి. కచ్చితంగా స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలి. సైబర్ నేరాల గురించి సరైన అవగాహన పెంచుకుని ఎవరికి వారు రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. ●

Main tab page 111_Main tab page 111.qxd 7/10/2025 12:12 AM Page 1



## జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముందంజ

**- మాజీ మంత్రి డాక్టర్ నాగార్జున, జిల్లా వైసీపీ అధ్యక్షులు బూచేపల్లి, వెంకాయమ్మలు వెల్లడి**

సంతనూతలపాడు, జూలై 9, ప్రభాతవార్త




రాష్ట్రంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన కన్నా వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం ముందంజలో ఉన్నట్టు మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున, జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలు తమ తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఒంగోలు సమీపంలోని త్రోవగుంట వద్ద గల విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ నందు బుధవారం నాడు బాబు షూరిటీ, మోసం గ్యారంటీపై జరిగిన సంతనూతలపాడు నియోజకవర్గ విస్తృత సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అధ్యక్షత వహించారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు అధికారంలో వచ్చిన తదుపరి ముఖ్యంగా ప్రజలను మోసం చేస్తున్నారని, దీనిపై వైసీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామాలు, పట్టణాలలో ప్రజలను చైతన్య పరచాలని మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున తన ప్రసంగంలో పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తదుపరి హామీలను అనుసరించి నిరుద్యోగులకు, మహిళలకు నేటి వరకు భృతి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి



చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు పోలీసులచే ఆయా పర్యటనలను నీరు గార్చేందుకు కుట్రలతో అడ్డుకుంటున్నారని మాజీ మంత్రి నాగార్జున ఆరోపించారు. ఎమ్మెల్యే బూచేపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు లభిస్తున్న ప్రజా ఆదరణను చంద్రబాబునాయుడు తట్టుకోలేక భయాందోళనలతో ఆయన పర్యటనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి ఈ అడ్డంకులా టీడీపీ కూటమి నేతలకు ఇవి వరించవా అంటూ డాక్టర్ బూచేపల్లి ఈ సందర్భంగా ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున తప్పక గెలవనున్నట్లు డాక్టర్ బూచేపల్లి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ 108 పథకాలను ప్రవేశపెట్టి ప్రజలు గెండెల్లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నిలిచారని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహ న్‌రెడ్డిని గెలిపించేందుకు ఇప్పటి నుండే కృషి చేస్తున్నారన్నారు. సంవత్సర పరిపాలనలోనే కూటమి ప్రభుత్వం విఫలమైనట్టు జిల్లా పరిషత్ చైర్మన్ వెంకాయమ్మ ఆరోపించారు. వైసీపీ నేతలపై రకరకాల కేసులు పెట్టే అభివృద్ధి తప్ప రాష్ట్రంలో మరి ఏ అభివృద్ధి లేదని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్నొన్నారు. ఈ సమావేశంలో వైసీపీ జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ చైర్మన్ ర్టా వైసీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మాదిగ, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, జిల్లా వైసీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, ఎంపీపీలు బుడంగుంట విజయ, వాకా అరుణ కోటిరెడ్డి, నల్లమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, దుంపా రమణమ్మలు సర్పంచ్‌లు దర్శి నాగమణి, బి.శైలజ అమర్నాథ్, విజయలక్ష్మి, తలారి వెంకటరావు, తదితరులు చీమకుర్తి పట్టణ వైసీపీ అధ్యక్షులు కే.శేఖర్‌రెడ్డి, మండలాల వైసీపీ అధ్యక్షులు పి.శివన్నారాయణ, దుంపా చెంచిరెడ్డి, పి.వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, దుమ్మాల శ్రీనివాసరావు, పి.కోటేశ్వరరావు. పి.చెన్నకేశవులు, పులి వెంకట్‌రెడ్డి, జి.ఓబుల్‌రెడ్డి, కే.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 13న ఉచిత కంటి వైద్య శిబిరం

చీమకుర్తి, జూలై 9, ప్రభాతవార్త



చీమకుర్తిలో ఈనెల 13న బూచేపల్లి కమలాకర రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం ను నిర్వహిస్తున్నట్లు దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. చీమకుర్తి బూచేపల్లి కమలాకర్ రెడ్డి పార్కులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారి మాతృమూర్తి, జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాలూకా ఈ వైద్య శిబిరాలను చెందిన వాల్ పోస్టర్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ లతో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తమ సోదరుడు సినీ నటుడు బూచేపల్లి కమలాకర్ రెడ్డి పేరుతో గత పదేళ్లుగా ప్రతి ఏటా పేదలకు వైద్యం అందించడానికి ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది 800 నుంచి 1000 మంది వరకు ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేయించడంతోపాటు అవసరమైన వారికి ఆపరేషన్ కూడా చేయిస్తున్నామన్నారు. ఈనెల 13న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందిస్తారని తెలిపారు. హాజరయ్యే ప్రతి ఒక్కరు ఐడి కార్డు తీసుకొని రావాలని ట్రస్టు ద్వారా అన్నదానం కూడా నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని బూచేపల్లి కోరారు. కార్యక్రమంలో చీమకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర, పట్టణ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్రిష్ణపాటి శేఖర్ రెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ నలమోలు మాణిక్యం, మున్సిపల్ కౌన్సిలర్లు భీమన వెంకట్రావు, షేక్ బాజా, పాడిబండ్ల గంగయ్య, బడే ఆయ్యప్ప రెడ్డి , సోమ శేషాద్రి, షేక్ బాషా, టీడీపీ నాయకులు తెల్ల మేకల గాంధీ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## చీమకుర్తిలో కార్మిక సంఘాల భారీ ప్రదర్శన

చీమకుర్తి, జూలై 9, ప్రభాతవార్త




లేబర్ కోడ్స్ రద్దు, ఉపాధి కార్మిక,రైతు ప్రజా సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా చీమకుర్తి పట్టణంలో కార్మిక,రైతు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన చేశారు. బుధవారం ఆర్టీసీ డిపో వద్ద నుండి స్టేట్ బ్యాంకు వరకు జరిగిన ఈ ప్రదర్శనతో చీమకుర్తి ప్రధాన రహదారి ఎరుపుమయమైంది. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాలు కోసమే కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. వీటివలన కార్మికులు హక్కులు కోల్పోతారని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని కాలం సుబ్బారావు కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని,స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస పెన్షన్ 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించారు. రైతు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని,స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని,ఉపాధి హామీ పథకం 200 రోజులకు పెంచి రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పూసపాటి వెంకట్రావు మాట్లాడినారు. కార్యక్రమంలో గ్రానైట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బి వీర ఆంజనేయులు, బొద్దు ఓబులేసు జి ఆంజనేయులు, కనకరాజు, పుల్లయ్య, శంకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాడిబండ్ల పద్మ,పాలేటి ఏడుకొండలు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం మాధవి విజయ, శారద, ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బిడి ఆంజనేయులు, నాగరాజు శంకర ముఠావర్కర్స్ యూనియన్ నాయకులు జి ప్రభుదాసు, వై ప్రభుదాసు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నున్న శ్రీను వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు శీలం ఆదినారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు రైతు సంఘంమండల నాయకులు కొల్లూరు వెంకటేశ్వర్లు నల్లూరి కృష్ణయ్య వృత్తిదారుల సంఘం నాయకులు సిహెచ్ కొండయ్య, కెవిపిఎస్ మండల నాయకులు టి రామారావు కార్మికులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## సిఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలుటౌన్, ప్రభాతవార్త




ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని బుధవారం ఉండవల్లిలోని వారి స్వగృహంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మర్యాద పూర్వకంగా కలిసి, ఒంగోలు నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలుపై సియంతో చర్చించారు. జిల్లా పరిస్థితులు, వివిధ సమస్యలు వాటి పరిష్కారాలపై సియంతో ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడారు. ఒంగోలు నియోజకవర్గం, జిల్లా అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని సియం తెలిపినట్లు ఎమ్మెల్యే అన్నారు.

# ఆశల పల్లకిలో ఆశావాహులు

- *తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న అసెంబ్లీ సీట్లు*
- *2026 జనాభా లెక్కల ఆధారంగా కేటాయింపు*
- *పలువురు నాయకుల్లో ఎమ్మెల్యేల ఆశలు*
- *సీటు కోసం ఇప్పట్నించే పావులు - అందరి దృష్టి పునర్విభజనపైనే*

ఒంగోలు, ప్రభాతవార్త

ఎప్పుడెప్పుడు అని ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల పెంపునకు మార్గం సుగమయమైంది. గత 11 సంవత్సరాల్లోగా ఈ విషయంపై నాన్చుడు ధోరణి అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు అడుగు ముందుకు వేసింది. 2026 ఏప్రిల్ 1వ తేదీన చేపట్టనున్న జాతీయ జనగణన ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో 50 ఎమ్మెల్యే సీట్లు, తెలంగాణలో 34 ఎమ్మెల్యే సీట్లు అదనంగా పెరగనున్నాయి. ఎప్పుడు లేని విధంగా ఈసారి జనగణనతో పాటు కులగణన కూడా అంతర్లీనం చేయడంతో జనాభా నిష్పత్తి ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ స్థానాలపై సైతం ఒక స్పష్టత రానుంది. ఇక తమకు కూడా రిజర్వేషన్లు దక్కుతాయోమోనని బీసీలు సైతం ఎదురు చూస్తున్నారు. ఈ నేపధ్యంలో 2029 శాసనసభ ఎన్నికల్లో పోటీపడే ఆశావాహుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. తద్వారా వారంతా తమతమ పార్టీ అధిష్టానాలను ఇప్పట్నించే ప్రసన్నం చేసుకునే పనిలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నట్లుగా తెలంగాణ, విభజిత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నియోజక వర్గాల పెంపు చేపట్టనుండటంతో తెలుగు రాష్ట్రాల భౌతిక, రాజకీయ సాంస్కృతిక అంశాల్లో కీలక మార్పులు చోటుచేసుకోవడం తధ్యమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది అవుతుంది. అదే తెలంగాణలో అయితే ఏడాదిన్నర కాలం కావస్తుంది. కాని రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం ఇది ఎన్నికల ఏడాదా అనే అనుమానం వచ్చేలా అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా విమర్శల బాణాలను సందించుకుంటున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అయితే కూటమి పార్టీలు ప్రతిపక్ష వైసీపీ ఎత్తుకు పై ఎత్తులతో దూసుకెళ్తున్నాయి. ఓ వైపు తొలి ఏడాది ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో సుపరిపాలనలో తొలి అడుగును కూటమి పార్టీలు ప్రజల్లోకి వెళ్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యక్రమాన్ని కూడా రూపొందించి బాబు షూరిటీ- మోసం గ్యారంటీ పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారు. దీంతో రాష్ట్రంలో రాజకీయ వేడి నెలకొంది. ఇలాంటి తరుణంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం జాతీయ జనాభా లెక్కల సేకరణకు నోటీఫికేషన్ ఇవ్వడం, తద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో పునర్విభజన చట్టం ప్రాతిపదికన అసెంబ్లీ నియోజకవర్గాల పెంపునకు దారులు తెరుచుకోవడం నాయకుల్లో మరింత ఊపు తెచ్చింది. 2014లో తెలుగు రాష్ట్రాలు విడిపోయిన వెంటనే ఆస్తులను, అప్పులను 2011 జనాభా లెక్కల ప్రకారం అప్పటి కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వం ఇరు రాష్ట్రాలకు కేటాయించింది. అయితే నియోజకవర్గాల



పెంపు విషయాన్ని మాత్రం అలాగనే ఉంచింది. ఆంధ్రాలో వరుసగా మోదీ భజన ప్రభుత్వాలు ఉండటంతో దీనిపై నోరుమెదపలేదు. తెలంగాణలో ప్రభుత్వాలు మాత్రం అనేక సార్లు కేంద్రానికి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలంటూ వినతులు సమర్పించారు. సుప్రీంకోర్టులో సైతం కేసులు నమోదు అయ్యాయి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అసెంబ్లీ సీట్ల పెంపుపై తాస్కారం చేస్తూ వచ్చింది. చివరికి కొత్త జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఏపీ రీ ఆర్గనైజేషన్ వ్యాట్ ప్రకారం తెలంగాణ విభజిత ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన వెంటనే అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మిన్నకుండిపోవడంతో జాతీయ ఎన్నికల కమీషన్ సైతం పాత నియోజకవర్గాల సంఖ్యతోనే ఎన్నికలు నిర్వహించింది. ఫలితంగా ఆంధ్రాలో 175 నియోజకవర్గాలకు, తెలంగాణాలో 119 నియోజకవర్గాలకుమూడు సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే దీనికి కారణం 2021లో చేపట్టాల్సిన జనగణన కరోనా కారణంతో చేపట్టలేకపోతున్నట్లు అని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా 2026 ఏప్రిల్ 1 నుంచి 16వ జాతీయ జనన గణన అధికారికంగా ప్రారంభమవుతుందని రిజిస్ట్రర్ జనరల్ సన్సెస్ కమీషనర్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 31లోపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర పాలిత ప్రాంతాల కార్యదర్శులు జనాభా లెక్కల సేకరణకు వీలుగా పరిపాలన యూనిట్లలో మార్పులు చేర్పులను తెలియజేయాలని సూచించారు. ఈ మేరకు ఇన్యుమరేటర్లను నియమిస్తామని ప్రకటించారు. 2027 మార్చి 1తేదీనాటికి జనాభా లెక్కల సేకరణను పూర్తి చేస్తామని వెల్లడించారు. దేశంలో చివరి సారి 2011లో జనగణన జరిగింది. మళ్లీ 15 సంవత్సరాల తరువాత చేపట్టనున్నారు. కాగా తెలంగాణ రాష్ట్రాల్లో జనాభా నిష్పత్తిలో పెరుగుదల ఎలా ఉన్నా ఒక్కో ఎంపీ నియోజకవర్గానికి సగటున రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు పెంపు మాత్రం ఖచ్చితంగా ఉండనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక ఎంపీ నియోజకవర్గానికి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో నియోజకవర్గాల సంఖ్య 225కు, తెలంగాణాలో 153 కు చేరుకోనున్నాయి. ఫలితంగా ప్రస్తుతం ద్వితీయ శ్రేణి నేతలుగా ఉన్న పలువురు ఎమ్మెల్యే యోగం పొందడం కోసం ఇపట్నించే ఆశలు పెట్టుకుంటున్నారు. తమ అధినేతలు మెప్పు పొందేందుకు అంగఅర్ధబలం ప్రదర్శించేందుకు తహతహలాడుతున్నారు. తెలుగురాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు తథ్యమైన ఎంపీ నియోజకవర్గాలపై మాత్రం సందిగ్ధం నెలకొంది.

## ప్రజా ప్రభుత్వానికి ప్రజల జేజేలు..ఎమ్మెల్యే కందుల


మార్కాపురం జూలై 9 ప్రభాతవార్త



సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను వర్తింపజేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అందుకే ప్రజలు జేజేలు పలుకుతున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు, బుధవారం పట్టణంలోని నాలుగవ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా టిడిపి శ్రేణులు గడపగడపకు తిరుగుతున్నారని ప్రజలు ప్రభుత్వ పథకాలపై చంద్రబాబు పాలనపై ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు, అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే హామీలను నెరవేరుస్తూ మరిన్ని జనరంజక పథకాలను ప్రజలకు అందిస్తున్నందుకు వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు, కూటమి ప్రభుత్వం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు, క్లిష్ట పరిస్థితులలో తల్లికి వందనం పథకం ఎంతగానో ఆదుకుందని విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేయగా పెన్షన్ కోసం ఎదురు చూడకుండా భరోసా పెన్షన్లను సకాలంలో ఇంటి వద్దకు చేర్చి వృద్ధులను ఎంతగానో ఆదుకుంటున్నారని, మరికొందరు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు యువతకు 16 347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు, పోలీసు శాఖలో ఉద్యోగాలు, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పనకు ఒప్పందాలు, ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం రైతు సంక్షేమం కేంద్రం సహకారంతో నిధులను జోడించి అన్నదాత సుఖీభవ పథకం అందించడం అన్న క్యాంటీన్లు పునరుద్ధించడం తెలుగుదేశం పార్టీకి దక్కిందని అన్నారు, వైసీపీ పాలనలో రాష్ట్రం అతలాకుతలం అయిందని వెలుగొండ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని పూర్తికాని వెలుగొండను పూర్తి అయినట్లు ప్రకటించి జాతికి అంకితం చేసి చేతులు దులుపుకున్నారని వైకాపా ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు జాతికి అంకితం చేసిన వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కావాలంటే మరో నాలుగు వేల కోట్లు అవసరం ఉందని 24/7 నిరంతరంగా పనులు చేస్తే గాని వెలుగొండ ప్రాజెక్టు రెండు సంవత్సరాలు పూర్తి కాదని వివరించారు మోసపూరిత విధానాలతో వైకాపా ప్రభుత్వం ప్రజలకు చెవుల్లో పువ్వు పెట్టిందని, ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందని అన్నారు, టిడిపి శ్రేణులు వైకాపా తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని నిరంతరం ప్రజలలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు, ఈ సందర్భంగా బూత్ ఇన్చార్జిలతో కలిసి టీడీపీ యాప్ లో కుటుంబాల వివరాలను నమోదు చేయించారు, ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు కందుల రామిరెడ్డి, పార్టీపట్టణ అధ్యక్షుడు ఇబ్రహీం ఖాన్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ మోలాలి, కందుల వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవ్యవస్థలో మధ్యవర్తిత్వం సమస్యల పరిష్కారానికి దోహదం

ఒంగోలుటౌన్, ప్రభాతవార్త



న్యాయవ్యవస్థలో మధ్యవర్తిత్వం అనేది భవిష్యత్తు రోజుల్లో కక్షిదారుల మధ్య సమస్యల పరిష్కారానికి మరింత మెరుగ్గా పనిచేస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఏ. భారతి అన్నారు. బుధవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థానంలో కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన మీడియేషన్ ఫర్ నేషన్ అనే కార్యక్రమము కింద నిర్వహించిన మీడియేషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మీడియేషన్ అనేది సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు వివిధ రకాలైనటువంటి ప్రచారాల ద్వారా మరింత ప్రజలలోకి తీసుకెళ్తామని అన్నారు. శిక్షణ ముగించిన న్యాయవాదులు మరియు స్వచ్ఛంద సేవ ప్రతినిధులు వారికి అప్పగించిన మీడియేషన్ వ్యాజ్యాలను సమర్ధవంతంగా పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులకు మరియు ఇతరులకు శిక్షణ ఇచ్చిన న్యాయవాది అయిన ్ర. అరుణచలం ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి రాజ్యలక్ష్మి, పి లలిత, పూర్ణిమ, జి. దీన టి రాజా వెంకటాద్రి మరియు సీనియర్ న్యాయమూర్తులు ఎస్. హేమలత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ జూనియర్ సివిల్ న్యాయమూర్తులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ బొడ్డు భాస్కరరావు మరియు ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఎన్నిక చేయబడిన మీడియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## గాడిపర్తి వారి పాలెం సొసైటీ అధ్యక్షుడిగా జ్యోతి వేణు

చీమకుర్తి, జూలై 9, ప్రభాతవార్త



చీమకుర్తి మండలం గాడిపర్తి వారి పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్‌గా జ్యోతి వేణు నియమితులయ్యారు. ప్రభుత్వము నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సొసైటీ త్రీ మెన్ కమిటీలో సభ్యులుగా మనిమేల అంకమ్మరావు, ముప్పనేని తిరుపతి స్వామీలు నియమితులయ్యారు.

## పొగాకు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు: ఇంచార్జి కలెక్టర్

ఒంగోలు, ప్రభాతవార్త



పొగాకు రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ మద్దిపాడు మండలం, గార్లపాడు గ్రామంలో గల పొగాకు కొనుగోలు కేంద్రంను సందర్శించి, పొగాకు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్, రైతులతో మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రానికి ఎన్ని క్వింటాళ్ల పొగాకు తెచ్చారు, షెడ్యులు ప్రకారం కొనుగోలు చేస్తున్నారా, కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు తెచ్చిన పొగాకు బేళ్ళ నిల్వలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, ఎంత స్టోరేజ్ చేయవచ్చు, కొనుగోలు అనంతరం రైతులకు నగదు చెల్లింపు ఎలా ఉంటుంది తదితర వివరాలతో పాటు పొగాకు కొనుగోలు విధానాన్ని గురించి మార్క్ ఫెడ్ అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 రోజుల నుండి గార్లపాడులోని కొనుగోలు కేంద్రంలో హెచ్‌డి బార్లీ పొగాను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుచున్నదన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 110 మంది పొగాకు రైతుల వద్ద నుండి 3 కోట్ల రూపాయల విలువ గల 360 మెట్రిక్ టన్నుల పొగాకును కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సిఎం యాప్‌లో పొగాకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్న తరువాత, నిర్దేశించిన షెడ్యుల్ ప్రకారం రైతుల వద్ద నుండి మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు ను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ నెల వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, పొగాకు రైతులేవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం జారి చేసిన మార్గదర్శకాల ప్రకారం గ్రేడింగ్ చేసుకొని బేళ్ళ తీసుకువస్తే మార్క్ఫెడ్ వారు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సూచించారు. పొగాకు రైతులకు మేలు చేకూరేలా పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్‌డిఓ లక్ష్మీ ప్రసన్న, మార్క్ ఫెడ్ డిఎం హరికృష్ణ, మద్దిపాడు తహసిల్దార్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి - ఎపిడబ్యజెఎఫ్ డిమాండ్

ఒంగోలుటౌన్, ప్రభాతవార్త




సార్వత్రిక సమ్మెకు ఎపిడబ్యజెఎఫ్ జిల్లా కమిటీ మద్దతుకార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కొడ్సును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఎపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా కమిటీ నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మెకు ఎపిడబ్ల్యుజెఎస్ జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. కలెక్టరేట్ నుంచి జర్నలిస్టులు ప్రదర్శన చేపట్టి సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు. ఎస్ వి బ్రహ్మం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. సమ్మెను హక్కును రద్దు చేశారని, యూనియన్ల ఏర్పాటు వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ కేంద్ర కార్మిక సంసూల చేపట్టిన సార్వత్రిక సమ్మెకు ఎపిడబ్ల్యుజెఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు.భవిష్యత్తులో వారు చేపట్టే కార్యక్రమాలలో తాము పాల్గొంటామన్నారు. అదేవిధంగా జర్నలిస్టుల వేతన చట్టం 1958 పునరుద్ధరించాలని, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955 పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్వి ప్రసాదరావు, సినియర్ జర్నలిస్ట్ పి.విజయ భాస్కర్ రెడ్డి, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు వి. భక్తవత్సలం, జిల్లా కార్యదర్శి దాసరి సునీల్, కార్యదర్శి సేక్ ఖుషిదా, ప్రచార కమిటీ కార్యదర్శి మీడియా కోఆర్డినేటర్ ఎల్.రాజు, జర్నలిస్టులు వి.కోటయ్య, బొడ్డు శ్రీనివాసరావు, షేక్ సజీర్, పి.శ్రీనివాస రావు, ఆర్. తారకరామారావు, జి. శేషుబాబు, ఎస్. సురేష్ కుమార్, ఏబ్రహ్మాయ్య పాల్గొన్నారు.

## 40 మంది క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్లకు బి సర్టిఫికెట్ - గ్రేడ్ ఏలో ఉత్తీర్ణత

ఒంగోలుటౌన్, ప్రభాతవార్త



ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 40 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ కనబరిచారు. బీ సర్టిఫికెట్ రాత పరీక్షకు హాజరైన 40 మంది ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించి బీ సర్టిఫికెట్లు పొందారు. 34వ ఆంధ్రా బెటాలియన్ ఒంగోలు క్యాడెట్లకు ఈ సర్టిఫికెట్లు అందించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన క్యాడెట్లు సీ సర్టిఫికెట్‌కి అర్హత పొందుతారు. బీ సర్టిఫికెట్ పొందిన క్యాడెట్లు అగ్నివీర్ ద్వారా ఆర్మీలో చేరేందుకు అవకాశం ఉంటుంది. బోనస్ పాయింట్లు వచ్చి ఆర్మీలో ఉద్యోగాలు సాధించేందుకు ఉపయోగపడుతుందని ఎన్ సీసీ విభాగాధిపతి రమణయ్య తెలియజేశారు. సర్టిఫికెట్లు సాధించిన క్యాడెట్లను క్విస్ అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి,కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, అభినందించారు.

6_6.qxd 7/10/2025 12:08 AM Page 1



# లేబర్ కోడ్స్ రద్దు చేయాలని

## కార్మిక సంఘాలు డిమాండ్

**సింగరాయకొండ, జూలై 9,ప్రభాతవార్త**



కార్మికుల హక్కులను బలహీనపరచే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సింగరాయకొండలో కార్మిక సంఘాలు పిలుపు మేరకు సీఐటీయూ ఐఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ (న్యూ), ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి కందుకూరు రోడ్డుకూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ – "కార్మికుల సంక్షేమానికి వ్యతిరేకంగా రూపొందించిన లేబర్ కోడ్స్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని అన్నారు.కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కొరకు పోరాటాన్ని ఆగకుండా కొనసాగిస్తాం"అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్మికనాయకులు సుల్తాన్ బాషా, టి. రామమూర్తి, నక్కా శ్రీనివాసులు, మున్వర్ బాషా,రమణారావు, శ్రీదేవి,ఇందిరా,నాంచార్లు, అంబటి కొండలరావు, వై. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం కేసు నమోదు

**సింగరాయకొండ, జూలై 9, ప్రభాతవార్త**



మతిస్థిమితం లేక అదృశ్యం అయిన ఓ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకుసింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ గ్రామంలోని గుజ్జుల యలమందారెడ్డి నగర్‌కు చెందిన 13 ఏళ్ల చినకత్తుల జాలమ్మ అనే బాలిక జూన్ 29వ తేదీన అదృశ్యమైంది.మతిస్థిమితం సరిగాలేని ఈ బాలిక గతంలో కూడా తరచూ ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని రోజుల తర్వాత తిరిగివచ్చేది. అయితే ఈసారి బయటకు వెళ్లిన తర్వాత ఇప్పటి వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ఈ మేరకు బాలిక తల్లి చినకత్తుల శీనమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో సింగరాయకొండ ఎస్ఐ బీ. మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక కోసం గ్రామ పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆమె గూర్చిన ఎలాంటిఆచూకీ, సమాచారం లభించలేదని పోలీసులు తెలిపారు. ఎవరికైనా ఆ బాలిక వివరాలు తెలిస్తే 91211 02136 ఈ నెంబర్లకు తెలియపరచగలరనికోరారు.

# విద్యార్థులకు వినయంతో కూడిన విద్యను అందించాలి

**సింగరాయకొండ, జూలై 9, ప్రభాతవార్త**



విద్యార్థులకు వినయంతో కూడిన విద్యను అందిస్తే ఎల్లప్పుడు విజయం సాధిస్తుందని మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ లోని గౌదగట్లవారి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ గురువు కీ.శే. బూదూరి ఉమామహేశ్వరరావు జ్ఞాపకార్థం,ఆయన శిష్యుడు నల్లబోతుల కొండలరావు ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల చిత్రపటాలను ఎంఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుండే గురుభక్తి,జాతీయ సమైక్యత, దేశభక్తి,క్రమశిక్షణ వంటి విలువలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు మంచి మార్గంలో సాగేందుకు ఉపాధ్యాయులు,తల్లిదండ్రులుబాధ్యత వహించాలి" అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్రిబోయిన రాంబాబు మాట్లాడుతూ తాను కూడా ఉమామహేశ్వరరావు శిష్యుడినని, ఆయన ఎంతో క్రమశిక్షణ, నైతిక విలువలతో ఎందరో విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దారని గుర్తుచేశారు.గురువుకు గుర్తుగాశిష్యుడు నిర్వహించినఈ కార్యక్రమంవిద్యార్థుల్లో గురువులపట్ల గౌరవాన్ని పెంపొందిస్తుందని కొనియాడారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరాజు,రమణారెడ్డి,రామారావు,అజయ్,హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, వెటర్నరీ అసిస్టెంట్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# గర్భిణీలకు మాతృత్వ అభియాన్‌తో వైద్య సేవలు

**సింగరాయకొండ, జూలై 9,ప్రభాతవార్త**



గర్భిణీలకు ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నమని, క్రమం తప్పకుండా వైద్య సలహాలు తీసుకోవాలని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఆయేషా బేగం సూచించారు. బుధవారం సింగరాయకొండ ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా వైద్యులు డా.ధీరేంద్ర, డా.వంశీధర్,డా.లేనా రఫేల్,ఫాయాజ్‌లు పాల్గొని గర్భిణీలకు సుఖప్రసవానికి అవసరమైన ఆరోగ్య సూచనలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భధారణ కాలం నుంచి వైద్య పర్యవేక్షణలో ఉండటం వల్ల ప్రసవ సమయంలో తలెత్తే సమస్యలు నివారించవచ్చని వివరించారు.ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీలు ఉచిత వైద్య పరీక్షలు,సేవలు పొందవచ్చని చెప్పారు. ఇంటి నుండే ఆసుపత్రి వరకు ఆరోగ్య కార్యకర్తలు అందించే సూచనలను పాటిస్తూ, వైద్యుల సలహాలు తీసుకోవడం ద్వారా సురక్షిత ప్రసవం సాధ్యమవుతుందని హితవు పలికారు.ఈ కార్యక్రమాన్ని ప్రతి గర్భిణీ స్త్రీలు పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యులు సూచించారు.ఈ కార్యక్రమంలో గర్భిణీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే మెంబర్‌కి వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు

**దొనకొండ,జులై 9,ప్రభాతవార్త**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా పివిఎన్ మాధవ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా విజయవాడలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన ఇండియన్ రైల్వేబోర్డు మెంబర్ సిద్ధనూర్తుకుమారికి దొనకొండ రైల్వేస్టేషన్‌లో కోవిడ్ తర్వాత నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగటం లేదని, దానివల్ల మండలంలోని ప్రజలు ప్రయాణ సౌకర్యాల కోసం ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, వారి దృష్టికి బిజెపి నాయకులు తీసుకెళ్లడం జరిగింది. ఆమె వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తెలియజేసి కల్పించగా దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దొనకొండ మండల మాజీ బిజెపి అధ్యక్షులు గోర్ల వెంకట్రావు,బిజెపి నాయకులు బత్తుల శ్రీనివాసరావు, ఒబీసీ మోర్చా అధ్యక్షులు దయ్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సాగు చేసిన పంటలకు పంటల భీమా చేయించుకోవాలి

**జె.పంగులూరు, జులై 9, ప్రభాతవార్త**



రైతులు సాగు చేసిన పంటలకు పంటల భీమా చేయించుకోవాలని తద్వారా పంట నష్టపరిహారంతో పాటు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, మందులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బా రెడ్డి తెలిపారు. మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు సాగు ధృవీకరణ పత్రం గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి వద్ద పొంది సి.ఎస్.సి. సెంటర్లలో నమోదు చేసుకోవాలన్నారు. తెలిపారు. వరి పంట కు ఎకరాకు 800 రూపాయలు, మిరప కి ఎకరాకు 1800 రూపాయలు, కంది, మినుము పంటలకు 400 రూపాయలు ప్రీమియం చెల్లించాలని, ప్రతి పంటకు వాతావరణ ఆధారిత బీమా ఎకరాకు 1900 రూపాయలు చెల్లించాలని తెలిపారు. బ్యాంకు నందు రుణాలు కలిగిన రైతులు బ్యాంకులో చెల్లించుకోవచ్చున్నారు. ఈ సంవత్సరం పొగాకు సాగు చేయవద్దని, నల్ల బర్లీ సాగు చేయరాదని ప్రభుత్వం ఆదేశాలనుసారం అవరాలు పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మీ ప్రియ, సర్పంచ్ కృష్ణారావు, నాయకులు పి.వేణు, ముక్కొండ సుబ్బారావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# 13న ఉచిత మెగా వైద్య శిబిరం

**బల్లికురవ, జులై 9, ప్రభాతవార్త**

ఈనెల 13వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నరసరావుపేట తేజ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. జనం నాడి తెలిసిన వైద్యునిగా పేరొందిన బాపట్ల రఘు ప్రసాద్, బొట్ల పార్వతి, బొట్ల రంగతేజ, కర్నాటి గ్రాఫిక్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరంలో వివిధ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ళ వ్యాధులు, నరాల వ్యాధులు అన్ని రకాల జ్వరాలు, టీబీ, ఆయాసం, ఆస్తమా, పక్షవాతం, రుమటాయిడ్, బీపీ, షుగర్, ఆర్థరైటిస్, గర్భిణీ స్త్రీలు, స్త్రీ సంబంధిత గర్భకోశ మొదలగు వ్యాధులను ఉచితంగా పరీక్షిస్తారు. ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్లు నిర్వహిస్తారు. శిబిరం ఏర్పాట్లను పరిశీలించేందుకు డాక్టర్ బాపట్ల రఘుప్రసాద్ స్వయంగా బుధవారం బల్లికురవ వచ్చారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మోటార్ బైక్‌ను ఢీ కొట్టిన తుఫాన్ వాహనం - వ్యక్తి మృతి

**కొరిశపాడు , జులై 9 ప్రభాతవార్త**



ముందు వెళ్తున్న మోటార్ బైక్ ను వెనుక నుండి వేగంగా వస్తున్న తుఫాన్ వాహనం ఢీకొనడంతో బైక్ వెనుక ఉన్న వ్యక్తి మృతి చందగా మోటార్ సైకిల్ లిస్ట్ స్వల్ప గాయాలతో బయటపడిన సంఘటన మేదరమెట్ల పోలీస్ స్టేషన్లో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో జరిగింది పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రేణింగవరం గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు తమ మోటర్ బైక్ పై మేదరమెట్ల నుంచి తమ స్వగ్రామానికి వెళ్తున్నారు. వీరిని వెనుక నుండి మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద అతివేగంగా నిరక్ష్యంగా తుఫాన్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ కొరివి సత్యానందం ఢీకొట్టాడు ఈ ప్రమాదంలో మోటార్ బైక్ వెనక కూర్చున్న మట్ట కొయ్య మోషే 37 సంవత్సరాలు ఘటనాస్థలిలోనే మరణించాడు బైక్ నీ నడుపుతున్న సంతోష్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి ప్రమాద వార్త తెలుసుకున్న మేదరమెట్ల ఎస్సై మొహమ్మద్ రఫీ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అద్దంకిలో మోటార్ వెహికల్ పర్మినెంట్ యూనిట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

**అద్దంకి ,జులై 9, ప్రభాతవార్త**



అద్దంకిలో రెండున్నర సంవత్సరం నుండి టెంపరరీగా కొనసాగుతున్న మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయమును పెర్మినెంట్ యూనిట్ ఆఫీస్‌గా చేయాలని,రవాణ శాఖమంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అద్దంకి పర్యటనలో భాగంగా ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సుల ప్రారంభ కార్యక్రమ అనంతరం మంత్రిని అద్దంకి పట్టణానికి చెందిన పలవురు కలిసి విజ్ఞప్తి చేశారు. రవాణమంత్రితోపాటు విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూడ వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అద్దంకి పట్టణ ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, అద్దంకి పట్టణ నియోజకవర్గ ప్రజల తరపున అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, వెలనాటి శ్రీనివాసరావు, ధూళిపాల సుబ్బారావు, కరి వేణు, ఆర్కే ట్రావెల్స్ రామకృష్ణ, దామా హనుమంతరావు, నాదెండ్ల సుబ్బారావు తదితరులు వున్నారు.

# ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుంది

**అద్దంకి , జులై 9, ప్రభాతవార్త**



అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుంది అని సహాయ వ్యవసాయ సంచాలకులు బి ఎఫ్రాయిము తెలిపారు.నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి లిస్ట్‌లో పేరు లేని వారు గ్రీవెన్స్‌లోనమోదు చేసుకునే అవకాశం ఈ నెల 13 వ తేదీ వరకు ఉన్నదని ,గ్రీవెన్స్ కొరకు తమ గ్రామ వ్యవసాయ సహాయకులు ను సంప్రదించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులు పంట సాగు ధృవీకరణ పత్రాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు కావలసిన వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తుందని, భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాల ప్రకారం ఎరువుల వాడకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష,వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రకాశం బాలికల పాఠశాలలో పేరెంట్స్ మీట్

**అద్దంకి , జులై 9, ప్రభాతవార్త**

పట్టణంలో ప్రకాశం బాలికల ఉన్నతపాఠశాలలో గురువారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధాయులు కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలనుండి 1గంట వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

# వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ

**అద్దంకి ,జులై 9, ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి 47వ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సింగరకొండలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, అరటిపండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతి హనుమంతరావు, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర యువజన విభాగ జాయింట్ సెక్రటరీ చందోలు రాజ్‌కుమార్, అద్దంకి నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులు టి.మురహరి యాదవ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు పరిమి ప్రసాద్, విద్యార్ధి విభాగ నియోజకవర్గ అధ్యక్షులు ప్రశాంత రెడ్డి, యూత్ విభాగ జిల్లా కార్యవర్గ సభ్యులు దేగల శ్రీనివాస్, యువజన నాయకులు మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

# బధిరుల ఆశ్రమ పాఠశాలలో పానెం జన్మదిన వేడుకలు

## - కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం

**అద్దంకి , జులై 9 ,ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి 47వ జన్మదిన కార్యక్రమాన్ని స్థానిక బదిరుల ఆశ్రమ పాఠశాలలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్‌ను కట్‌చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కాకాని రాధా కృష్ణమూర్తి, కోయి అంకరావు, గోరంట్ల శివాజీ, భువనేశ్వరి, గాయత్రి, బాలు, గుంజి కోటేశ్వరరావు, జబ్బార్, కన్నెబోయిన వీరయ్య, రాజా, రవి, గోలి రమణబాబు, అవిశన ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, యు.నాగేశ్వరరావు, నాయుడు, ఉడత్తు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**జె.పంగులూరు ,జులై 9, ప్రభాతవార్త**

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశము మండల ప్రజా పరిషత్ అభివృద్ధికి అధికారిని కె స్వరూరాణి బుధవారం తెలిపారు . గురువారం ఉదయం గం.10.30 ని.లకు జరరిగే సమావేశమునకు మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు మరియు అజెండా కు సంబందించిన సమాచారంతో ఇతర అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

# జరుగుమల్లి సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ

**జరుగుమల్లి, జులై 9, ప్రభాతవార్త**




దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుమల్లి మండలంలో ఘనంగా జరిగింది. తహశీల్దార్ కార్యాలయం దగ్గర నుండి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఎంపీడీఓ ఆఫీసు వద్ద కూడలిలో మానవహారం నిర్వహించిన నిరసన వ్యక్తం చేయటం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకులు వి.మోజెస్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్యాక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బెల్లం శేషమ్మ, కే.హేమలత, జి.సుభాషిణి, ప్రసన్నలక్ష్మి, ఆశాబి, వరమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరి, ధనలక్ష్మి, మాధురి, సీఐటీయు నాయకులు తన్నీరు సుబ్బారావు, జి.అంకయ్య, ఇత్తడి యేసు, కేవీ శేషయ్య, మాలకొండయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యకు కరణం ఘన నివాళి

**బల్లికురవ, జులై 9, ప్రభాతవార్త**



టొబాకో ట్రేడర్స్ ఇండియా డైరక్టర్ కామని రామయ్య దశదిన కర్మ సంద్భంగా బుధవారం చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. టంగుటూరులోని వారి నివాస గృహంలో రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట అద్దంకి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ అడుసుమల్లి కిషోర్‌బాబు, తదితరులు ఉన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయి

## - సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య

**సంతమాగులూరు ,జులై 9 ,ప్రభాతవార్త**




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని బాపట్ల జిల్లా సిఐటియు నాయకులు సిహెచ్ గంగయ్య విమర్శించారు. దేశ వ్యాపితంగా ట్రేడ్ యూనియన్లు ఇచ్చినపిలుపు మేరకు సంతమాగులూరు మండలంలో బుధవారం సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు విధులను బహిష్కరించి సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలం వద్ద, తాహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలు చేసి తాహసీల్దార్ కార్యాలయం నుండి గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ కేంద్రంలో అదికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలోని ట్రేడ్ యూనియన్లను కనుమరుగు చేసే కుట్రలు చేస్తుందన్నారు. అందుకు తందానా అంటూ ఎన్నికల ముందు కార్మికులు, కర్షకులు, అంగన్వాడీలు, అసంఘటిత కార్మికులకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకుని అదికార పీఠం ఎక్కిన కూటమి ప్రభుత్వం తందానా అంటూ గంగిరెద్దులా తలలు ఊపుతుందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల హామీ మేరకు అంగన్వాడీలకు కనీస వేతనం గా నెలకు రు.26 వేలు చెల్లించాలని కార్మిక చట్టాలలో మార్పులు తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అంగన్ వాడి లు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్యకర్తలు, ఐసిడిఎస్ కార్యాలయం ముందు మరియు తహసిల్దార్ కార్యాలయం ముందు తమ నిరసనను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, విజయ్ కుమార్, ఏఐటీయుసీ నాయకులు షేక్ ఖాదర్ భాష, మేకల రమణయ్య, చీదర్ల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పానెం చిన్న హనిమిరెడ్డి జన్మదిన వేడుకలు

**సంతమాగులూరు జులై 9, ప్రభాతవార్త**



అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామంలో ఘనంగా జరిపారు. ఎంపీటీసీ మేకల నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్ద హనిమిరెడ్డి జన్మదిన కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మండల వైస్సార్సీపీ కన్వీనర్ వూట్ల నాగేశ్వరావు , యర్రంరెడ్డి బ్రహ్మారెడ్డి,బండి కోటిరెడ్డి, నన్నెబొయిన సురేంద్రబాబు మండలంలోని అన్ని గ్రామాల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**కొమ్మాలపాడులో...**

అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామం నందు అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్ఛార్జ్ పానెం చిన్న హనిమి రెడ్డి గారి 47వ జన్మదినం జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలు కేరింతల మద్య వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంతమాగులూరు మండలం వైఎస్ఆర్సిపి కన్వీనర్ ఊట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు మరియు స్థానిక నాయకులు కొప్టాల అబ్దుల్ రెహ్మాన్ , హోటల్ బుజ్జి ,బొప్పిడి బుజ్జి ,వైయకంటి సైదా, ఇనిమళ్ళ మదారోలి , వయకంటి మస్తాన్ వలి , మరియు మక్కెన వారి పాలెం వైఎస్ఆర్సిపి యూత్ అమర్ మేరీ బాబు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# లేబర్ కోడ్ అమలు ప్రయత్నం ఉపసంహరించుకోవాలి

## - కార్మిక సంఘాల డిమాండ్

**మార్కాపురం, జులై 9, ప్రభాతవార్త**



కార్మిక హక్కులను అణగదొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు పరిచే ప్రయత్నం చేస్తుంది,ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోకుంటే కార్మిక లోకం సహించదని ఏఐటీయుసీ, సీఐటీయు కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. బుధవారం కార్మిక వ్యతిరేక చట్టాల అమలుపై నిరసిస్తూ సమాన పనినికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యావత్ కార్మిక లోకం చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయు, ఏఐటీయుసీ నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్ అమలు కారణంగా కార్మికులు చేసేఅధికారాన్ని కోల్పోతారని కార్మికుల ఉద్యోగ భద్రత గాలిలో దీపంలా మారుతుందని అన్నారు. కార్మికుల సామాజిక భద్రత కోడ్ వలన సండే గిద్ద కార్మికులు రక్షణను కోల్పోతారని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్మికులకు రక్షణ లేకుండా చూస్తుందిన కార్మికుల వాస్తవ స్థితిగతులు కుటుంబ పోషణ విషయంలో ఏ ప్రభుత్వం కూడా ప్రత్యక్షంగా చూసి ఆదుకునే పరిస్థితి లేకుండా పోవడంతో దినదిన దండంగా కార్మికులు జీవనం సాగించాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో టీడీపీ లేబర్ కోడ్‌ను అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తుందని యావత్ కార్మిక లోపం ఈ ప్రయత్నాన్ని ఖండిస్తుందని అన్నారు. కార్మికుల బాగోగులను చూస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను సింగల్ లోకి కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న హత్యలు కాల రాసేదిశగా మోదీ ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వాలు చేస్తున్నాయని, ఈ ప్రయత్నాలను అన్ని కార్మిక ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించడం జరుగుతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల సార్వత్రిక సండే ఎందుకు ఉద్యోగ కార్మిక సంఘాలు సంఘటితం కావడం ఐక్యత ఏటిదో ప్రభుత్వాలకు తెలియాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ కాశీం సాహెబ్, అందే నాసరయ్య, పెద్దన్న, కాశీంమయ్య, సీపీఎం నాయకులు, డీకేఎం రఫీ, దుగ్గపాటి సోమయ్య, రాజు, రూబెన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**పోస్టల్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన :**

మార్కాపురం డివిజన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో దేశ వ్యాప్త కార్మిక సంఘాలు భాగంగా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ధ్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

# పర్చూరు అగ్రస్థానమే ప్రగతి విజన్ 2047 లక్ష్యం - ఎమ్మెల్యే

**మార్టూరు, జులై 9, ప్రభాతవార్త**




అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపటమే పర్చూరు ప్రగతి విజన్ 2047 లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పీ 4 పర్చూరు ప్రగతి విజన్‌పై వివిధ శాఖల అధికారులతో వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో అందరికి ఆరోగ్యం, ఉద్యోగ, ఉపాధి,మహిళల ఆర్థిక అభివృద్ధి, రైతుల ఆదాయాన్ని పెంచుతూ సంపద, సంతోషం లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర -2047 విజన్‌తో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో స్వర్ణాంధ్ర విజన్ కు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు ఏడాది పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. పేదరికాన్ని పారద్రోలేందుకు పీ4 అమలు చేస్తున్నామన్నారు. పారిశ్రామిక పార్కు, సాగునీరు, మత్స్య పరిశ్రమ, వ్యవసాయ రంగాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. 2047 నాటికి పర్చూరును అన్ని రంగాలలో ఆత్మనిర్భరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గుంటూరులో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్‌ని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవశాలు కల్పిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు విజన్ 2020 పెట్టినప్పుడు కూడా అందరూ అవహేళనగా మాట్లాడారు. కాని హైదరాబాద్ ఎంత డవలప్ అయిందో ఇప్పుడు చూశాము, మళ్లీ ఇప్పుడు స్వర్ణాంధ్ర విజన్ 2047 అని మన ముందుకు వచ్చారు. ఇది కూడా సక్సెస్ అవుతుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ పొగాకు రైతుల సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే కృషి మరువలేనిదన్నారు. పర్చూరు పొగాకు రైతుల సమస్యను పరిష్కరించి పొగాకు కొనుగోలు చేయటంలో సఫలీకృతం అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ కరుణశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, ఆరు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓ ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల చట్టాలకు తూట్లు పొడుస్తున్న బీజేపీ

**కురిచేడు, జులై 9, ప్రభాతవార్త**




కార్మికుల చట్టాలకు తూట్లు పొడుస్తూ వారి యొక్క హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య అన్నారు. భారత సార్వత్రిక సమ్మె సందర్భంగా కురిచేడులో డీవైఎఫ్ఐ, సీఐటీయు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ క్రమంలో పంచాయతీ కార్యాలయం నుంచి నినాదాలతో మండల రెవెన్యూకార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు పోరాడి తెచ్చుకున్న 29 రకాల చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు పంచాయతీ క్లాప్ మిత్రలకు, వీఓఏలకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు అశోక్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు స్వచ్ఛ భారత్ కార్మికులు, వీఓఏలు, ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

7_7.qxd 7/10/2025 12:09 AM Page 1



## కార్మికులకు వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి



**గిద్దలూరు, జూలై 9, ప్రభాతవార్త**
కార్మిక చట్టాలను, హక్కులను కాలరాసే నాలుగు కార్మిక కోడ్స్ వెంటనే రద్దు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి బాలకోటయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నిరసన ర్యాలీని పట్టణంలోని స్థానిక తహశిల్దార్ కార్యాలయం నుండి కుమ్మరాంకట్ట సెంటర్, పెద్ద బజార్, పొట్టి శ్రీరాములు విగ్రహము, వైఎస్సార్ సెంటర్ మీదుగా గిద్దలూరు తహశిల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి బాలకోటయ్య మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సంపాదించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడం ఆయన వ్యతిరేకించారు. యాజమాన్యాలకు సంపద సృష్టించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని గంటలను 8 నుండి 10 గంటలకు పెంపుకు పూనుకుందని ఆయన విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్ వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్, ఐకెపి, విఓఎ, ఆర్‌పి, స్కూల్ శానిటేషన్, కార్మికుల చాలీ చాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని సాగిస్తున్నారని వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం చట్టాన్ని అమలు చేయాలని, స్కీం వర్కర్లందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని ఆయన డిమాడ్ చేశారు. స్వాతంత్ర కాలం నుండి జాతి సంపదగా ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో కార్పోరేటర్లకు కట్టబెట్టే విధానం మానుకోవాలని అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ యూనియన్ నాయకులు డి స్వర్ణ, మున్నా, ఆశ వర్కర్లు, యూనియన్ నాయకులు జి విశ్రాంతమ్మ, షేక్ నూర్జహాన్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎం మురళి, ముఠా కార్మిక సంఘం నాయకులు పి శ్రీను, విఓఎ సంఘం నాయకులు ఆదిలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నాయకురాలు ఏ కుమారి, ఎన్ లక్ష్మీదేవీ, మెహ్మా, ఆర్‌పి యూనియన్ నాయకురాలు, పి సాయిలక్ష్మీ, డి రూతమ్మ, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు మేరీ, షేక్ సమీరా, సిఐటియు నాయకులు బి నరసింహులు, బి పూర్ణ, టి ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి అదృశ్యంపై ముమ్మర దర్యాప్తు

### - బిడ్డ ఆచూకీ కోసం తల్లి ఎదురు చూపు



**కంభం, జూలై 9, ప్రభాతవార్త**
కంభం మండలం లింగోజీపల్లిలో మంగళవారం అంగన్ వాడీ కేంద్రానికి వెళ్ళి వచ్చే క్రమంలో అదృశ్యమైన బాలుడి ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. గ్రామ పరిసర ప్రాంతాలను ఇప్పటికే డ్రోన్ సహాయంతో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. బంధువులను గ్రామప్రజలను సిఐ మల్లిఖార్జున, ఎస్సై నరసింహారావు ప్రశ్నిస్తూ ఆరా తీశారు. మార్కాపురం డిఎస్పి యు నాగరాజు 10 బృందాలతో బాలుడి కోసం జల్లెడ పడుతున్నారు. చిన్నారి తప్పిపోయాడా లేదా ఎవరైనా కిడ్నాప్ చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే తన బిడ్డ నిన్నటి నుంచి కనపడడం లేదని ఏమయ్యాడో తెలియక తల్లి సురేఖ రోధిస్తున్న తీరు చూపరులను కలచివేస్తోంది. బాబు క్షేమంగా తిరగి రావాలని కోరకుందాం. ఎవరైనా బాలుడిని గుర్తిస్తే 9121102184నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలియజేశారు.

## బేస్తవారిపేటలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె




**బేస్తవారిపేట, జూలై 9 ,ప్రభాతవార్త**
దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం బేస్తవారిపేట పట్టణంలో సిఐటియు, ఏఐటియుసి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బేస్తవారిపేట పంచాయితీ కార్యాలయం, తహశిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిరసన కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు తోట తిరుపతి రావు మాట్లాడుతూ బిజెపి మోడీ ప్రభుత్వం బ్రిటీష్ కాలం నుండి ఎన్నో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకురావడం చాలా దుర్మార్గమన్నారు. దీని వలన కార్మికుల హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. యూనియన్ పెట్టుకునే హక్కు, భేరసారాడే హక్కు, సమ్మె చేసే హక్కు, కార్మికులు కోల్పోతారని అన్నారు. ఇది ఒకరకంగా కార్మిక వర్గంపై దాడిగా అభివర్ణించారు. అలాగే దశలో అసంఘటిత కార్మికులు కోట్లాది మంది ఉన్నారు. వారికి కనీసం ఒక సమగ్ర చట్టం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఉండగా ఎక్కడ కూడా అమలు చేయడం లేదన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు కార్పోరేట్లకు కట్టబెట్టడం వలన రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. రవాణా కార్మికులకు సంబంధించి జీఓ నెంబరు 21ను రద్దు చేయాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని, నూతన క్రిమినల్ కోడ్స్‌ను రద్దు చేయాలని విద్యా, వైద్యం రంగానికి నిధులు కేటాయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ఆబ్రహం కోకన్వీనర్ తిరుపతయ్య, ఏఐటియుసి నాయకులు ఊరు మార్చు జోసెఫ్ మరియు జకీనా, భూతపాటి అమృత రాజు, కొర్రపాటి య్యోబు, కొండెపోగు ప్రవీణ్, వేపూరి సుబ్బరాయుడు, కె రాజేశ్వరి, సరళ దేవి, భారతి, మంజులావతి కుమార్ జ్యోతి, జి పద్మ, డి రాజేశ్వరి, జె కేదారమ్మ, బి శేఖర్, ఆటో యూనియన్ అధ్యక్షులు సమ్మెదపోగు సుధాకర్, దమ్ము రంగనాథ్, మరియు మధ్యాహ్న భోజన కార్మికులు, పంచాయితీ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆటో ముఠా వివోఏలు, బిల్డింగ్ కార్మికులు తదితర యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## చిల్ల చెట్లు తొలగింపు



**తాళ్లూరు, జూలై 9, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పిచ్చిచెట్లు పెరిగి, చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండడంతో స్పందించిన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు వల్లభనేని సుబ్బయ్య జేసీబీతో చెట్లు, చెత్త తొలగింపజేశారు. విద్యార్థులు,ఉపాధ్యాయులు గొట్టిపాటి లక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఒక్కరైతుకు నష్టం వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది

### - జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ



**మద్దిపాడు, జూలై 9, ప్రభాతవార్త**
పొగాకు రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణ మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామంలో గల పొగాకు కొనుగోలు కేంద్రంను సందర్శించి, పొగాకు కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ రైతులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ఎన్ని క్వింటాళ్ల పొగాకు తెచ్చారు, పెద్మాల్ ప్రకారం కొనుగోలు చేస్తున్నారా, కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పొగాకు రైతులు తెచ్చిన పొగాకు బేళ్ల నిల్వలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, ఎంత స్టోరేజీ చేయవచ్చు, కొనుగోలు అనంతరం రైతులకు నగదు చెల్లింపు ఎలా ఉంటుంది తదితర వివరాలతో పాటు పొగాకు కొనుగోలు విధానాన్ని గురించి మార్క్‌ఫెడ్ అధికారులు నుండి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు 15 రోజుల నుండి గార్లపాడులోని కొనుగోలు కేంద్రంలో హెచ్‌డీ బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 110 మంది పొగాకు రైతుల వద్ద నుండి 3 కోట్ల రూపాయలు విలువ గల 360 మెట్రిక్ టన్నుల పొగాకును కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సీఎం యాప్‌లో పొగాకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్న తరువాత నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం రైతుల వద్ద నుండి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు ను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ నెల వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, పొగాకు రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రకారం గ్రేడింగ్ చేసుకుని బేళ్ళు తీసుకువస్తే మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పొగాకు రైతులకు మేలు చేకూరేలా పొగాకు కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మిప్రసన్న, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, మద్దిపాడు తహశీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గిద్దలూరు, జూలై 9, ప్రభాతవార్త**
అంబవరం సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్‌డిఎస్‌ఎస్ పనుల నిమిత్తం నేడు (గురువారం) మండలంలోని వెంగళరెడ్డిపల్లె, వెల్లుపల్లె, జయరాంపురం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ముండ్లపాడు ఏఈఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గృహ విద్యుత్ మరియు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## కార్మికుల హక్కులు కాలరాసే లేబర్‌కోడ్స్‌ను వెంటనే రద్దుచేయాలి



**రాచర్ల, జూలై 9 ,ప్రభాతవార్త**
కార్మికుల హక్కులు కాలరాసే లేబర్‌కోడ్స్ ను వెంటనే రద్దుచేయాలని సిఐటియు మండల కార్యదర్శి డి.తామస్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడం ఆయన వ్యతిరేకించారు. యాజమాన్యలకు సంపద సృష్టించాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని గంటలను 8 నుండి 10గంటలకు పెంపుకు పూనుకుందని ఆయన విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్ వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్, ఐకెపి, వివోఏ, ఆర్‌పి స్కూల్ శానిటేషన్ కార్మికుల చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని సాగిస్తున్నారని వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం చట్టాన్ని అమలు చేయాలని స్కీమ్ వర్కర్లందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని ఆయన అన్నారు. కార్మికుల న్యాయమైన కోర్కెలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించుకుంటే రాబోయే రోజులలో పెద్ద ఎత్తున సమ్మెలు కొనసాగుతాయని హెచ్చరించారు. అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మీ, వరలక్ష్మీ, స్కూల్ శానిటేషన్ వర్కర్స్, యూనియన్ నాయకులు లక్ష్మీదేవీ, కుమారి, ఆశవర్కర్లు, యూనియన్ నాయకులు సంతోషి కుమారి, రంగమ్మ, జోష్నా, స్వచ్ఛభారత్ కార్మిక సంఘం నాయకులు రాజమ్మ, గురవయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు అల్లం పద్మ, నాగలక్ష్మీ, సిఐటియు నాయకులు జి పాపయ్య, సంఘం నాయకులు టి కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

## సంజీవరాయుని పేటలో ఎక్సైజ్ అధికారుల దాడులు

### - 10 మద్యం సీసాలు స్వాధీనం



**గిద్దలూరు, జూలై 9, ప్రభాతవార్త**
మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలో గిద్దలూరు ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు జరపారు. ఈ దాడులలో అక్రమ మద్యం కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 10 మద్యం సీసాలను స్వాదీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం జయరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమ మద్యం కలిగినా, విక్రయించినా చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీపతి వెంకటేశ్వర్లు, హరిబాబు, శంకర్, అషదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తాపడి ఒకరు మృతి, ఇరువురికి తీవ్రగాయాలు



**అర్ధవీడు, జూలై 9 ,ప్రభాతవార్త**
ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా ఇరువురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని మిట్టమీదిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. మిట్టమీదిపల్లె గ్రామ సమీపంలో అడవి పందులు అడ్డుగా రావడంతో ఆటో బోల్తాపడి తిరుపతయ్య అనే వ్యక్తి మృతిచెందాడు. మరో ఇరువురికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను మొదట కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువురి క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందినట్లు తెలిసింది. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇరువురు పేకాటరాయుళ్ళు అరెస్ట్

**రాచర్ల, జూలై 9, ప్రభాతవార్త**
మండలంలోని రంగారెడ్డిపల్లె పొలాల్లో పేకాట స్థావరంపై దాడి చేసి ఇరువురు పేకాట రాయుళ్ళను అరెస్టు చేసిన సంఘటన బుధవారం జరిగింది. రంగారెడ్డిపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు తమ సిబ్బందితో స్థావరంపై దాడి చేసి ఇరువురు పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో

### టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, జూలై 9, ప్రభాతవార్త**
సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనలో భాగంగా తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంవత్సర కాలంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టినటువంటి అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ముహరి నరసయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మండల రైతు అధ్యక్షులు కందుల వెంకట సుబ్బారెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, మురళి, సానికొమ్ము సుబ్బయ్య, నూనె నారాయణ, మాజీ సర్పంచ్ భాష, రవి, నాయబ్ ,ప్రతాపు, గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌లను సందర్శించిన ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి



**హనుమంతునిపాడు, జులై 9, ప్రభాతవార్త**
మండల పరిధిలోని హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గల 24వ పోలింగ్ బూత్‌ను అదే విధంగా కూటా గుండ్ల మండల ప్రాథమిక పాఠశాల యందు గల 15 వ పోలింగ్ బూతును కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి జి.కేశవర్ధన్‌రెడ్డి బుధవారం సందర్శించి సదరు పోలింగ్ బూత్‌ల నందు గల వసతులు అక్కడి బీఎల్‌ఓలతో సంప్రదించి అక్కడి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకొని కూటాగుండ్ల పోలింగ్ బూత్ నందు ఓటర్లు ఎక్కువగా ఉన్నందువలన అక్కడ మరొక పోలింగ్ ఏర్పాటు చేయుటకు గల అవకాశాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంట మండల తహశీల్దార్ ఎస్‌కే నాగూర్ మీరా, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకృష్ణ చైతన్య, ఎలక్షన్ ఆపరేటర్ వై.సైదులు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకయ్య ఆశ్రమంలో పొత్తూరి శివరావ్ వస్త్రాలు పంపిణీ, అన్నదానం



**మార్టూరు, జులై 9, ప్రభాతవార్త**
మార్టూరు కోరిగుంట్ల గవర్నమెంట్ హాస్పిటల్ పక్క రోడ్డు లోని వెంకయ్య ఆశ్రమంలో మార్టూరు వాస్తవ్యులు ప్రముఖ పారిశ్రామిక వేత్త ఓంకార్ మినరల్స్ యాజమాని పొత్తూరి శివరావ్, కుటుంబ సభ్యులు ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం, వస్త్రాల పంపిణీ చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పొత్తూరి శివరావ్ మాట్లాడుతూ ఆశ్రమానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు శివరాజేష్ - అంజనీ దంపతులకు వస్త్రములు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి శివరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆశ్రమ అధ్యక్షులు తన్నీరు శివరాజేష్, దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## మానవతామూర్తి రామయ్యకు ఘనంగా అశ్రునివాళులు



**టంగుటూరు టౌన్, జులై 9, ప్రభాతవార్త**
టంగుటూరుకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కామని విజయ్‌కుమార్ తండ్రి ప్రగతి టొబాకో ట్రేడర్స్ ఇండియా ప్రైవేటు లిమిటేడ్ డైరక్టర్ అయిన మానవత మూర్తి కామని రామయ్య దశదిన కర్మ సందర్భంగా బుధవారం టంగుటూరులోని కొండపి రోడ్డులో గల వారు పొగాకు కంపెనీలో బంధువులు, పొగాకు వ్యాపారస్తులు,ప్రజాప్రతినిధులు,ప్రజలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, రాష్ట్ర మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, రామయ్య కుమారులు కామని విజయకుమార్, కామని బాలమురళీమోహన్ కృష్ణ, రామయ్య భార్య శేషారత్నం, ప్రముఖ పొగాకు వ్యాపారస్తులు, దామచర్ల వెంకట కృష్ణారావు, దామచర్ల పూర్ణచంద్రరావు, ఐటీసీ, జీపీఐ పొగాకు కంపెనీల మేనేజర్‌లు, పొగాకు వ్యాపారస్తులు, పొగాకు బోర్డు అధికారులతో పాటు టంగుటూరుకు చెందిన పారిశ్రామిక వేత్త, మాజీ గ్రామ సర్పంచ్ బెల్లం జయంతిబాబు,మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్,టీడీపీపార్టీ సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, పి.బద్రిరెడ్డి,బెల్లం సత్యం, కృష్ణారెడ్డి, వారి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, ప్రజలు భారీగా తరలివచ్చి ఆయనకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## పంటల భీమాను సద్వినియోగం చేసుకోండి




**బల్లికురవ, జులై 9, ప్రభాతవార్త**
పత్తి ఐతులకు ప్రభుత్వం అందజేస్తున్న భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి పి.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కొమ్మినేని వారిపాలెం, వైదన గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం ఖరీఫ్ 2025 కు ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ పథకం కింద బాపట్ల జిల్లాకు పత్తి పంటను తీసుకోవడం జరిగింది. పత్తి పంటకు కట్టవలసిన ప్రీమియం ఎకరాకు రూ.1900 పంట నష్టం జరిగితే రైతులకు ఎకరాకు భీమా మొత్తం రూ.38000 వర్తిస్తుంది. అంతే కాకుండా ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం ద్వారా తుఫానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడం. వాతావరణ అంశాల ఆధారంగా సంబంధించిన పంట నష్టాన్ని అంచనా వేసి భీమా పరిహారం చెల్లించడం, వాస్తవ ప్రీమియంలో రైతు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని భీమా కంపెనీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నేరుగా చెల్లిస్తాయి. బాపట్ల జిల్లాలో ఎంపిక చేసిన పంటలు వరి, మిరప, మినుము, కంది, వరి, భీమా మొత్తం రూ.40వేలు, రైతు ప్రీమియం వాటా ఎకరాకు రూ.800లు గ్రామం యూనిట్, యూనిట్‌గా ఈ పథకం వర్తిస్తుంది. మిరప భీమా మొత్తం రూ.90వేలు వేలు, రైతు ప్రీమియం వాటా ఎకరాకు రూ.1800 మండలం యూనిట్‌గా ఈ పథకం వర్తిస్తుంది. మినుము, భీమా మొత్తం రూ.20వేలు, రైతు ప్రీమియం వాటా ఎకరాకు రూ.400లు జిల్లా యూనిట్‌గా ఈ పథకం వర్తిస్తుంది. కంది భీమా మొత్తం రూ.20వేలు రైతు ప్రీమియం వాటా ఎకరాకు రూ.400 జిల్లా యూనిట్‌గా ఈ పథకం వర్తిస్తుంది. ప్రీమియం చెల్లించుటకు చివరి తేదీ పత్తి పంటకు ఈనెల 15, మిరప, కంది, మినుము పంటలకు ఈనెల 31వ తేదీ, వరి పంటకు వచ్చే నెల 15వ తేదీ వరకు రైతులు ప్రీమియం చెల్లించవచ్చు. రైతులకు ఎలాంటి సందేహం ఉన్నా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మౌలాలి, వీఏఏలు రమణ, శ్రీకాంత్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ అధికారులకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ




**మార్కాపురం రూరల్, జూలై 9,ప్రభాతవార్త**
రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గము లలో భారత ఎన్నికల సంఘం -ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమాక్రసీ అండ్ మేనేజ్‌మెంట్ ఆదేశముల మేరకు బూత్ లెవెల్ అధికారులకు ఎనినయనకల జాబితా నిర్వహణ శిక్షణ కార్యక్రమములు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. 2025జూలై నెలలో బ్యాచ్‌కు 40మంది చొప్పున 9,10, 11వ తేదీలలో 3బ్యాచ్‌లకు మార్కాపురం మండలం నందు జరుగుతాయి. మొదటి బ్యాచ్ నందు పోలింగ్ స్టేషన్ నంబర్ 1నుండి 40వరకు బూత్ లెవెల్ అధికారులకు బుధవారం సబ్ కలెక్టర్ మరియు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మార్కాపురం వారి అద్యక్షతన శిక్షణా కార్యక్రమం స్థానిక తహశిల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులకు వారి వివరములు, ఆయా పోలింగ్ కేంద్రములలో నమోదైనవో లేవో సరిచూసుకోవాలని మరణించిన ఓటర్లను గుర్తించామని పోలింగ్ పరిధిలో ఉన్నటువంటి ఓటర్లందరూ అట్టి పోలింగ్ కేంద్రము జాబితాలోకి తప్పకుండా నమోదు చేసుకొని ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాను తయారు చేయమని మార్కాపురం మండల పరిధిలోని 109 పోలింగ్ కేంద్రములు కలవని, సదరు 109పోలింగ్ కేంద్రాలలో 14పోలింగ్ కేంద్రాలు, 1200మంది ఓటర్లపైగా ఉన్నందున సదరు పోలింగ్ కేంద్రాలను రెండు పోలింగ్ కేంద్రాలుగా విభజించడం జరుగుతుందని తెలిపారు. నూతనంగా ఏర్పడుచున్న పోలింగ్ కేంద్రాలకు నూతనముగా ప్రభుత్వ భవనములు గుర్తించవలసిందిగా ఆదేశాలు జారీ చేయడమైనది. ఈ శిక్షణ కేంద్రములో పాల్గొన్న బూత్ లెవల్ అధికారులకు వర్చ్యువల్ పరీక్ష నిర్వహించడమైనది. అలాగే సదరు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సబ్ కలెక్టర్ వెంకట్‌త్రివినాగ్ చేతుల మీదుగా పార్టిసిపేషన్ సర్టిఫికేట్ అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ చిరంజీవి, మున్సిపల్ కమీషనర్ డివిఎస్ నారాయణ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి శ్రీనివాసులు, డిప్యూటీ తహశిల్దార్ శ్రీనివాసులు, ఎలక్షన్ డిప్యూటీ తహశిల్దార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ కంపెనీలకు తొత్తుగా మారిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

### - సీఐటీయు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు



**సంతనూతలపాడు, జులై 9, ప్రభాతవార్త**
దేశ సంపదను కార్పొరేటు కంపెనీలకు దోచిపెట్టడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నాయని సీఐటీయు జిల్లా కార్యదర్శి బంకాసుబ్బారావు విమర్శించారు. కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్తసమ్మెలో భాగంగా సంతనూతలపాడు మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సీఐటీయు మండల కార్యదర్శి షేక్ మస్తాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బంకా సుబ్బారావు మాట్లాడుతూ అంబానీ, ఆదానీల లాంటి కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచి పెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయన్నారు. లేబర్ కోడ్ అమలు కారణంగా కార్మికులు చేసేఅధికారాన్ని కోల్పోతారని కార్మికుల ఉద్యోగ భద్రత గాలిలో దీపంలా మారుతుందని అన్నారు. కార్మికుల సామాజిక భద్రత కోడ్ వలన సండే గిద్ద కార్మికులు రక్షణను కోల్పోతారని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్మికులకు రక్షణ లేకుండా చూస్తుందిన కార్మికుల వాస్తవ స్థితిగతులు కుటుంబ పోషణ విషయంలో ఏ ప్రభుత్వం కూడా ప్రత్యక్షంగా చూసి ఆదుకునే పరిస్థితి లేకుండా పోవడంతో దినదిన దండంగా కార్మికులు జీవనం సాగించాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో టీడీపీ లేబర్ కోడ్‌ను అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తుందని యావత్ కార్మిక లోపం ఈ ప్రయత్నాన్ని ఖండిస్తుందని అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మద్దిపాడు ప్రాజెక్టుకార్యదర్శి ఎం.ధనలక్ష్మీ, అంగన్‌వాడీ నాయకులు ఎస్‌కే మీరాబి లక్ష్మీ, పద్మ, ఆశా వర్కర్లు సుభాషిణి, కృష్ణవేణి, సీఐటీయు నాయకులు ఎస్‌కే నాగూర్, డి.చిన్నబాబు, పి.శ్రీమన్నారాయణ, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వి నరసింహం, హనుమంతరావు, ఈదర సుబ్బారావు, శేషారావు, నెరుసుల మాలతి తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన



**సంతనూతలపాడు, జులై 9, ప్రభాతవార్త**
జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద గల రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ నందు మహిళా విద్యార్థులకు సైబర్ క్రైమ్ మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎస్సై అజయ్‌బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ మహిళలు వారి భద్రతకు తప్పనిసరిగా శక్తి యాప్‌ని అదే విధంగా డయల్ 100 ఉపయోగించుకుని పోలీసు వారి సేవలను పొందాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌గురించి తెలియజేశారు. ఏదైనా సైబర్ నేరం జరిగిందని తెలిస్తే వెంటనే డయల్ 1930 ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అజయ్‌బాబు,కళాశాల ఏవో ఎన్.చంద్రశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సౌమ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన

### ఒంగోలు డివిజన్ నూతన ఇన్‌ఛార్జ్ డీఎల్‌డీఓ సురేష్‌బాబు



**సంతనూతలపాడు, జులై 9, ప్రభాతవార్త**
ఒంగోలు డివిజన్ డీఎల్‌డీఓ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన తదుపరి డి.సురేష్‌బాబు ఒంగోలు కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.ప్రస్తుతం సంతనూతలపాడు ఎంపీడీఓగా డి.సురేష్‌బాబు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సంతనూతలపాడు మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, ఆదేశాల మేరకు డి.సురేష్‌బాబు, ఒంగోలు డివిజన్ ఇన్‌ఛార్జ్ డవలప్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. తదుపరి జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గోపాలకృష్ణను ఆయన కలిశారు. ప్రస్తుతం సంతనూతలపాడు ఎంపీడీఓగా పని చేస్తున్న డి.సురేష్‌బాబు ను జిల్లా అధికారులు ఒంగోలు డివిజన్ డీఎల్‌డీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రాలు ఆవిష్కరణ



**కొనకనమిట్ల, జులై 9, ప్రభాతవార్త**
ఒంగోలులో ఆగష్టు 20 నుంచి 25వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో సీపీఐ నాయకులు బుధవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంల సీపీఐ మండల కార్యదర్శి కే.కోటేశ్వరరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి పీవీ కొండయ్య, నాయకులు శిగినం వెంకటేశ్వర్లు, సీహెచ్ పెద్ద శిద్దయ్య, టి.శ్రీను, పి.కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిస్తాం

### - ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ డిమాండ్



**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
కార్మికుల హక్కుల, రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించి పాలకులకు తమదైన శైలిలో గునపాఠం చెబుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయకుండా తక్షణమే నిలుపుదల చేయాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోదీ కార్మికుల నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తే కార్మికుల హక్కులు, రక్షణ కరుమరుగవుతాయని అన్నారు. లేబర్ కోడ్ అమలు కారణంగా కార్మికులు చేసేఅధికారాన్ని కోల్పోతారని కార్మికుల ఉద్యోగ భద్రత గాలిలోదీపంలా మారుతుందని అన్నారు. కార్మికుల సామాజిక భద్రత కోడ్ వలన సండే గిద్ద కార్మికులు రక్షణను కోల్పోతారని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కార్మికులకు రక్షణ లేకుండా చూస్తుందిన కార్మికుల వాస్తవ స్థితిగతులు కుటుంబ పోషణ విషయంలో ఏ ప్రభుత్వం కూడా ప్రత్యక్షంగా చూసి ఆదుకునే పరిస్థితి లేకుండా పోవడంతో దినదిన దండంగా కార్మికులు జీవనం సాగించాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో టీడీపీ లేబర్ కోడ్‌ను అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తుందని యావత్ కార్మిక లోపం ఈ ప్రయత్నాన్ని ఖండిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ యాసిన్, సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు,డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, మండల సహాయ కార్యదర్శి గులామ్ హుస్సేన్,సంఘ నాయకులు పుట్టా సుబ్బారావు,ఖాదర్‌భాషా,ఎస్‌కే తాహిద్, సయ్యద్ ఇఫ్రాజ్, గణేష్, స్కూల్ ఆయా వర్కర్స్ యూనియన్ నాయకులు దాసరి సునీత, కార్మికులు పాల్గొన్నారు.

## అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు - సీఐ షేక్ ఖాజావలి



**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయిక చేరుకోవాలని సీఐ షేక్ ఖాజవలి అన్నారు. బుధవారం మండలంలోని కనిగిరిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకుందాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా దూరంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణ అలవరుచుకోవాలని, మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఫోన్ యాప్‌ల వినియోగం, మత్తు పదార్థాలతో కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఎస్సై శ్రీరామ్ మాట్లాడుతూ పిన్న వయస్సులో వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అలాంటి చర్యలకు విద్యార్థులకు పాల్పడవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సైబర్ క్రైమ్ లపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, ఇతర సమాచారం అడిగితే చెప్పకూడదన్నారు.

## మహిళలకు ర్యాంపు పథకంపై అవగాహన



**కనిగిరి, జులై9, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలో బుధవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ర్యాంప్ పథకం ద్వారా పరిశ్రమలు స్థాపించాలనుకునే ఔత్సాహికులకు అవశ్యకమైన అనుమతలు, ప్రభుత్వ సబ్సిడీలు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బుధవారం కనిగిరిలో స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు చిన్న పాటి పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల కేంద్రం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రోత్సాహక అధికారి గోగినేని థామ్సన్, సుల్తాన్, ముఖ్య అతిధులుగా హాజరై మట్లాడారు.

## కొత్తూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ నరసింహారెడ్డి ఆదేశాలతో కనిగిరి మున్సిపాలిటీ కొత్తూరులో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సారథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, సంక్షేమం అభివృద్ధి దిశగా రాష్ట్రం ప్రయాణిస్తుందని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని సురేంద్ర, అచ్చాల రవి, ప్రసాద్, రామకృష్ణ, కిరణ్, శ్రీకాంత్, బాలాజీ, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని కలిసిన కొత్తూరు టీడీపీ నాయకులు



**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపల్ కమీషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన పిల్లి కృష్ణమోహన్‌రెడ్డిని ఏడో వార్డు కొత్తూరు టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొత్తూరు ఏడో వార్డులో ఉన్న మౌలిక వసతులపై కాసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని సురేంద్ర, అచ్చాల రవి, ప్రసాద్, రామకృష్ణ, కిరణ్, శ్రీకాంత్, బాలాజీ, శ్రీను, పాల్గొన్నారు.

## జనసేనలోకి ఆర్యవైశ్య ప్రముఖులు

### - పవన్ నాయకత్వం పట్ల మద్దతు



**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
ప్రముఖ ఆర్యవైశ్య నేతలు బుధవారం జనసేనలో చేరారు. చార్టెర్డ్ అకౌంటెంట్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు పెనుగొండ సుబ్బారాయుడు (విజయవాడ), జాతీయ వాసవి సత్ర సముదాయం అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు(కనిగిరి), కాశీ అన్నపూర్ణ చౌల్ట్రీస్ అధినేత భవనాసి శ్రీనివాస్(నంద్యాల) జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీ కండువాలు ధరించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అవినీతి రహిత పాలన పట్ల తమకు గాఢ విశ్వాసముందని, కుల మతాలకు అతీతంగా ప్రజల కోసం చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై జనసేనలో చేరుతున్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, ప్రజల పట్ల కలిగిన నిబద్ధత రాష్ట్ర బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని అభిప్రాయపడ్డారు. పార్టీ తరుపున జనసేన నేతలు వారిని హారతులతో కండువాలతో సాదరంగా స్వాగతించారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ధర్నా



**నాగులుప్పలపాడు, జులై 9, ప్రభాతవార్త**
బ్రిటీస్ కాలం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని వాటిని రద్దు చేయాలని కోరుతూ బుధవారం దేశ వ్యాప్తంగా కార్మిక కర్షక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయు ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో దర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి జి.బసవపున్నయ్య, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల అధ్యక్షులు ఎన్.రామారావు, కాకాని సుబ్బారావు, సొసైటీ సీఈఓ రమేష్, పంచాయతీ కార్మికులు, రైతులు, వివిద ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సొసైటీలకు త్రీమెన్ కమిటీ నియామకాలకు గ్రీన్ సిగ్నల్

**నాగులుప్పలపాడు, జులై 9, ప్రభాతవార్త**
వ్యవసాయ సహకార సంఘాలకు పదవీ కాలం ముగిసి దాదాపుగా సంవత్సర కాలం కావడంతో అప్పటి నుండి ఖాళీగా ఉన్న సహకార సంఘాలకు చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు మెంబర్లతో కూడిన త్రీమెన్ కమిటీ నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రకాశం జిల్లాలో 123 సహకార సంఘాలు కలవు. దాదాపుగా ఇప్పటికే సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీ నియామకాలకు ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు త్రిమెన్ కమిటీలు ఎంపిక పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. రానున్న ఒకటి రెండు రోజుల్లో ఆయా సాకార సంఘాలకు త్రీమెన్ కమిటీ చైర్మన్ రానున్నారు. ఇప్పటికే చైర్మన్ కమిటీలు ఏర్పాట్లు సహకార సంఘ అధికారులు నిమగ్నమై ఉన్నారు.

## ఒంగోలు వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్‌గా శివపురం వెంకటరావు

**నాగులుప్పలపాడు, జులై 9, ప్రభాతవార్త**
ఒంగోలు వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్‌గా శివపురం వెంకటరావు నియామకం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ ఖరారు చేయడంతో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీలకు కేటాయించారు. యాదవ కులానికి చెందిన శివపురం వెంకటరావు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ముఖ్య అనుచరులుగా ఉన్నారు. దీంతో కార్యకర్తలు, అభిమానులు ఓటు బ్యాంకు ఉన్న యాదవులకు పదవి కేటాయిస్తే బాగుంటుందని ఎమ్మెల్యేకి సూచించడంతో దాదాపు గా శివపురం వైపు దామచర్ల మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. దాదాపుగా శివపురం వెంకటరావు పేరు ఖరారైనట్లు వినికిడి.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన కదిరి బ్రదర్స్



**సీఎస్‌పురం, జులై 9, ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్ధసారధి, కోశాధికారి కదిరి బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు.

## మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే



**వెలిగండ్ల, జులై 9, ప్రభాతవార్త**
బుధవారం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మండలంలో పర్యటించారు. తొలుత మండలంలోని పీఎన్‌వరం గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు ముక్కు శ్రీనివాసరెడ్డి తండ్రి భౌతికకాయానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఇమ్మడి చెరువు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలువురు సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించబోనని హెచ్చరించారు. ఇమ్మడి చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మండలంలోని గన్నవరం గ్రామం సమీపంలో నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మండల టీడీపీ నాయకులు కొండు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెగా పీటీఎంను ఘనంగా నిర్వహించాలి



**సీఎస్‌పురం, జులై 9, ప్రభాతవార్త**
మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక వడ్డిపాలెం బొడల్ ప్రైమరీ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీచేశారు. మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం సంధ్భంగా పాఠశాలల వద్ద తల్లి పేరుతో విద్యార్థుల చేత 2411 మొక్కలను నాటిస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం కింద మండలంలోని3216 మంది విద్యార్థులకు రూ.4.18 కోట్ల మేర లబ్ది చేకూరినట్లు చెప్పారు. నూతనంగా ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల తల్లులకు కూడా ఈ పథకం కింద పదో తేదీన నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు .ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం ఖాదరున్నీసా బేగం, సీఆర్‌పీ సతీష్ పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత చేపట్టిన బీసీ ఉద్యమానికి ఏపీ ఉద్యమ యాదవ సంఘం మద్దతు



**పెద్దదోర్నాల, జులై 9, ప్రభాతవార్త**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టిన బీసీ ఉద్యమానికి మద్దతుగా ఏపీ ఉద్య యాదవ సంఘం మద్దతు ప్రకటించింది. జులై 17వ తేదీన తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమానికి ఉద్య సంఘం మద్దతు ప్రకటించింది. బీసీలకు చట్టసభల్లో విద్యా ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మెల్సీ కవిత చేపట్టిన ఉద్యమానికి తాము మద్దతు తెలుపుతున్నట్లు ఉద్య యాదవ సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ మేక లలతిత యాదవ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మా యల్లేష్ యాదవ్, నాయకులు బొల్లు నరసింహ యాదవ్, పృద్ధిరాజ్ యాదవ్, శేషగిరి యాదవ్, మర్రిబోయిన రామకృష్ణ, ప్రవీణ్ యాదవ్, కృష్ణ యాదవ్, బల్రాజ్ యాదవ్, లావణ్య యాదవ్, నర్మదా యాదవ్, పద్మ యాదవ్, లక్ష్మీ యాదవ్, అన్నపూర్ణ యాదవ్, వరలక్ష్మీ యాదవ్, ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవితను కలిసి మద్దతు ప్రకటించినట్లు పెద్దదోర్నాల మండల పరిషత్ అధ్యక్షురాలు భర్త గుమ్మా ఎల్లేసు యాదవ్ తెలిపారు.

## చిన్నారికట్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



**కొనకనమిట్ల, జులై 9, ప్రభాతవార్త**
మండలంలోని చిన్నారికట్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మండల టీడీపీ కన్వీనర్ మోరబోయిన బాబురావు, నాయకులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్‌కు డబ్బులు పడ్డాయా లేదని అడిగి తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కే.నాసరయ్య, మాజీ మండల టీడీపీ కన్వీనర్ వి.వెంకటరామిరెడ్డి, నాయకులు ఉడుముల లక్ష్మిరెడ్డి, పెరికె సుఖదేవ్, నీటి సంఘం అధ్యక్షులు దేవిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నాయకులు బరిగే బాలయ్య, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షణికావేశం వదిలి మానవత్వంతో మెలగండి

### - న్యాయమూర్తి ఎం.బాలాజీ



**మార్కాపురం, జులై 9, ప్రభాతవార్త**
జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మార్కాపురం ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.బాలాజీ బుధవారం సబ్‌జైల్‌ను సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులతో ఆయన ఖైదీలకు అవగాహన కల్పించారు. క్షణికావేశాన్ని వదిలి మానవత్వంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి కుంటలో పడి వ్యక్తి మృతి



**కురిచేడు, జులై 9, ప్రభాతవార్త**
ప్రమాదవశాత్తు వ్యవసాయ నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అలవలపాడు గ్రామ పొలాల్లో చోటు చేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు రావి రవి అనే రైతు పొలానికి పని నిమిత్తం అదే గ్రామానికి చెందిన రోశయ్య అనే వ్యక్తి కూలి పనికి వెళ్లాడు. వ్యవసాయ నీటి కుంట వద్ద పని చేస్తున్నాడు. అయితే రోశయ్యకు కొన్నేళ్ల నుంచే మూర్ఛ వ్యాధి ఉంది. అనుకోకుండా నీటి కుంట పక్కనే పని చేస్తున్న సమయంలో మూర్ఛ వచ్చి అందులో పడిపోయాడు.ఆ పక్కనే ఉన్నటువంటి వాళ్లు తీవ్రంగా ప్రయత్నించినప్పటికి మృతుడిని తీయలేకపోయారు. చివరకు చాలా సేపటి తరువాత తీసేసరికి రోశయ్య(38) మృతి చెంది ఉన్నాడు. మృతునికి ముగ్గురు పిల్లలు, భార్య ఉంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## ఏఐటీయుసీ ఆధ్వర్యంలో దర్శిలో సమ్మె




**దర్శి ,జులై 9, ప్రభాతవార్త**
కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయుసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే.హనుమంతరావు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా దర్శిలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు పోరాడి తెచ్చుకున్న 29 రకాల చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కరుణానిధి, సంఘ నాయకులు సింగరకొండ శ్రీను, విజయ్, నూరిబాబు, కల్లూరి పెద్ద ఆంజనేయులు, ఇత్తడి ఇర్మియ, శ్రీకాంత్, దావీదు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సాయిబాబా పూర్ణాహుతి





**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
స్థానిక సాయిబాబా దేవస్థానంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అఖండ సాయి నామ సప్తాహము, గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలతో హోమాలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు, భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు, ఓబుల్‌రెడ్డి, కోశాధికారి ముచ్చర్ల ధర్మారావు, సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, బీవీ నారాయణ, సంయుక్త కార్యదర్శి కొలిపర్తి మారుతి కుమార్, సంయుక్త కోశాధికారి వాగిచెర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సింగరాజు మాలకొండేశ్వరరావు, వీసీ రామశాస్త్రి, మండ్లా వెంకటేశ్వర్లు, మునగా ప్రసాద్, తంగుటూరి గోవిందరావు, ఏసీ చెంచులు తదితరులు పాల్గొన్నారు.

## జులై 17న కారంచేడు నర మేధ స్మారక సభలు నిర్వహించండి

### - 40 ఏళ్ల దళిత ఉద్యమాన్ని స్మరించుకుందాం రండి

### - దళిత నేత నీలం నాగేంద్ర విజ్ఞప్తి



**చీరాల, జులై 9, ప్రభాతవార్త**
జులై 17న భారతదేశ దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాట పోలికకే కారంచేడు స్మారక సభలు నిర్వహించాలని దళిత బహుజనులకు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నాగేంద్రరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం చీరాల దళిత మహాసభ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నీలం నాగేంద్ర మాట్లాడుతూ 1985 జులై 17న కారంచేడు మాదిగలపై అగ్రకుల భూస్వాములు జరిపిన మారణకాండ జులై 17వ తేదీతో 40 ఏళ్లు అన్నారు. భారతదేశంలో కారంచేడు లాంటి ఘటనలు బీహార్, తమిళనాడు ఇతర రాష్ట్రాలలో చాలా జరిగిన ఆ ఘటనలు ఉద్యమ రూపంగా మారలేదన్నారు. ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వియ్యంకుడైన దుగ్గుబాటి చెంచు రామయ్య స్వగ్రామంలో జరిగిన మాదిగల ఊచకోత సంచలనం రేపిందన్నారు. అప్పటి వరకు హేతువాద ఉద్యమ నాయకుడిగా ఉన్న కత్తి పద్మారావు, పౌర హక్కుల ఉద్యమ నాయకుడిగా ఉన్న బొజ్జ తారకం కారంచేడు మాదిగల మారణకాండపై స్పందించి దళిత ఉద్యమాన్ని నడిపించి నాయకత్వం వహించారన్నారు. దేశంలో దళితుల జీవన స్థితిగతులను మార్చివేసి ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాల ప్రతిరూపం అయిన కారంచేడు దళిత ఉద్యమం సందర్భంగా గ్రామ గ్రామాన స్మారక సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈనెల 17న విజయనగర కాలనీలో జరిపే కారంచేడు 40 ఏళ్ల కార్యక్రమాలను జయప్రదం చేయాలని దళిత బహుజన నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు జులియన్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కాకుమాను రవికుమార్, గోగులమూడి, రంజిత్, ఎర్రమల శ్రీను, గోశాల అశోక్, గొర్రెముచ్చు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

### - దర్శిలో కార్మికుల సమ్మె ర్యాలీ - ఉద్యమ హక్కుల సాధన కోసం సమ్మె

### - సీఐటీయు జిల్లా నాయకులు తాండవ రంగారావు



**దర్శి, జులై 9, ప్రభాతవార్త**
మోడీ ప్రభుత్వంపై కార్మికుల హక్కుల కోసం సమ్మె చేస్తున్నారని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు అన్నారు. దర్శిలో సీఐటీయు ఆఫీసు నుంచి సమ్మె ప్రదర్శన ఎర్ర జెండాలతో కార్మికుల నినాదాలతో ఉత్సాహంగా ప్రారంభించి పొదిలి రోడ్డు, కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డులలో కార్మికుల ప్రదర్శన నిర్వహించి గడియారస్తంభం సెంటర్లో సభ షేక్ భాషా అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రంగారావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కార్మిక, ఉద్యోగులు పోరాడి తెచ్చుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేస్తున్నారని, కార్మికులకు సంఘాల రిజిస్ట్రేషన్ హక్కు,సమ్మె హక్కు, వేతనాలుచట్టం రద్దు అవుతాయని, ధరలు తగ్గించాలని, అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ క్లాప్ మిత్రాలకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పేద, మధ్య తరగతి ఉద్యోగ, కార్మికులపై భారాలు వేస్తూ మరో వైపు కార్పొరేట్ శక్తులకు మోడీ అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాలలో 16 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకు రుణాలు రద్దు చేశారని విమర్శించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు దర్శి అధ్యక్ష, కార్యదర్శులు భాషా, ఉప్పు నారాయణ, గర్నెపూడి జాన్ సామ్యేల్,గోగు వెంకయ్య,అంగన్‌వాడీ, ఆశా క్లాప్ మిత్ర నాయకులు, ఎల్ఐసీ, సివిల్ సప్లై నాయకులు, జయమ్మ, తిరుపమ్మ, సుశీల, మాధవిలత, లక్ష్మీ, ఆలూరి ఇస్రాయిల్, పోరుమామిళ్ళ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, అంజిబాబు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి రూ.20వేలు అందజేసిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



**దర్శి , జులై 9, ప్రభాతవార్త**
దర్శిలోని మొహరం పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం ఇచ్చే అన్నదానం కొరకు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుమారుడు శిద్దా సుధీర్ కుమార్ ఆదేశాల మేరకు ముస్లిం సోదరులకు శిద్దా ప్రతినిధి మండాది సుబ్బారావు ఈ సంవత్సరం కూడా బుధవారం ముస్లిం సోదరులకు రూ.20వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకి, యువ నాయకులు పారిశ్రామిక వేత్త, యువ నాయకులు శిద్దా సుధీర్‌బాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా కార్యాలయ ప్రతినిధి మండాది సుబ్బారావు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఉల్లగల్లులో సుపరిపాలన కార్యక్రమం

### - మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు



**ముండ్లమూరు, జులై 9, ప్రభాతవార్త**
మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో తెలుగుదేశం పార్టీ టీడీపీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏ పథకాలు ప్రజలకు ఇచ్చింది, భవిష్యత్తులో ఏ పథకాలు అమలు చేస్తారో తెలియజేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూరపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని కూటమి ప్రభుత్వంతోనే పేద ప్రజలు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వరగాని పౌలు, టీడీపీ నాయకులు జిల్లెలమూడి చౌదరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇమ్మడి కాశీనాథ్‌ను ఘనంగా సన్మానించిన వీరనారిమణులు




**మార్కాపురం, జులై 9, ప్రభాతవార్త**
పట్టణంలో ఈనెల 4వ తేదీన జరిగిన రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేసిన నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ ఇమ్మిడి కాశీనాథ్‌ను మార్కాపురం నియోజకవర్గ కాపునాడు అధ్యక్షురాలు సిద్దం కృష్ణవేణి ఆధ్వర్యం లో జనసేన పార్టీ వీర నారిమణులు బుధవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరెన్నో మంచి కార్యక్రమాలు చేపట్టి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ పర్యటనను ఎలాంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా ముగిసిందని సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సామ్యేల్ జార్జి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సునీత, న్యాయవాది నంద్యాల సుజాత, సిద్దం లక్ష్మీ గీత, నియోజకవర్గ జనసేన నాయకులు కాశీరామ్ సింగ్, నరసింహులు, తర్లుపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

10-7Pg5.qxd:10-7Pg5.qxd  01/01/01  7:34 AM  Page 1



# భారత్‌పై చైనా 'వాటర్ బాంబ్'!




## బ్రహ్మపుత్ర నదీజలాలపై భారీ డ్యామ్ నిర్మాణం

**ఇటానగర్,జూలై 9:** భారత్‌తో సరిహద్దులో ప్రపంచంలోనే అతిపెద్ద జల విద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దీన్ని చైనా వాటర్ బాంబ్‌గా ఉపయోగించే అవకాశం ఉందని అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ వ్యాఖ్యానించారు. చైనా మిలటరీ కంటే ఈ డ్యాంతోనే అతిపెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా వ్యూహాలకు దీటుగా భారత్ కూడా పలుచర్యలు తీసుకుంటోంది. భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ డ్యాంను చైనా నిర్మిస్తోంది. దీనికి యార్లుంగ్ త్సాంగ్పో ఆనకట్టగా పేరపెట్టింది. టిబెట్‌లో యార్లంగ్ సాంగ్పో నదిగా ప్రసిద్ధమైన బ్రహ్మపుత్ర నదిపై ఈ జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి 2024లో చైనా సర్కారు ఆమోదం తెలిపింది. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ఐదేళ్లలో దీన్ని నిర్మించాలని డ్రాగన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 60 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. బ్రహ్మపుత్రనది భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే ప్రదేశంలో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు సాయంతో చైనా బ్రహ్మపుత్ర నదిలో జలప్రవాహాన్ని నియంత్రించగలదు. భారీ మోతాదులో వరద నీటిని భారత భూభాగంపైకి వదిలి విధ్వంసం సృష్టించగలదు. అందుకే దీన్ని వాటర్ బాంబ్‌గా అరుణాచల్‌ప్రదేశ్ సిఎం పెమా ఖండూ అభివర్ణించారు.

చైనా మిలటరీ కంటే ఈ ఆనకట్టే భారత్‌కు అత్యంత ప్రమాదకరమని పెమాఖండూ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేసి ఉంటే ఈ డ్యాం వల్ల భారత్‌కు పెద్దగా సమస్య వచ్చేదికాదని పెమా ఖండూ తెలిపారు. ఎందుకంటే ఆ ఒప్పందం ప్రకారం బ్రహ్మపుత్ర జలాలను కొంతమేర తప్పనిసరిగా కిందకు వదలాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ జల ఒప్పందంపై చైనా సంతకం చేయనందున వేసవికాలంలో బ్రహ్మపుత్ర జలాలను భారత్‌లోకి రాకుండా చైనా మళ్లించే అవకాశం ఉందన్నారు. తద్వారా అసోం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. వర్షాకాలంలో బ్రహ్మపుత్ర నదికి భారీగా వరద ఉంటుంది. ఒకేసారి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేస్తే దిగువనున్న ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. చైనా ఎప్పుడు ఏం చేస్తుందో ఎవరికీ తెలియదు. ఆనకట్ట నిర్మించి వారు అకస్మాత్తుగా నీటిని విడుదల చేస్తే, మన మొత్తం సియాంగ్ బెల్ట్ నాశనం అవుతుంది. ముఖ్యంగా ఆది తెగ సహా ఆ తరహా సమూహాలు అక్కడ ఎక్కువగా నివాసం ఉంటారు. ఆది తెగ ఆస్తి, భూమి, ముఖ్యంగా మానవ జీవితం వినాశకరమైన ప్రభావాలను ఎదుర్కొంటాయి. అసోంలో కూడా బ్రహ్మపుత్ర నది వరద వల్ల భారీ నష్టం సంభవిస్తుందన్నారు.

చైనా నిర్మిస్తున్న డ్యాం పూర్తైతే సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు ఎండిపోయే ప్రమాదం ఉందని పెమా ఖండూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసమే అరుణాచల్‌లో కూడా ఒ ప్రాజెక్టునునిర్మించనున్నాం. దానివల్ల మా నీటి అవసరాలను దానిద్వారా తీర్చుకునే అవకాశం ఉంటుంది. చైనా నిర్మిస్తున్న ప్రాజెక్టు భారత్‌చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. రక్షణ పరంగానూ భారత్‌కు దీనివల్ల సమస్యలు పొంచిఉన్నాయి. యుద్ధ పరిస్థితులు తలెత్తితే ఈ ప్రాజెక్టులో నిల్వచేసిన నీటిని చైనా వాటర్ బాంబ్‌గా ప్రయోగించే ప్రమాదం ఉంది.



## ఆర్థిక నేరస్తురాలు మోనికా కపూర్
# అమెరికాలో అరెస్టు

**న్యూఢిల్లీ, జూలై 9:** రెండుదశాబ్దాలుగా ఆర్థికనేరాల్లో నిందితురాలిగా ఉంటూ తప్పించుకుని అమెరికాలో తలదాచుకున్న ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారు మోనికా కపూర్‌ను ఎట్టకేలకు సిబిఐ భారత్‌కు రప్పించింది. దిగుమతి లైసెన్స్‌లను దుర్వినియోగంచేసి కోట్లాదిరూపాయలు మోసానికి పాల్పడిందన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ఆమె రెండుదశాబ్దాల క్రితమే అమెరికాలో ఆశ్రయం పొందుతున్నారు. ఆమెపై ప్రత్యేకించి మోనికా ఓవర్సీస్ సంస్థపేరిట 2.36 కోట్ల బంగారం దిగుమతుల్లో కూడా మోసం ఉందని సిబిఐ గుర్తించింది. 1998లో ఆమె తన సోదరులు రాజన్‌ఖన్నా, రాజీవ్‌ఖన్నాలతోకలిసి శిక్షార్హమైన నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి. షిప్పింగ్ బిల్లులు ఫోర్జరీ చేయడం, ఇన్వాయిస్‌లు, బ్యాంక్ సర్టిఫికేట్లు, ఎగుమతుల్లో అవకతవకలు వంటివాటికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. బంగారం ఉచిత దిగుమతులకోసం ఆరు లైసెన్సులు తీసుకుని వాటిని దుర్వినియోగంచేసారని, వాస్తవానికి ఆ లైసెన్సులు జ్యూయెలరీ ఎగుమతులకు నిర్దేశించినవని సిబిఐ వాదించింది. ఎగుమతులకు బదులుగా అహ్మదాబాద్ కేంద్రంగా ఉన్న డీప్ ఎక్స్‌పోర్ట్స్‌కు విక్రయించినట్లు నేరం మోపారు. అంతేకాకుండా మోనికా సంస్థ దిగుమతులను ఎలాంటి సుంకాలు లేకుండా బంగారం దిగుమతులుచేసుకున్నదని, దీనివల్ల భారత ఖజానాకు 1.44 కోట్లనష్టం వాటిల్లినట్లు అభియోగాలు నమోదుచేసారు. ఆమె సోదరులను ఢిల్లీకోర్టు 2017లో ఒకకేసులో శిక్ష విధించింది. ఇక మోనికా కపూర్ అయితే విచారణ, దర్యాప్తు, కోర్టు విచారణను తప్పించుకుంటూ వస్తోంది. 1999లో ఆమె అమెరికాకు వెళ్లిపోయారు. 2002లో కేసునమోదుకాగా ఛార్జిషీటు 2004లో దాఖలుచేసారు. కాగా మోనికా కపూర్‌ను ఉద్దేశ్యపూర్వక ఎగవేత దారుగా 2006లో ప్రకటించారు. ఇందుకు సంబంధించి నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ కాగా ఇంటర్‌పోల్ రెండ్‌కార్నర్‌నోటీసు కూడా జారీచేసింది. 2010లో భారత ప్రభుత్వం ఆమెను తమకు అప్పగించాలని అమెరికాను అభ్యర్థించింది. అయితే ఈ అప్పగింత ప్రక్రియ న్యాయపరమైన సవాళ్లతో జాప్యం జరిగింది. కపూర్ తన అప్పగింతను సవాల్‌చేసింది.

తనను అక్కడ చిత్రహింసలకు గురిచేస్తారని, ఆమె వాదించింది. ఐక్య రాజ్య సమితిఒప్పందం ప్రకారం అమెరికా విదేశీ వ్యవహారాలు, సంస్కరణలు పునర్వ్యవస్థీకరణ చట్టానికి వ్యతిరేకంగా 1998లో ఆమె చేసిన క్లెయిమ్‌లన్నింటినీ తిప్పికొట్టారు. కాగా తాజాగా మోనికాకపూర్‌ను అమెరికాలో అదుపులోకి తీసు కుంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎఎ 292లో కపూర్‌ను సిబిఐ అధికారులు భారత్‌కు తీసుకువచ్చారు. ఈ అప్పగింత ఒక మేజర్ రికార్డు అని ఉద్దేశ్యపూర్వక ఎగవేతత దారులు ఎక్కడ ఉన్నా ఎప్పటికైనా భారత్‌కు రావాల్సిందేనన్న వాదనను నిజంచేసిందని సిబిఐ అధికారులు చెపుతున్నారు.



## ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగు కన్నుమూత!

**భోపాల్, జూలై 9:** ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పేరుపొందిన 'వత్సల' మహిళా ఏనుగు మంగళవారం తుదిశ్వాస విడిచింది. మధ్యప్రదేశ్‌లోని టైగర్ రిజర్వులో ఇది మృతిచెందింది. ఏనుగు ముందుకాళ్ల గోళ్లకు గాయాలు కావడంతో అభయారణ్యంలోని ఖైరైయాన్ కాలువసమీపంలో కూర్చుని ఉండిపోయింది. వైద్యులు, సిబ్బంది ఎంత ప్రయత్నించినప్పటికీ పైకి లేవలేకపోయింది. తర్వాత మృతిచెందినట్లుపన్నా టైగర్ రిజర్వు ప్రకటన విడుదలచేసింది. 100 ఏళ్లకుపైగా బతికిన ఈ ఆడ ఏనుగును దాదీమా, నానిమా అనే పేర్లతోపిలిచేవారు. వత్సల మృతితో వన్యప్రాణుల చరిత్రలో ఒక అధ్యాయం ముగిసిందని సీనియర్ అటవీ అధికారి ఒకరు తెలిపారు. అటవీ అధికారులు సిబ్బంది సమక్షంలో ఆ ఏనుగుకు అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు వృద్ధాప్యం వల్ల వత్సలకు దృష్టిలోపం వచ్చింది. ఎక్కువదూరం నడవలేకపోయింది. హినౌటా ఎలిఫెంట్ క్యాంప్ నుంచి ప్రతిరోజు స్నానం చేయించడానికి తినడానికి దీన్ని ఖౌరైయాన్ కాలువ వద్దకు తీసుకెళ్లేవారు. ప్రతిరోజూ వత్సలకు వైద్య నిపుణుల సమక్షంలో రీక్షలు నిర్వహించేవారు. పూర్తి సంరక్షణ వల్లనే వత్సల చాలా ఏళ్లు బతికిందని అధికారులు తెలిపారు. కేరళలోని నర్మదాపురంలో పుట్టిన ఈ ఏనుగును పన్నాకు తీసుకొచ్చారు. గత కొన్నేళ్లుగా పన్నా పులుల సంరక్షణ కేంద్రంలో పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ వచ్చింది. వత్సల మృతిపై రాష్ట్ర సిఎం మోహన్ యాదవ్ విచారం వ్యక్తంచేసారు.

# బీహార్‌లోనూ ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారు..



## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు!

**పాట్నా, జూలై 9:** బీహార్‌లో ప్రతిపక్షాల ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. మహారాష్ట్ర తరహాలో నితీశ్‌కుమార్ పార్టీ తమకు అనుకూలమైన వారి ఓట్లు మాత్రమే జాబితాలో ఉండేలా మార్పులు చేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేపట్టిన బీహార్ బంద్‌లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభకు, మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ముందుగా ఇండియా కూటమికి మెజారిటీ ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడించాయని రాహుల్ పేర్కొన్నారు. కానీ అనుకోని విధంగా తాము ఆయా ఎన్నికల్లో ఓడిపోయామన్నారు.

అనంతరం ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్నికలకు వారం రోజుల ముందు దాదాపు కోటి మంది కొత్త ఓటర్లను చేర్చినట్లు గుర్తించామన్నారు. అలా కొత్త ఓటర్లను చేర్చిన అన్ని నియోజకవర్గాల్లో బిజెపి గెలుపొందిందని ఆరోపించారు. బీహార్‌లోను అదే కుట్ర పన్నుతున్నారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తాము ఓటర్ల జాబితా అడిగినప్పటికీ ఎన్నికల కమిషన్ అధికారులు ఇప్పటివరకు దానిని తమకు అందించలేదని రాహుల్ ఆరోపించారు. రాజ్యాంగ విలువలను రక్షించాల్సిన ఎన్నికల కమిషన్ తన బాధ్యతలు మరిచి బిజెపి సూచనల మేరకు పనిచేస్తోందని విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న బీహార్ బంద్‌పై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ ప్రభుత్వంలో ఎలాంటి తప్పులు చూపించడానికి అవకాశం లేకపోవడంతో కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకున్నారని బిజెపి నేత షానవాజ్ హుస్సేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్ బంద్ ముసుగులో వారు చేస్తున్న గూండాయిజాన్ని రాష్ట్ర ప్రజలుస్వయంగా చూస్తున్నారన్నారు. భారత పౌరులు మాత్రమే రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వేయాలనే ఆలోచనతో మాత్రమే ఇసి ఓటర్ల జాబితాలను సవరిస్తుందన్నారు.

# చైనా, పాక్, బంగ్లాల మైత్రితో భారత్‌కు పొంచి ఉన్న పెనుముప్పు



## సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్

**న్యూఢిల్లీ, జూలై 9:** చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల కలయిక భారత్ సుస్థిరత, భద్రతకు తీవ్ర సవాళ్లను సృష్టించగలదని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని పలు దేశాల్లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభాన్ని అదునుగా చేసుకొని, వాటిపై విదేశీ శక్తులు పట్టును పెంచుకునే ముప్పు ఉందన్నారు. దీనివల్ల కూడా భారత్‌కు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పారు. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సీడీఎస్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో పాక్ కొనుగోలు చేసిన ఆయుధాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం చైనావేనని ఆయన గుర్తు చేశారు. చైనా ఆయుధ తయారీ కంపెనీలతో పాకిస్థాన్ పెద్దఎత్తున ఒప్పందాలను కుదుర్చుకుందని అనిల్ చౌహాన్ తెలిపారు. ఆయా కంపెనీల ఆయుధ తయారీ యూనిట్లు, నిపుణులు పాక్ గడ్డపై కూడా కార్యకలాపాలు సాగిస్తుండొచ్చని అంచనా వేశారు. అణ్వస్త్ర దేశాలైన భారత్ పాక్‌లు మే 7 10 మధ్య తొలిసారిగా నేరుగా సైనిక శక్తులతో తలపడ్డాయన్నారు. నాలుగు రోజుల ఆపరేషన్ సిందూర్ వేళ చైనా సరిహద్దుల్లో ఎలాంటి అసాధారణ సైనిక చర్యలూ చోటుచేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. చైనా పాక్ మధ్య వ్యూహాత్మక స్నేహం ఉందని, ఆపరేషన్ సిందూర్ చాలా తక్కువ రోజులే కొనసాగడంతో చైనా వైపు నుంచి స్పందన రాలేదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. అయినప్పటికీ ఆ రెండు దేశాల స్నేహాన్ని తప్పకుండా భారత్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాక్ అణ్వాయుధ బ్లాక్ మెయిలింగ్‌కు భయపడకుండా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ నిర్వహించిందన్నారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య సైనిక ఘర్షణకు ఆపరేషన్ సిందూరే ఏకైక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భారత్ చేపట్టిన ఈ సైనిక చర్య చాలా ప్రత్యేకమైందని, దాని నుంచి ఆసియా దేశాలతో పాటు యావత్ ప్రపంచం పాఠాలను నేర్చుకోవచ్చన్నారు.

**ఇకపైనా సంప్రదాయక సైనిక ఘర్షణలే**

రాబోయే కాలంలోనూ సంప్రదాయక సైనిక ఘర్షణలే జరిగే అవకాశం ఉంది. అణ్వాయుధాల వినియోగం దాకా పరిస్థితులు తీవ్రతరం కావు. ఇందుకు మూడు ప్రాథమిక కారణాలు ఉన్నాయి. మొదటి కారణం ఏమిటంటే అణ్వాయుధాలను తొలుత ప్రయోగించకూడదనే భారత్ పాలసీ. అందుకే ఏ పరిస్థితుల్లోనైనా పాక్ కూడా భారత్‌తో సాధారణ తరహా (సంప్రదాయక) సైనిక ఘర్షణకే దిగుతుంది. రెండోకారణం ఏమిటంటే ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. దీనికి ప్రతిగా పాక్ సంప్రదాయక సైనిక ఘర్షణనే మొదలుపెట్టింది. మూడో కారణం ఏమిటంటే భారత్‌తో జరిగే సైనిక ఘర్షణలను ఏ స్థాయికి తీసుకెళ్లాలనేది పాక్ ఇష్టం. పాక్ స్పందించే రేంజ్ కంటే పెద్ద రేంజ్ లోనే భారత్ బలమైన సమాధానం ఇవ్వగలదు. ఈవిషయం పాక్‌కు బాగా తెలుసు. అందుకే అది సంప్రదాయక ఘర్షణకే పరిమితం అవుతుందిఖీ అని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

**బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో పెద్దసవాల్**

సంప్రదాయక సైనిక ఘర్షణను పతాక స్థాయికి తీసుకెళ్లే సత్తా భారత్‌కు ఉందని సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ తెలిపారు. సైబర్, ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ మార్గాల్లోనూ దాడులు జరిపే సత్తా మన దేశానికి ఉందన్నారు. శత్రువులు ఈ తరహా దాడులు చేసినా ధీటుగా ఎదుర్కోగలమని ఆయన పేర్కొన్నారు. అయితే బాలిస్టిక్, హైపర్ సోనిక్, క్రూయిజ్ రకాల క్షి పణులు, పెద్దసంఖ్యలో డ్రోన్లు, దిశను మార్చుకుంటూ ప్రయాణించే మిస్సైళ్లు, డ్రోన్ల నుంచి పూర్తిస్థాయి రక్షణను కల్పించే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఇంకా ప్రపంచంలో ఎక్కడా అందుబాటులోకి రాలేదన్నారు. రాబోయే కాలంలో ఈ తరహా సవాళ్లను ఎదుర్కొనేలా భారత్ సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ఏ క్షణమైనా శత్రుదేశాల దాడులను తిప్పికొట్టగల సైనిక సంసిద్ధత, 365 రోజుల్లో 24/7 అలర్ట్‌గా ఉండే వైఖరి అవసరమన్నారు.

# కర్ణాటకలో సిఎం మార్పు అనివార్యమా?

## అభివృద్ధి కోసమే ఢిల్లీకి వచ్చామంటున్న సిఎం, డిప్యూటీలు

**న్యూఢిల్లీ, జూలై 9:** కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి మార్పుపై జరుగుతున్న ప్రచారం ఇప్పుడు ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఇద్దరూ ఒకేసారి హస్తినలో పర్యటిస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు ఊపందుకున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు నాయకత్వ మార్పును కోరుతున్నారనే వార్తల నేపథ్యంలో, ఇద్దరు కీలక నేతలు కాంగ్రెస్ అధిష్ఠానంతో సమావేశం కానున్నారనే ప్రచారం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. అయితే, ఈ పర్యటన పూర్తిగా రాష్ట్ర అభివృద్ధి పనులకు సంబంధించిందేనని అటు సిద్ధరామయ్య, ఇటు డికె శివకుమార్ స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన డికె శివకుమార్, తాను రాష్ట్ర నీటి పారుదల ప్రాజెక్టులకు నిధుల గురించి చర్చించేందుకు వచ్చానని తెలిపారు. మంత్రివర్గంలో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆయన తేల్చిచెప్పారు. "సీఎం సిద్ధరామయ్య రక్షణ మంత్రితో సమావేశం కోసం వచ్చారు. మా పర్యటనలన్నీ అభివృద్ధి కోసమే" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని, ఆయన పాట్నా పర్యటన నుంచి తిరిగి రాగానే కలుస్తానని డికె వివరించారు. మరోవైపు, పార్టీ కర్ణాటక ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. దీనిపై డికె స్పందిస్తూ, జిల్లా స్థాయిలో పార్టీని పునర్వ్యవస్థీకరించాలని అధిష్ఠానం కోరుతోందని, దానిపైనే సుర్జేవాలా కసరత్తు చేస్తున్నారని చెప్పారు. 2023లో కాంగ్రెస్ ఘన విజయం సాధించినప్పటి నుంచి సీఎం పదవిపై చర్చ కొనసాగుతూనే ఉంది. అప్పట్లో కుదిరిందని చెబుతున్న ఒప్పందం ప్రకారమే మార్పు జరగనుందనే వాదనలు వినిపిస్తున్నా, కాంగ్రెస్ దీనిపై అధికారికంగా స్పందించలేదు.

# ఆస్ట్రేలియాపై భారతీయులకు పెరుగుతున్న క్రేజ్!



**మెల్‌బోర్న్, జూలై 9:** పర్యాటకం కోసం ఆస్ట్రేలియా వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సులభతరం చేసిన వీసా నిబంధనలు, పెరిగిన విమాన సర్వీసులు ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. అందమైన ప్రకృతి, ప్రత్యేకమైన వన్యప్రాణులు, సిడ్నీ ఒపెరా హౌస్ వంటి అద్భుత కట్టడాలు ఉన్న ఆస్ట్రేలియా అంటే భారతీయులకు ఎప్పటినుంచో ఆసక్తి ఉన్నప్పటికీ, ఈ ఏడాది పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. టూరిజం ఆస్ట్రేలియా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మార్చితో ముగిసిన సంవత్సరంలో సుమారు 4.50లక్షల మంది భారతీయులు ఆస్ట్రేలియాను సందర్శించారు. ఇది గతేడాదితో పోలిస్తే 9.4 శాతం అధికమని టూరిజం ఆస్ట్రేలియా కంట్రీ మేనేజర్ (ఇండియా అండ్ గల్ఫ్) నిశాంత్ కాశికర్ తెలిపారు. పర్యాటకుల పెరుగుదలకు ప్రధాన కారణం సులభతరం చేసిన వీసా ప్రక్రియ అని ఆయన వివరించారు. అమెరికా, యూకే వంటి దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియా వీసా విధానం పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండటం, పాస్‌పోర్ట్‌ను భౌతికంగా సమర్పించాల్సిన అవసరం లేకపోవడం, బయోమెట్రిక్స్ లేదా ఇంటర్వ్యూలు వంటివి లేకపోవడంతో భారతీయులకు చాలా సౌకర్యంగా మారిందని పేర్కొన్నారు.

వీసాతో పాటు భారత్‌ఆస్ట్రేలియా మధ్య విమాన కనెక్టివిటీ కూడా భారీగా పెరిగింది. కరోనాకు ముందు వారానికి కేవలం 8 విమానాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 27కు చేరింది. అంతేకాకుండా అమెరికా డాలర్‌తో పోలిస్తే ఆస్ట్రేలియన్ డాలర్ మారకం రేటు స్థిరంగా (సుమారు రూ. 55.56) ఉండటం కూడా సానుకూల అంశమని కాశికర్ అన్నారు. సిడ్నీ, మెల్‌బోర్న్ వంటి నగరాలతో పాటు ఇప్పుడు టాస్మానియా, కంగారూ ఐలాండ్ వంటి కొత్త ప్రదేశాలను చూసేందుకు కూడా భారత పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారని ఆయన తెలిపారు.

# గురుత్వాకర్షణ లేని స్థితిలో మెంతి, పెసరసాగుపై అధ్యయనం

## భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ, జులై 9:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగా తాజాగా ఆయన ఐఎస్ఎస్‌లో రైతు అవతారం ఎత్తారు. రోదసిలో గురుత్వాకర్షణ లేని పరిస్థితుల్లో మెంతి, పెసర సాగుపై ఉండే ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నపాటి గాజు పాత్రలో మెంతి, పెసర విత్తనాలను వేసి ఐఎస్ఎస్‌లోని నిల్వ ఫ్రీజర్ ఉంచి జీరో గ్రావిటీలో అవి ఏ విధంగా మొలకెత్తుతాయనే విషయాన్ని అధ్యయనం చేశారు. వాటికి సంబంధించిన ఫొటోలను తీశారు. ధార్వాడ్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్దపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తల సహాయంతో శుక్లా ఈ ప్రయోగాన్ని చేశారు. భూమిపైకి వచ్చాక ఆ మొలకలలో వచ్చిన జన్యుమార్పులు, పోషక విలువలను పరిశీలించినట్లు ఆక్సియం స్పేస్ వెల్లడించింది. మరో ప్రయోగంలో శుక్లా మైక్రో ఆల్గేలను అధ్యయనం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పరిశీలించారు. స్టెమ్ సెల్ పరిశోధన, విత్తనాలపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధ్యయనం చేయడం, వ్యోమగాములు స్టేషన్‌లోని స్క్రీన్‌తో సంభాషించేటప్పుడు సమాచారాన్ని విశ్లేషించే వారి మానసిక సామర్థ్యం వంటి విషయాలను గమనిస్తున్నామని ఈ విషయాలు తనకు ఆనందాన్ని కలిగిస్తున్నాయని శుక్లా పేర్కొన్నారు. పరిశోధకులకు, స్పేస్‌స్టేషన్‌కు మధ్య వారధిగా ఉండి, వివిధ పరిశోధనలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.

యాగ్జియం -4 ప్రైవేట్ స్పేస్ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి గతవారం ఐఎస్ఎస్ చేరుకున్న సంగతి తెలిసిందే. అంతరిక్షంలోకి వెళ్లినప్పటి నుంచి శుక్లా అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై అధ్యయనం చేశారు. ఖగోళంలో మానవ జీర్ణవ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం చిత్రించారు. ప్రయోగాల్లో భాగంగా వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం నిర్వహించింది.

# ఉత్తరకొరియా పౌరులను అప్పగించిన దక్షిణకొరియా

**సియోల్, జూలై 9:** తన ప్రత్యర్థి ఉత్తర కొరియాతో సంబంధాలను మెరుగుపరుచుకునేలా దక్షిణ కొరియా కీలకమైన చర్య చేపట్టింది. ఈ ఏడాది సముద్రంలో రక్షించిన ఆరుగురు ఉత్తర కొరియా పౌరులను సురక్షితంగా వారి స్వదేశానికి తిరిగి పంపినట్లు దక్షిణ కొరియా యూనిఫికేషన్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ పరిపాలనలో ఇరు దేశాల మధ్య సయోధ్యను పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో ఇది ఒక ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు.

ఈ ఏడాది మార్చి, మే నెలల్లో వేర్వేరు సమయాల్లో కొందరు ఉత్తర కొరియా పౌరుల పడవలు దారి తప్పి దక్షిణ కొరియా సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. వారిని దక్షిణ కొరియా అధికారులు రక్షించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు తమను స్వదేశానికి పంపాలని పదేపదే కోరుకుంటున్నారని, వారి పూర్తి అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ఉదయం ఇరు దేశాల మధ్య ఉన్న సముద్ర సరిహద్దు రేఖ దాటించి వారిని ఉత్తర కొరియా అధికారులకు అప్పగించినట్లు తెలిపింది. ఈ అప్పగింత ప్రక్రియ కోసం ఉత్తర కొరియాను సంప్రదించేందుకు సియోల్ చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పటికీ, చివరికి ఉత్తర కొరియా అధికారుల సహకారంతో ఇది విజయవంతంగా పూర్తయింది.

గత నెలలో కొరియాల మధ్య సంబంధాలను మెరుగుపరిచే చర్యలలో భాగంగా, సరిహద్దుల్లో ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ప్రచారం చేసే లౌడ్‌స్పీకర్లను దక్షిణ కొరియా సైన్యం ఆపివేసింది. ఈ చర్య ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పునరుద్ధరించడానికి, కొరియా ద్వీపకల్పంలో శాంతిని పెంపొందించడానికి సహాయపడుతుందని అప్పట్లో రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. చర్చలను పూర్తిగా నిలిపివేయడం అవివేకమని, అమెరికాతో సమన్వయం చేసుకుంటూనే ఉత్తర కొరియాతో సంబంధాలు మెరుగుపరచుకోవాలని అధ్యక్షుడు లీజేమ్యుంగ్ గత వారం వ్యాఖ్యానించిన విషయం గమనార్హం. 195053 యుద్ధం కేవలం యుద్ధ విరమణతో ముగిసింది కానీ శాంతి ఒప్పందం జరగనందున, సాంకేతికంగా ఇరు దేశాలు ఇప్పటికీ యుద్ధ వాతావరణంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

10-7Pg6exHMNWJQE.qxd:10-7Pg6exHMNWJQE.qxd 01/01/01 8:24 AM Page 1



## సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు సరికాదు : ఉండవల్లి శ్రీదేవి



**నెల్లూరు రూరల్, జూలై 9, ప్రభాతవార్త** మహిళలపై సభ్య సమాజం తల దించుకునేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవీ అన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చీదరించుకుంటున్నారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఆమె ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసి సంఘీభావం తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతిరెడ్డి గారి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం దారుణమని, పూజించాల్సిన మహిళలపై సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇటీవల అమరావతి మహిళలపై వైసీపీ నేతలు నీచంగా మాట్లాడారని గుర్తు చేశారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ మహిళల గురించి దారుణంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఎంపీగా పోటీ చేసి డిపాజిట్లు దక్కని అనిల్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీలో ఉన్నప్పుడు వేమిరెడ్డి దంపతులని దేవుళ్ళు అన్నారని, ఇప్పుడు పార్టీ మారిపోతే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సమంజసం కాదన్నారు. తల్లి, చెల్లిని పక్కన పెట్టారని, బాబాయ్ హత్య జరిగితే చెల్లికి న్యాయం చేసారా అని ప్రశ్నించారు. నారా లోకేష్‌కి చీర, సారె పంపిస్తామని మాజీ మంత్రి రోజా అన్నారని, అసెంబ్లీలో ఇష్టంవచ్చిన్నట్లు మాట్లాడారని అన్నారు. అందుకే మోనార్క్‌గా వ్యవహరించిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు.

పర్యటనల పేరుతో కార్యకర్తలన్ని చంపేస్తున్నారని, అమరావతికి పరిశ్రమలు రానీకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్సి కార్పొరేషన్ నిధులను గత ప్రభుత్వం తొక్కేసిందని, ప్రసన్న కుమార్ రెడ్డి తన వ్యాఖ్యలని వెనక్కి తీసుకుని ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రజల సేవ కోసమే టెక్నాలజీ

ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించాలి - పంటల సాగు మొదలుకుని మార్కెటింగ్ వరకు రైతులకు అండగా నిలవాలి - వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, జులై 9,ప్రభాతవార్తప్రతినిధి:** అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడైనా సరే తాను టెక్నాలజీ గురించి పదే పదే మాట్లాడేది ప్రజల కోసం.. ప్రజలకు మెరుగైన సేవలందించడం కోసమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, పర్యావరణం, ఇన్ఫ్రా, ఆర్టీజీఎస్, స్వర్ణాంధ్ర విజన్2047, ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్ వంటి అంశాల్లో గేట్స్ ఫౌండేషనుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఆయా రంగాల్లో టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలకు సేవలను మరింత దగ్గర చేసే అంశంపై గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకుంటోంది. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి, పురోగతి వంటి అంశాలపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రస్తుత యుగంలో టెక్నాలజీ పెద్దఎత్తున అందుబాటులో ఉంది. టెక్నాలజీ ద్వారా చాలా వరకు పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నాం. అయితే ఆ టెక్నాలజీ ప్రజలకు ఎంతవరకు చేరువ చేయగలిగామనేదే ప్రధానం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోంది. ఆగస్టు 15వ తేదీ నాటికి.. దాదాపు 95 నుంచి 97 శాతం ప్రభుత్వ సేవలు ప్రజలకు ఆన్ లైనులోనే అందుబాటులోకి వచ్చేస్తాయి. ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంటుంది. బిల్ గేట్స్ ఫౌండేషన్ వద్ద ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుసరించే విధానాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. అలాగే టెక్నాలజీ పరంగా ఆయా అంశాల్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంలోనూ వారికి నైపుణ్యం ఉంది. అందుకే వారితో కలిసి పని చేస్తున్నాం. అయితే ఆయా రంగాల్లో మనం అందిపుచ్చుకున్న సాంకేతికతను ప్రజలకు.. మరీ ముఖ్యంగా పేదలకు అందుబాటులోకి తేవాలి. టెక్నాలజీ ద్వారా ప్రజలు లాభం పొందాలి. అప్పుడే సాంకేతికతకు సార్థకత చేకూరుతుంది." అని చంద్రబాబు చెప్పారు. వైద్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాల్లో ప్రభుత్వం టెక్నాలజీని వినియోగించడానికి ప్రత్యేక కారణం ఉంది. ఈ రంగాలు ప్రజలు, పేదలకు అత్యంత అవసరమైనవి. రాష్ట్రాను వైద్యమనేది సామాన్యునికి భారంగా మారుతోంది. ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గాలి. కొన్ని కొన్ని రోగాలకు కోట్లాది రూపాయల మేర డబ్బులు అవసరమవుతున్నాయి. అందుకే ఆరోగ్య రంగాన్ని టెక్నాలజీతో అనుసంధానించే అంశంపై దృష్టి పెట్టాం. ప్రతిఆరు నెలలకోసారి ప్రజలకు రక్త పరీక్షలు చేపట్టాలి. రోగాలు ఏమైనా వచ్చే అవకాశం ఉందా.. అనేది ముందుగానే గుర్తించాలి. ఆ డేటా ఆధారంగా ప్రజలకు ముందుగానే ఆరోగ్య సలహాలు.. సూచనలు అందించేలా చూడాలి. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా వారికి కావాల్సిన వైద్య సేవలు, సూచనలు అందించాలి. ప్రతి రోజూ వ్యాయామం, యోగా వంటివి చేస్తే.. సగం రోగాలు తగ్గిపోతాయి. అలాగే మన ఆరోగ్య పద్ధతులు మార్చుకుంటే చాలా రోగాలు దరిచేరవు. ఇక పుట్టిన పిల్లల్లో వైకల్యం మొదలుకుని.. పోషకాహార లోపాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని గుర్తించగలగాలి. దీని కోసం కేర్ అండ్ గ్రో విధానాన్ని అనుసరిస్తున్నాం. ఎవరెవరికి ఏయే ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకుని.. వారిని నిరంతరం మానిటర్ చేసేలా ఉండాలి. ఆఫ్ లైన్, ఆన్ లైన్ మెడికల్ కన్సల్టేషన్ ఉండాలి.

## శాకంబరి అలంకారానికి ముస్తాబైన కాణిపాకం

**- విరాళంగా 20 టన్నుల కూరగాయాలు**

**కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలు ఆషాడ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి జరుగనున్న శాకాంబరి అలంకారంకు ముస్తాబయ్యాయి. 2022 నుండి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమనికంఠేశ్వరాలయంలో శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవిలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను నిర్వహిస్తున్నారు. ఈఏడాది ప్రధాన ఆలయంలో కూడా శాకాంబరి అలంకారం నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు అలంకరణకు అవసరమైన కూరగాయలను భక్తులు ఉచితంగా సమర్పించాలన్న విజ్ఞప్తితో భక్తులు వారికి తోచిన విధంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లను విరాళంగా దేవస్థానంకు అందజేశారు. దీనితో పలమనేరు, కరా ్నటక రాష్ట్రం వడ్డేపల్లె, కోలారు, ముళబాగళ్, బెంగుళూరు, తమిళనాడు రాష్ట్రం హొసూరు ప్రాంతాలలోని కూరగాయల మార్కెట్ యజమానుల నుండి విరాళంగా అందజేసిన వివిధ రకాల కూరగాయలు, పండ్లు, కరివేపాకులతో ప్రధాన ఆలయం, మణికంఠేశ్వ రాలయంలను సరా ్వంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఈఆలయాల ప్రాంగణం మొత్తాన్ని కూరగాయలు, పండ్లుతో అలంకరిస్తున్నారు. వేకువ జామున అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం కూరగాయలు, పండ్లుతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

## జగన్ బంగారుపాళ్యం పర్యటనను వివాదం చేసే ప్రయత్నం : మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం వైఎస్ జగన్ మామిడి రైతాంగాన్ని పరామర్శించే చిత్తూరు జిల్లా పర్యటనకు అడ్డుకునేందుకు బంగారుపాళ్యం పర్యటనను వివాదం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు.మూడు వేల మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు నోటీసులు ఇచ్చారు. పెట్రోల్ బంకుల వద్ద పోలీసులను కాపలా పెట్టారు. అనేకమందిని హౌస్ అరెస్ట్ చేశారు. హెలీప్యాడ్ వద్ద జనం ఎక్కువ వచ్చారని లాఠీఛార్జ్ చేశారు. విచ్చలవిడిగా పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారు. పోలీసులు ఉంది లా అండ్ ఆర్డర్ కాపాడడానికా జగన్ పర్యటనను అడ్డుకోవడానికా? అంటూ విగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బయటకు వస్తున్నారంటేనే వేలమంది పోలీసులు బంగారుపాళ్యం వచ్చారు. జగన్‌ను చూడడానికి వీల్లేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు అంబటి రాంబాబు. జగన్ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి రైతుల సమస్యలను తెలుసుకుంటున్నారు. అనేక మార్లు అనుమతిలేదని చివరికి గత్యంతరంలేక అనుమతి ఇచ్చారు. బంగారుపాత్యం హెలిప్యాడ్ హెలిప్యాడ్ వద్ద అనేక ఆంక్షలు పెట్టారు. పెట్రోల్ బంక్‌లో పెట్రోలు కొట్టకుండా నిర్బంధిస్తున్నారు. జన సమీకరణ చేస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ మణికంఠ మాట్లాడడం బాధాకరం అన్నారు. అయితే, నారా లోకేష్ ఏం చెప్తే అది చేస్తారా? ఐపీఎస్ అధికారి అనే విషయాన్ని మరిచి నారా లోకేశ్ కోసం చెంచాలు మాదిరిగా కొందరు పోలీసులు పని చేస్తున్నారు అని దుయ్యబట్టారు. అయితే, మీ లాఠీతో జగన్‌కు వస్తున్న ఆదరణను ఆపలేరన్నారు. మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత పెంచుకుంటుంది. జగన్ మాజీ ముఖ్యమంత్రి అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ప్రజల ప్రవాహాన్ని ఉప్పెనను మీరు ఆపలేరు చిత్తూరు మామిడి పంటను ధర లేక రోడ్ల మీద పడవేసి రైతులు ఆందోళన చెందుతున్నారు. అనేక వాహనాలను తనిఖీ చేసి, కొన్ని వాహనాలకు నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు, మామిడి రైతులను పరామర్శిస్తే తప్పు ఏంటి? మీకు ఎందుకు అంత భయం అని నిలదీశారు రాంబాబు, ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారు. మేము ఎక్కడ జన సమీకరణ చేయటంలేదు. బుర్ర లేని నారా లోకేశ్ మాటలు ఐపీఎస్ అధికారులు వినటం బాధాకరం అన్నారు. కూటమిప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు ఒక్కొక్కటి వికటిస్తున్నాయి. ప్రజలకు మీరు మంచి చేస్తే భయం ఎందుకు? రాష్ట్ర డీజీపీ మాకు కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదు. అందుకే ఆయనకు మళ్లీ పోస్టింగ్ పొడిగిస్తున్నారు.

## పేదరికాన్ని రూపుమాపడంలో కలిసికట్టుగా పని చేయాలి:మంత్రి కొల్లు రవీంద్ర

పేదల సంక్షేమాభివృద్ధికి పి-4 కార్యక్రమం



పి-4 కార్యక్రమం అమలుపై జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్నర్షిప్ (పి 4) విధానం ద్వారా పేదల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కృషాననజిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం నియోజకవర్గానికి సంబంధించి పి-4 కార్యక్రమం అమలుపై పట్టణ, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు, పార్టీ నాయకులు తదితరులతో సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 కార్యక్రమ ఉద్దేశాన్ని వారు వివరించి, సలహాలు, సూచనలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పి 4 ప్రపంచంలోనే ఒక గొప్ప కార్యక్రమం అని పేర్కొంటూ, మెరుగైన సమాజ నిర్మాణం కోసం రూపకల్పన చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన వ్యక్తుల సహకారంతో దిగువ కుటుంబాలను పైకి తీసుకురావాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని, తద్వారా 2029 నాటికి సమాజంలోని పేదరికాన్ని జీరో స్థాయికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించేందుకు సాధ్యమవుతుందన్నారు. పి 4 పథకం సమాజంలోని అగ్రశ్రేణి 10 శాతం ధనవంతులను ప్రోత్సహించి, దిగువన ఉన్న 20 శాతం పేద ప్రజలను దత్తత తీసుకొని వారికి మద్దతు ఇచ్చేలా చేస్తుందని, ధనవంతులు మార్గదర్శిగా వ్యవహరిస్తూ దిగువన ఉన్న బంగారు కుటుంబాలకు చేయూతనందించేలా చేస్తుందన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్లో 19,17,151 బంగారు కుటుంబాలు గుర్తించగా, అందులో 1,64,546 బంగారు కుటుంబాలను 10,343 మంది మార్గదర్శిలు దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. కృష్ణాజిల్లాలో 68,948 బంగారు కుటుంబాలను గుర్తించగా, అందులో 2,723 బంగారు కుటుంబాలను 3,44 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని, మచిలీపట్నం నియోజకవర్గంలో 9,778 బంగారు కుటుంబాలు గుర్తించామని, అందులో 398 బంగారు కుటుంబాలను 106 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని మంత్రి తెలిపారు.

### అందరికీ మంచి జరగాలని ప్రార్థించా : తెలంగాణ ఎమ్మెల్సీ

**తిరుమల,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలని ఆకాంక్షించినట్లు తెలంగాణ ఎంఎల్‌సి అంజిరెడ్డి తెలిపారు.

స్వామివారిని విఐపి బ్రేక్‌లో దర్శించుకున్నారు. స్వామివారు ముహిమాన్విత దేవుడని, ఆయన దర్శనంతో మనసు ఆనందంగా ఉందన్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## రొట్టెల పండగకు 2 లక్షల మంది భక్తులు

**నెల్లూరు కలెక్టరేట్, జూలై 9, ప్రభాతవార్త** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగకు 4వ రోజు భక్తుల రద్దీ కొనసాగింది. నెల్లూరు నగరవాసులు భారీగా విచ్చేశారు. బుధవారం సుమారు 2లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, మున్సిపల్ కమిషనర్ నందన్ ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం, కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

## అంబరాన్నంటిన శాకంబరి ఉత్సవ సంబరాలు



కూరలు, పండ్లతో అలంకరించిన దుర్గమ్మ ఆలయ ప్రాంగణం



శాకంబరిగా భక్తులను అనుగ్రహిస్తున్న దుర్గమ్మ

**ఇంద్రకీలాద్రి, జూలై 9, ప్రభాతవార్త** ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాల సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం నాడు జగన్మాత దుర్గమ్మ వారు శాకంబరి మాతగా దర్శించుకోటానిక భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా ఇఒ వికె శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం కలియతిరుగుతూ భక్తుల సౌకర్యాలపై ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. దుర్గమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు కదంబ ప్రసాదాన్ని అందించారు.

- నేడు గిరి ప్రదక్షణ:

దుర్గమ్మ వారు వేంచేసియున్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ కార్యక్రమం గురువారం ఆషాఢమాసం గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 5.55లకు ఘాట్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీ కామధేను ఆలయం వద్ద ప్రారంభిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ వ్యాసపౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున గిరి ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొని శ్రీ అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలన్నారు.

- నేడు పూర్ణాహుతి :

10 వ తేదీన గురువారం సప్తశతీ పారాయణం, మహావిద్యా పారాయణము, హోమము, శాంతి పౌష్టిక హోమాలు, మంటపపూజ, ఉదయం 9.30కు పూర్ణాహుతి నిర్వహిస్తారు.

- అలరించిన నృత్యనీరాజనం:

దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కోలాటం, నృత్యప్రదర్శనలు భక్తులను అలరించాయి. విజయవాడకు చెందిన శ్రీవాగ్దేవి నృత్యాలయం విద్యార్థులు నృత్యాచార్యులు సప్ప శివకుమార్ ఆధ్వర్యంలో నృత్యాన్ని ప్రదర్శించారు.

- ఇఒకు క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ అభినందనలు:

దుర్గమ్మవారిని ప్రముఖ క్రికెటర్ ఎంఎస్‌కె ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఇఒ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించగా ప్రసాద్ ఇఒను అభినందించారు.

## పుట్టపర్తిలో సత్యసాయి భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

**- సౌకర్యాల లేమితో అధికారుల పాట్లు - నేడు కొత్తచెరువులో సిఎం చంద్రబాబు పర్యటన - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి భారీ ఏర్పాట్లు**

**అనంతపురం జులై 8 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం కొత్త చెరువు మండలంలో గురువారం పర్యటించనున్నారు. కొత్త చెరువు మండలంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల, సత్యసాయి బాలుర, బాలికల పాఠశాలలో జరిగే మెగ ఆపిటిఎం-2.0(మెగా పేరెంట్ టీచర్స్) కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ పాల్గొంటున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించే ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండల కేంద్రంలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ పాల్గొంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం సర్వశక్తులు వడ్డుతున్నారు. ఇందులో భాగంగా, సత్యసాయి జిల్లాలో కొన్ని ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు వార్త ఓ ప్రయత్నం చేస్తోంది. అనంతపురం జిల్లా నుంచి సత్యసాయి జిల్లా కొత్తగా ఏర్పడింది. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు సత్యసాయిబాబా పేరును జిల్లాకు నామకరణం చేయడం హర్షం వ్యక్తం అవుతోంది. అదే సమయంలో పుట్టపర్తి కేంద్రంగా కొత్తగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భవనాలు అధిక శాతం శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అనుబంధంగా ఉన్న భవనాల్లోనే నడుస్తున్నాయి. పక్కాగా ప్రభుత్వ భవనాలు లేనందున అధికారులు, సిబ్బంది అనేక అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి పోయే ప్రజలు కూడా అనేక అవస్థలకు గురవుతున్నారు. పుట్టపర్తితోపాటు కొత్తచెరువు, బుక్క పట్నం మండలాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఎక్కువ భాగం భగవాన్ సత్యసాయి బాబా నిర్మించిన భవనాల్లోనే కార్యాలయాలు ఉన్నాయి. స్వచ్ఛందంగా ప్రభుత్వ కార్యాలయాలు నడుపుకునేందుకు సత్యసాయసి సెంట్రల్ ట్రస్ట్ వారు తాత్కాలికంగా అనుమతి ఇచ్చినప్పటికీ అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ భవనాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తగిన చొరవ తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు. సత్యసాయి జిల్లా కేంద్ర మైన పుట్టపర్తికి మడకశిర తదితర అన్ని ప్రాంతాల నుంచి లింక్ రహదారులు ఇంకా పకడ్బందీగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆ దిశలో నిర్మాణాలు కొనసాగుతున్న ప్పటికీ పూర్తి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే సమయంలో పుట్టపర్తి మండలంలోని కప్పలబండ ఏపిఐఐటి ఆధ్వర్యంలో ప్రోత్సహించేందుకు 100 ఎకరాల భూమి కొనుగోలు చేశారు.



## రేపు వెలగపూడిలో 'ప్రపంచ జనాభా దినోత్సవం'

**- హాజరుకానున్న సిఎం చంద్రబాబు**
**- ఏర్పాట్లు పరిశీలించిన గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి**

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై 9:** ఈ నెల 11వ తేదీన తుళ్ళూరు మండలం వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయం సమీపంలో 'ప్రపంచ జనాభా దినోత్సవం' సందర్భంగా నిర్వహిం చనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తో కలసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి సంబంధించి సభాస్థలి ఏర్పాట్లు, బారికేడ్లు,, వాహనాల పార్కింగ్ , సీటింగ్ , త్రాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు.

# అమరావతి స్ఫూర్తితో 'తుడ' అభివృద్ధి

**- సంస్థ పరిధిలో ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు, డ్రైన్ల నిర్మాణం**
**- పంచాయతికార్యదర్శుల సమావేశంలో తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి కీలక నిర్ణయాలు**



**తిరుపతి,జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రఖ్యాతిగాంచిన తిరుపతి నదరానికి శ్రీవారి దర్శనార్థం ప్రతిరోజూ లక్షలాదిమంది భక్తులు వస్తున్నారని, ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతంగా దేవుని దర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వెళ్ళేవిధంగా అన్ని సౌకర్యాలు తుడ కల్పిస్తుందని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. సిఆర్‌డిఎ పరిధిలో రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని తుడ పరిధిలో అభివృద్ధి పనులు మొదలుపెట్టామన్నారు. రాష్ట్రఅభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువమంత్రి నారాలోకేశ్ పడుతున్న కష్టంలో భాగం కావాలన్న సంకల్పంతో తుడ అభివృద్ధికి కష్టపడుతున్నామన్నారు. తుడ అభివృద్ధిలో కీలకమైన గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం తిరుపతిలోని కచ్చపి సమావేశ మందిరంలో తుడ ఉపాధ్యక్షుడు శుభం బన్సల్‌తో కలసి తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి సుదీర్ఘసమావేశం నిర్వహించారు. తుడ పరిధిలోని ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. ఈ పనుల్లో పంచాయతి కార్యదర్శులు పూర్తిసహాయసహకారాలందించాలని ఆయన కోరారు. తుడ పరిధిలో లేఅవుట్ల అనుమతులు సరళతరం చేస్తున్నామని, అక్రమ లే అవుట్లు ,అనుమతులులేని భవన నిర్మాణాలు పంచాయతి కార్యదర్శులు గుర్తించాలన్నారు. సమాజ అభివృద్ధిలో మీ భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రచరిత్రలోనే మొదటిసారి 4 మున్సిపాల్టీలు, 9నియోజకవర్గాలు, 39 మండలాల ఎంపిడిఒలు, 1,100పైగా గ్రామపంచాయతీలు కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. పంచాయతి పరిధిలో కార్యదర్శులు అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి, ఎలా అనుమతులు ఇవ్వాలని, భవననిర్మాణాల అనుమతులు తదితర అంశాలనుకూలంకుషంగా వివరించారు. మండలాలు, జిల్లాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని, వారి హోదాకు ఎలాంటి భంగం కలగకుండా చూస్తామని తుడ ఛైర్మన్ స్పష్టం చేశారు.

## పరామర్శల పేరుతో జగన్ విధ్వంసకర ర్యాలీలు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతుల పరామర్శ పేరుతో విధ్వంసకర ర్యాలీలు చేయడం జగన్ కే చెల్లాయని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. బంగారుపాళ్యంలో హెలీప్యాడ్ నుంచి పర్యటన చేసే స్థలం వద్దకు ర్యాలీగా రావడంపై మండిపడ్డారు. హెలిప్యాడ్ వద్దకు 30 మందికి అనుమతిస్తే 300 మంది వచ్చారన్నారు. సీఎం గా పని చేసిన వ్యక్తి ఈ సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ముందు వేసుకున్న ప్లాన్ ప్రకారమే ర్యాలీలు చేస్తున్నారన్నారు. పోలీసులు, విలేకరులపైనా దాడులకు తెగబడుతున్నారన్నారు. మంత్రివర్గం సమావేశం అనంతరం సహచర మంత్రులు నాదెండ్ల మనోహర్ ,అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. రాబోయే సమస్యలను ముందే ఊహించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చిత్తూరు,అన్నమయ్య, జిల్లాల్లో మామిడిరైతులుఇబ్బందులు పడ్డారు. 2.5 లక్షల టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి జరిగింది. మామిడతి ఉత్పత్తి బాగా పెరిగే సరికి ధర తగ్గింది. తోతాపురి మామిడిని పల్ప్ పరిశ్రమలే కొంటాయి. గతేడాది నిల్వలు ఉండటంతో ఆ పరిశ్రమలూ ఆసారి కొనలేదు. తోతాపురి మామిడిని రూ.12కు కొనాలని నిర్ణయించాం. రూ.8కు మామిడికొనాలని ఆయా పరిశ్రమలకు చెప్పాం. ప్రభుత్వం తరపున కిలోకు రూ.4 సాయం చేస్తామని చెప్పాం. అన్నమయ్యజిల్లాల్లో 99శాతం కొనుగోలు చేశాం. చిత్తూరు జిల్లాలో 80 శాతంకొనుగోలు జరిగింది.

### పాపాలు చేసిన జగన్ నాకు శాపాలు పెట్టడం ఏంటి? : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జూలై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంది మీరే కదా జగన్‌గారు అంటూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ప్రశ్నించారు.,"ఎక్స్" వేదికగా ఆయన మాజీ సీఎం జగన్‌పై పలు విమర్శలు చేసారు.

ఇప్పుడు దొంగే దొంగా దొంగ అన్నట్టు, ఎందుకీ నాటకాలు? 2020- 21లో మొదటి బ్యాచ్ ప్రారంభం అయ్యింది. యూనివర్సిటీకి కనీసం సొంత బిల్డింగ్ లేకుండా, ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా 3 ఏళ్ళు నడిపించింది మీ ప్రభుత్వంలో కాదా? కనీసం ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా కన్సల్టెంట్లతో నడిపించి, విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు.

11 page gnt.qxd:10-7P[illegible]g7exHMNWJQE.qxd 01/01/01 9:01 AM Page 1



# కీలక పోస్టుల భర్తీకి చర్యలు

## ఎంవిఐ పాసింగ్ పెరేడ్‌లో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్




బుధవారం ఎంవిఐల గౌరవ వందనం స్వీకరిస్తున్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికిరవాణా శాఖలో పలు కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.బుధవారం రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన 96 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంవిఐల గౌరవ వందనం స్వీకరించి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏవీఎంఐలకు ఆవార్డులు ప్రదానం చేశారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎంవీఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక ప్రజా యుత కార్యక్రమాలు తెచ్చిందని దాంతో తెలంగాణ రవాణా శాఖ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న పిఎంవీఐలు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మీ శక్తి ఉపయోగించాలని యాక్సిడెంట్‌లో డెత్ రేట్ తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘన చేస్తున్న వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తూ కఠినంగా వ్యవహరించాలని సూచించారు.రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్( ఏఐ) తీసుకొచ్చి వెహికిల్ ఫిట్‌నెస్ చేస్తున్నామన్నారు. మీరంతా రవాణా శాఖలోకి రావడంతో ఈ డిపార్ట్ మెంట్ మరింత పటిష్టమైందన్నారు.దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో గాయపడితే క్యాష్ లెస్ ట్రీట్మెంట్ విధానం కేంద్రం తీసుకొచ్చిందని, రోడ్డు ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకో వాలని ఇప్పటికే విధుల్లో ఉన్న 300కి పైగా సిబ్బందికి 2నెలలచొప్పున శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌లో ఈవీ, సిఎన్జీ ఎల్పీజ్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.దేశంలో రవాణాశాఖలో నియామకం అవుతున్నవారందరికీ మీరు రోల్ మోడల్‌గా ఉండాలని,జిల్లా అధికారులతో సమన్వ యం చేసుకుంటూ మంచి పేరు తెచ్చుకుని మీ తల్లితండ్రులతో పాటు మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# మూతపడిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణకు సహకరించండి

## కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి విజ్ఞప్తి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,జులై 9, ప్రభాతవార్త** :తెలంగాణాలో మూతపడిన రెండు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణకు చొరవ చూపాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణకు కేంద్ర మంత్రి హెచ్ డి కుమార స్వామి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సిసిఐ, ఎస్ఐఐఎల్ పై కేంద్రమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి,ఉపాధి కల్పన రంగాలను బలోపేతం చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు నోచుకున్నట్లుగానే సిసిఐ,ఎస్ఐఐఎల్‌ల పునరుద్ధరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి ఈ సందర్భంగా ఆయనకు వివరించారు.సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణ అవసరాన్ని, ప్రాధాన్యతను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి తెలిపారు.గతంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణను రూ. 5000 కోట్లతో చేపట్టిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఆదిలాబాద్ లోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) మూతపడడానికి దారితీసిన పరిస్థితులను,ఈ పరిశ్రమల పునరుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాల మెరుగుదల, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. వెనుకబడిన, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిశ్రమల పునరుద్ధరణతో ప్రాంతీయాభివృద్ధిలో సమతుల్యత సాధ్యమై రాష్ట్రం,దేశం ప్రగతిబాటలో పయనిస్తాయని కేంద్రమంత్రికి వివరించారు.ఆర్థిక, సామాజిక పురోగతికి దన్నుగా నిలిచే ఈ పరిశ్రమలను పునరుద్ధరించాల్సిందిగా కోరారు.సమగ్ర వివరాలతో కూడిన లేఖను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి అందించారు.ఈ నెలాఖరులో తెలంగాణ రాష్ట్రానికి వచ్చి, తెలంగాణలో నెలకొని వున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరుతో పాటు, సంబంధిత పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు చేపట్టే దిశగా సమీక్షను నిర్వహిస్తానని కేంద్రమంత్రి మంత్రి శ్రీధర్ బాబుకు స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేరకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు అమలు చేయపోతే యుద్ధమే: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్,జూలై 9,ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో జారీ చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని లేకుంటే రాష్ట్రంలోని బిసిలంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజారామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4), ఆర్టికల్ 16 (4) ప్రకారం ఏ వర్గాలకైతే సరైన ప్రాతినిధ్యం లేదని భావిస్తే.. కుల గణన లెక్కల ఆధారంగా వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. ఇటీవల బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన ద్వారా 63 రిజర్వేషన్లు ఇచ్చి, బీసీలకు లక్షకుపైగా ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అధికారం తమ చేతుల్లో ఉన్న.. కేంద్ర ప్రభుత్వంపైకి నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను మోసం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లితే మండల్-2 ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీసీ హిందూ ఆజాది జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వరులు, బీసీ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లోడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుకే యాదవ్, గొర్ల కాపరుల సంక్షేమ సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడు అంజి యాదవ్, శ్రీరామ్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అభయ హస్తం దరఖాస్తు గడువు పెంపు

**హైదరాబాద్, జూలై 9, ప్రభాతవార్త:** కార్పోరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారంభించిన సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు.ఈమేరకు హైదరాబాద్‌లో బుధవారం ఒక ప్రకటనలో ఈ పథకం ద్వారా రాష్ట్రం నుండి సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు గడువు ఈనెల 7వ తేదీతో ముగిసిపోయిందని, అయితే అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకుదాన్ని ఈ నెల 12వ తేదీ వరకుపెంచుతూనిర్ణయంతీసుకున్నట్లు వెల్లడించారు.



బుధవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ, దుర్గానరేశ్ తదితరులు

# 23, 24 తేదీలలో 'చలో ఢిల్లీ' : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 9 ప్రభాతవార్త:** దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23, 24 'చలో ఢిల్లీ' పేరిట ఓబిసి జాతీయస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సదస్సులకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి బిసిలు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు కవిత హైందవి, జోషి, రవియాదవ్, పగిళ్ళ సతీష్, జిల్లపల్లి అంజీ, రాందేవ్, నిఖిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణపై బ్యాంకు మేనేజర్లతో సమన్వయ సమావేశం : ఎస్పీ సతీష్ కుమార్

**గుంటూరు క్రైమ్,జూలై 9,ప్రభాతవార్త** : జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో సైబర్ నేరాల నిరోధానికి సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు.అందులో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణకు పోలీసు శాఖ మరియు బ్యాంకులు కలిసి సమన్వయంతో పనిచేయడం అవసరం ఎంతైనా ఉందన్నారు.బాధితులు 1930కి నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా సమీపంలోని పోలీసు/ బ్యాంకు అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చన్నారు.ఎన్‌బిసిఆర్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేసిన బాధితులకు ఎఫ్ఐఆర్ అవసరం లేకుండా సహాయం చేయబడుతుంది.ఇది నేర నివారణ ప్రక్రియను వేగవంతం చేస్తుందన్నారు.ఖాతాదారులు ఇతర రాష్ట్రాల్లో లేదా విదేశాల్లో ట్రాన్స్‌క్షన్ లు జరిపే సమయంలో బ్యాంకులు వారిని ఒకసారి హెచ్చరించి ఆ లావాదేవీల నిజత్వాన్ని పరిశీలించాలి.డిజిటల్ అరెస్టులు,పెట్టుబడి మోసాలు,లోన్ యాప్ మోసాల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలి.ఈ మోసాలు వేగంగా పెరుగుతున్నాయన్నారు.మొబైల్ ఫోన్లు మరియు బ్యాంకింగ్ వ్యవస్థల ద్వారానే ఎక్కువ సైబర్ నేరాలు జరుగుతున్నందున ఈ మార్గాల్లో వినియోగదారులను అప్రమత్తం చేయడం అత్యంత కీలకం అని తెలిపారు.టెలీ కాన్ఫరెన్స్,మేసెజ్,ఈమెయిల్స్ వంటి కమ్యూనికేషన్ చానల్స్ ద్వారా ఖాతాదారులకు సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి సైబర్ నేరాల బాదితులకు అండగా ఉండి,వాటి నివారణకు బ్యాంకుల భాగస్వామ్యంతో మేము కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.పోలీసు శాఖ తరపు నుండి బ్యాంకు ఖాతాదారులకు ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సూచనలతో కూడిన బ్రోచర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీలు జి.వి.రమణమూర్తి,కే.సుప్రజ క్రైమ్స్, యూనియన్ బ్యాంక్ డిజీమ్ జవహర్,లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి,గుంటూరు జిల్లా ఐటి కోర్ సీఐ నిస్సార్ భాషా,అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**గుంటూరు క్రైమ్,జూలై 9,ప్రభాతవార్త** : స్థానిక 25,31వ డివిజన్లలో సుమారు రూ. 2కోట్ల తో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..25వ డివిజన్‌లో సాయినగర్ క్రాస్ రోడ్డులో రూ.50లక్షలతో సీసీ రోడ్లు,డ్రైను ,,గాంధీనగర్ మెయిన్‌రోడ్డు మరియు ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో రూ.50లక్షలతో సీసీ డ్రైన్లు మరియు ఆర్సీసీ కల ర్వట్లు,అలాగే ఆదర్శనగర్ 2వ లైన్ మెయిన్‌రోడ్డులో రూ.16 లక్షలతో సీసీ డ్రెయిన్లు మరియు ఆర్‌సీసీ



కల్వర్టుల నిర్మాణం, సుబ్బారెడ్డి, నగర్ మెయిన్‌రోడ్డులో 2మరియు 5వ లైన్లలో రూ.49లక్షలతో సీసీ రోడ్డు,31వ డివిజన్ ఏటి అగ్రహారం 1,2క్రాస్ రోడ్లలో 35లక్షలతో సిసి డ్రెయిన్లు మొత్తం రూ.2కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.అభివృద్ధి సంక్షేమం తో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది.ఇప్పటికే ఏటి అగ్రహారం రోడ్డు విస్తరణ పనులు జీరో లైన్ నుండి పనులు ప్రారంభమయ్యాయి. పనులు వేగంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు,దాసరి జ్యోతి, అడపా మాణిక్యాల రావు,కదిరి సంజయ్, సాయి ,బుడే,బిజేపి బుజ్జి,ప్రసాద్,వేముల చిన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మోడీ కిట్స్ ఇస్తా

## సైకిళ్లు పంపిణీ చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్



బుధవారం కరీంనగర్‌లో పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పదవతరగతి చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరయ్యారు. మొత్తం 20 వేల సైకిళ్లను స్వయంగా కొనుగోలు చేసిన బండి సంజయ్ వాటిని దశల వారీగా పంపణీ చేసే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మొదట కరీంనగర్‌టౌన్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య,జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్వినీ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజీపీ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి,ఆర్డీవో, డీఈవోతోపాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సమాజానికి సేవ చేయాలనే మా లో ఎప్పటికప్పుడు స్ఫూర్తినింపిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని అన్నారు.వారి బాటలో నడుస్తూ మాకు చేతనైనంత సాయం చేస్తున్నాం. ఈ సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చిందే జిల్లా కలెక్టర్. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రతిపాదించారు. ఆ ఆలోచనతోనే టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నం. ఇవి ప్రభుత్వ నిధులు కావు. అట్లని నేను కోట్లు ఖర్చు పెట్టేంత సంపన్నుడిని కాదు. మా దగ్గరకు వచ్చిన కొందరు కార్పొరేట్ కంపెనీల యాజమానులను మీరు సంపాదించిన సొమ్ములో కొంత సీఎస్సార్ ఫండ్ కింద ఇవ్వాలని కోరితే వారు సానుకూలంగా స్పందించి ఆ నిధులు అందిస్తే వాటితో సైకిళ్లను కొని మీకు పంపిణీ చేస్తున్నా. నేను కూడా చిన్నప్పటి నుండి మీలాగే పేదరికంలో పెరిగిన. ఇక్కడే కాపువాడలో పుట్టి పెరిగిన. తినడానికి ఇబ్బంది పడ్డ. మా తల్లి దండ్రులు మమ్ముల్ని ఎంతో కష్టపడి చదివించారు. కష్టాలు తెలిసిన వ్యక్తిని కాబట్టే మీరు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని సైకిళ్లను పంపిణీ చేస్తున్నా. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో రోల్ మోడల్. ఒడిశా నుండి వచ్చి కష్టపడి పని చేస్తూ మీఅందరికీ స్ఫూర్తిగా ఉన్నారు. పోలీస్ కమిషనర్ బీహార్ నుండి ఇక్కడికి వచ్చారు. ఆయన తండ్రి మిలటరీలో పనిచేశారు. క్రమశిక్షణతో ఎదిగి వచ్చారు. వీళ్లే కాదు... మహాత్మా గాంధీ, అంబేద్కర్, మోదీ కూడా పేదరికం నుండి ఎదిగిన వాళ్లే.ముఖ్యంగా అంబేద్కర్ ఎన్ని కష్టాలు అనుభవించారో, అంటరానితనాన్ని ఎదుర్కొన్నారే మాటల్లో చెప్పలేం. ఇప్పుడు మీ కష్టాలను తీర్చడానికి మోదీ ఉన్నాడు. మా హయాంలో ఆదుకునే వాళ్లే లేరు.మోదీ ప్రభుత్వం విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. యూపీఏ హయాంలో (2014 15 బడ్జెట్‌లో) విద్యా రంగానికి కేంద్రం 68 వేల 728!!కోట్లు మాత్రమే కేటాయిస్తే. ఈ ఒక్క ఏడాదే(2025 26) 1 లక్షా 28వేల 650 కోట్ల రూపాయలు కేటాయించింది. అంటే యూపీఏతో పోలిస్తే విద్యా రంగానికి నిధుల కేటాయింపు రెట్టింపు పెరిగింది. ఈ 11 సంవత్సరాల్లో ఒక్క విద్యా రంగానికే దాదాపు 8!!లక్షల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశామంటే విద్యా రంగంపై మోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయితే...ఇన్ని నిధులు ఖర్చు చేస్తున్నా విద్య అనేది 1976 వరకు రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం కూడా నిధులు కేటాయిస్తుంది. అయితే పాఠశాలలను నడిపే బాధ్యతను, స్థానిక భాషలో పాఠ్యంశాలు బోధించే అంశాలను అమలు చేయాల్సింది మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే. ఎందుకంటే కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో విద్యా రంగం ముందుకు సాగుతుందనే నమ్మకంతోనే ఈ జాతీయ విద్యా విధానాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది.మీకందిస్తున్న సైకిళ్లు మోదీ గిఫ్ట్. అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అతి త్వరలో "మోదీ కిట్స్"ను అందజేయబోతున్నాం. ఎన్ని వేల మంది ఉన్నా, ఎన్ని లక్షల మంది ఉన్నా వాళ్లందరికీ మోదీ కిట్స్‌ను అందిస్తామని అన్నారు.

## ప్రభుత్వం అందజేసిన పరికరాలను విద్యార్థులకు ఉపయోగించండి

### ఎం ఈ ఓ శ్రీనివాసరావు

**పెదనందిపాడు జూలై 9 (ప్రభాతవార్త)** ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన పరికరాలను. వారు సద్వినియోగపరుచుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని మండల విద్యాశాఖ అధికారి ముద్దన



శ్రీనివాసరావు అన్నారు. పెదనందిపాడు మండల విద్యా వనరుల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు, విద్యార్థులకు. ఐదు వీల్ చైర్స్. రెండు రోలేటర్స్. ఒక సీపీ కమాండ్. రెండు బ్రెయిలీ కిట్స్ ను తదితర ఉపకరణాలను ఆయా విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాసరావు. కొత్తపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనితలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు విద్యార్థుల తల్లిదండ్రులకు వారు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఫిజియోథెరపిస్ట్ ఎస్ బాల బ్రహ్మచారి. ఉపాధ్యాయులు ఎస్ పరిమళ.కెవిఎస్ పూర్ణచంద్రరావు. తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన: యాగంటి

### – శ్యామరాజుపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం

**మాచర్ల, జులై 9 ప్రభాతవార్త:** దుర్గి మండలం శ్యామరాజుపురం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందడంతో రాష్ట్రంలో ప్రలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం



పనిచేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు వివరించేలా సుపరిపాలనలో తొలి అడుగు కార్యమ్రాన్ని సీఎం రూపకల్పన చేశారన్నారు. వైసీపీ పాలనలో ఇంటింటికి మోసం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుందన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముందుచూపుతో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని యాగంటి మల్లికార్జునరావు వెల్లడించారు. కార్యక్రమంలో కస్టర్ ఇన్‌ఛార్జి యాగంటి నరేష్, బూత్ ఇన్‌ఛార్జి మారబోయిన బుజ్జి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బట్టు శ్రీను, గ్రామ సర్పంచ్ తాటి రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు జానకిరామయ్య, పసుమర్తి బుజ్జి, గౌరీ, నాగేశ్వరరావు, సీతయ్య, మండల నాయకులు మాగులూరి నారయ్య, మేకల దాసు, తిక్కా కొండలు, ప్రసాద్, సింగు నాగేశ్వరరావు, దిగుమర్తి సుబ్బారావు, గ్రామనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెదనందిపాడులో విజయవంతమైన సార్వత్రిక సమ్మె, ప్రజాసంఘాల ర్యాలీ

**పెదనందిపాడు జులై 9 (ప్రభాతవార్త)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుదవారం పెదనందిపాడు లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ సంఘం జిల్లా కార్యదర్శి జి రమణ, సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ కార్మికులు, రైతులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో భాగంగా అన్ని ప్రజా సంఘాలు విధులను బహిష్కరించి ఈ సమ్మెలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. కార్మికులను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 అమలు చేయాలని, ప్రతి ఐదు ఏళ్లకు వేతనాలు పెంచాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, ప్రభుత్వ స్కీముల కింద పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదని, స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ విరమించుకోవాలని, విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకం డబ్బులు ఏ నెలకు ఆనెల అందించాలని, విద్య వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, వాటికి బడ్జెట్లో నిధులు పెంచాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, అర్హులైన పేదలందరికీ ఇట్టి స్థలం ఇచ్చి, ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సీనియర్ సిటిజన్లు గౌరవంగా జీవించే విధంగా పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులకు ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పథకం కిందకు తీసుకురావాలని, పేదరికం, నిరుద్యోగం అసమానతలతో బాధపడుతున్న ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ రైతుల పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావాలని, సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని, అన్నదాత సుఖీభవ పథకం రైతులకు, కౌలు రైతులకు అందించాలని , పెదనందిపాడు లో పొగాకు కొనుగోలు కేంద్రం తక్షణం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పెదనందిపాడు తహసిల్దార్ ఎస్ హేనాప్రియ, డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరిముల్లా కు సమస్యల పరిష్కారం కొరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, పోపూరి సుధీర్, పి శేషగిరిరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, అంగన్వాడీ సంఘం నాయకులు పార్వతి, ధనలక్ష్మి, రమాదేవి, మేరీ ఉడ్, మధ్యాహ్నం భోజనం సంఘం నాయకులు షేక్ షమీ, మర్రి లక్ష్మి, అనూష, లలిత కుమారి, శివ లీల, విజయమ్మ, విమల, ఆశా వర్కర్ సంఘం నాయకులు సరళ, సరిత, రత్న కుమారి పెద్ద సంఖ్యలో ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.




## అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

**మాచర్ల, జులై 9 ప్రభాతవార్త:** అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు మాచర్ల మండల వ్యవసాయ అధికారిణి డి.పాపకుమారి తెలిపారు. మాచర్ల మండల పరిధిలోని రైతులు, లబ్ధిదారుల జాబితాలో పేర్లను తనిఖీ చేసుకోవాలన్నారు. అర్హత ఉండి జాబితలో పేర్లు లేని రైతులు గ్రామ రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ పోర్టల్‌లో ఈ నెల 13వ తేదీలోపు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది బి.అంజినాయక్, కె.శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

## కోన ప్రభాకరావు జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

**బాపట్ల,జులై09,ప్రభాతవార్త:** మాజీ గవర్నర్ శాసన సభ్యులు మంత్రి బాపట్ల ముద్దు బిడ్డ కోన ప్రభాకరరావు జయంతి వేడుకలను జయప్రదం చేయాలని బాపట్ల మాజీ శాసన సభ్యులు,మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి మూడు పర్యాయాలు శాసన సభ్యులుగా ఎంపికై నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన కోన ప్రభాకరరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించను న్నామన్నారు .దీనిలో భాగంగా పట్టణంలోని వైసిపి కార్యాలయం నుంచి అభిమానులు, నాయకులు,కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి పాతబస్టాండులోని గతంలో ప్రభాకరరావు విగ్రహం ఉన్న ప్రాంతం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.ఈ వేడుకలకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.కోన ప్రభాకరరావు విగ్రహ ఏర్పాటుకు ఎందుకు రాజకీయం చేస్తున్నారో రాద్ధాంతం చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. మూడు పర్యాయాలు నియోజకవర్గానికి శాసన సభ్యులుగా ఎన్నికైన ఘనత అతనికే దక్కిందని ఇప్పటి వరకు ఆ ఘనతను సమానం చేసిన వారు లేరన్నారు. నిరంతరం బాపట్ల అభివృద్ధే ధ్యేయంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతికి ఆనాడే ఆలోచన చేసిన వ్యక్తి ప్రభాకరరావు అన్నారు.బాపట్ల నియోజకవర్గానికి సాగునీరు,తాగు నీరు అందించే క్రమంలో పలు కాలువలను ఏర్పాటు చేయించి రైతాంగాన్ని లాభాల బాటలో నడిపించారన్నారు. మున్సిపాలిటి ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు బాపట్ల పట్టణ ప్రజలు మంచి నీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఆనాడు ఆయన చూపిన ముందుచూపేనన్నారు.క్రీడాకారుడిగా,రాజకీయ నాయకుడిగా నటుడిగా నిర్మాతగా విభిన్న రంగాలలో ప్రతిభా పాటవాలను చాటిన మహోన్నత వ్యక్తి ప్రభాకరరావు అన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి పాలకులు రాజకీయాలు చేస్తున్నారన్నారు.బాపట్ల విద్యాకేంద్రంగా రూపుద్దిటానికి అవిరళంగా కృషిచేసి ఆనాడే బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీని ఏర్పాటు చేశారన్నారు.విద్యార్ధుల విద్యాభివృద్ధికి బాపట్లలో ఆయన వేసిన పునాదేనన్నారు.బాపట్లలో ఎంతో మందికి ఆయన స్ఫూర్తిదాయకమన్నారు.బాపట్ల నియోజకవర్గం నుంచి ఎంపికై అనేక పదువులు అలంకరించారన్నారు.అటువంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అందరూ రాజకీయాలకు అతీతంగాముందుకురావాలని ఆయన కోరారు. తాను రాజకీయాలలోకి రావడానికి కారణం కోన ప్రభాకరరావు ఆశయాలలో భాగంగా బాపట్లను జిల్లా చేయడానికే వచ్చానన్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చొరవతో తన తండ్రి కల నల్లమడ జిల్లాను ఏర్పాటు చేయాలనే కోరికలో ఆశయంలో భాగంగా బాపట్ల జిల్లాను ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2024ఎన్నికల ముందు రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలో ఉన్న పలు విగ్రహాలను తొలగించామన్నారు.ఆనాడే తిరిగి మరలా తొలగించిన విగ్రహాలను ఏర్పాటు చేస్తామనే నిర్ణయించిన హామిని అందరూ గుర్తుంచుకోవాలన్నారు.తొలగించిన విగ్రహాలను మరల ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులకు లేదా అని ప్రశ్నించారు.తొలగించిన విగ్రహాలను మరల ఏర్పాటు చేయటనికి కమిటీలు ఎందుకన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు,మండల పార్టీ అధ్యక్షులు మరుప్రోలు కొండలు రెడ్డి,జోగి రాజా,తన్నీరు అంకమ్మరావు,మచ్చా శ్రీనివాస రెడ్డి,మాజీ ఎంపిటిసి వాలి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్చరీ ప్రపంచ కప్.. జ్యోతి, రిషబ్ వరల్డ్ రికార్డు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్-2025 కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలో భారత్ అథ్లెట్లు వెన్నం జ్యోతి సురేఖ-రిషబ్ యాదవ్ కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 4 లో మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ఇరువురు అద్భుత ప్రదర్శన చేశారు. మాడ్రిడ్‌లో జరిగిన ఈ ఆర్చరీ పోటీల్లో జ్యోతి మరియు రిషబ్ మొత్తం 1431 స్కోరుతో 2023 యూరోపియన్ గేమ్స్ తర్వాత డెన్మార్క్‌కు చెందిన టాంజా గెల్లెంథియన్ మరియు మథియాస్ ఫుల్లెర్టన్ పేరిట ఉన్న 1429 పరుగుల ప్రపంచ రికార్డును అధిగమించారు. ముఖ్యంగా రిషబ్ పూర్తి స్థాయిలో రాణించాడు. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ అర్హత రౌండ్‌లో అతను 716 పాయింట్లు సాధించి వేదికపై అగ్రస్థానంలో నిలిచాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ స్కోరు మాత్రమే కాదు, 716 స్కోరు బ్రాడెన్ గెల్లెంథియన్ పేరిట ఉన్న పురుషుల వ్యక్తిగత ప్రపంచ రికార్డుకు కూడా కొంచెం దూరంలో ఉంది. అదే సమయంలో జ్యోతి అంతర్జాతీయ వేదికపై కూడా వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన చేసింది, మహిళల వ్యక్తిగత కాంపౌండ్ అర్హత రౌండ్‌లో 715 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మిశ్రమ కాంపౌండ్ జట్టు మొత్తం అంటే ఇద్దరు ఆర్చర్ల వ్యక్తిగత స్కోర్లు కలిపితే వస్తుంది.



# వింబుల్డన్‌లో జొకోవిచ్ ముందడుగు

**న్యూఢిల్లీ:** ఏడు సార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ 2025 వింబుల్డన్ టోర్నమెంట్‌లో తనదైన ముద్ర వేశాడు. నాలుగో రౌండ్‌లో అలెక్స్ డి మినార్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మొదటి సెట్ కోల్పోయినప్పటికీ అద్భుతంగా పుంజుకొని తర్వాతి మూడు సెట్లు గెలిచి మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదిలో తడబడినప్పటికీ జకోవిచ్ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించాడు. 2016 తర్వాత వింబుల్డన్‌లో ఇంత త్వరగా బయటపడే ప్రమాదం ఉన్నప్పటికీ జకోవిచ్ డి మినార్‌ను 1-6, 6-4, 6-4, 6-4తో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 38 ఏళ్ల జకోవిచ్ పేలవమైన ఆరంభం చేసి మొదటి సెట్‌ను చేజార్చుకున్నాడు. అయితే జకోవిచ్ వెంటనే పుంజుకుని తర్వాతి రెండు సెట్లు గెలిచి 2-1 ఆధిక్యంలో నిలిచారు. నాలుగో సెట్‌లో డి మినార్ మళ్లీ 4-2 ఆధిక్యం సాధించాడు. కానీ ప్రపంచ మాజీ నంబర్ వన్ ఆటగాడు జకోవిచ్ వరుసగా రెండు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. ఎనిమిదో వింబుల్డన్ టైటిల్, రికార్డును మెరుగుపరిచే 25వ సింగిల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం ప్రయత్నిస్తున్న జకోవిచ్ తదుపరి రౌండ్‌లో ఇటలీకి చెందిన 22వ సీడ్ ఫ్లావియో కోబోలితో తలపడనున్నారు. ఫ్లావియో కోబోలి 2014 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ మారిన్ సిలిక్‌ను 6-4, 6-4, 6-7, 7-6తో ఓడించి తన కెరీర్‌లో తొలిసారిగా గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.

# నేటి నుండి మూడో టెస్టు

## సిరీస్ అధిక్యం కోసం భారత్ పట్టు.. టీమ్‌లో మరిన్ని ఛేంజింగ్స్

**న్యూఢిల్లీ:** ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ గట్టి పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో టీమిండియాలో మళ్లీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ నెల 10 నుంచి 14 వరకు లండన్‌లోని లార్డ్స్ మైదానంలో జరగనున్న మూడో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యంతో దూసుకెళ్లేందుకు భారత్ వ్యూహాత్మకంగా బరిలోకి దిగబోతోంది. హెడింగ్లీ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఓడిపోయినా ఎడ్జ్ బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ ఘన విజయాన్ని అందుకుంది. దీంతో ప్రస్తుతానికి సిరీస్ 1-1తో సమంగా ఉంది. రెండో టెస్టులో విజయం సాధించినప్పటికి మూడో టెస్టులో జట్టులో మార్పులు తప్పవనే విషయాన్ని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇప్పటికే వెల్లడించాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రెండో టెస్టుకు విశ్రాంతినిచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా మూడో టెస్టులో ఆడడం ఖాయం. అదే సమయంలో జట్టులో ఇంకొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంగ్లాండ్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో సత్తా చాటడడంతో పేస్ ఆల్‌రౌండర్‌గా ఆస్ట్రేలియాలో రాణించిన నితీశ్ కుమార్‌ని కాదని శార్దూల్ ఠాకూర్‌ను తొలి టెస్టుకు తీసుకున్నారు. అయితే శార్దూల్ ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలం అయ్యా డు. బ్యాటింగ్‌లో తొలి ఇన్నింగ్స్ 8 బంతుల్లో 1 పరుగు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 12 బంతుల్లో 4 పరుగులు మాత్రమే చేశాడు. ఇక బౌలింగ్‌లో 2 వికెట్లు మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టుకు శార్దూల్‌ను పక్కన బెట్టిన మేనేజ్‌మెంట్ నితీశ్‌కు చోటు ఇచ్చింది. వచ్చిన అవకాశాన్ని ఈ హైదరాబాదీ ఆటగాడు సద్వినియోగం చేసుకోలేక పోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 బంతుల్లో 1 పరుగే చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 2 బంతులు ఆడి 1 పరుగే చేశాడు. ఇక బౌలింగ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు వేసి 29 పరుగులు ఇచ్చాడు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అతడి చేతికి బంతినే ఇవ్వలేదు. ఈ మ్యాచ్‌లో నితీశ్ ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఈ క్రమంలో లార్డ్స్ టెస్టులో పేస్ ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఆడించాలోనని టీమ్‌మేనేజ్‌మెంట్ సందిగ్ధంలో పడింది. అటు శార్దూల్, ఇటు నితీశ్ కుమార్‌లు ఘోరంగా విఫలం కావడంతో జట్టుకు ఎం చేయాలో పాలుపోవడం లేదు. లార్డ్స్ పిచ్ పేసర్లకు అనుకూలం కావడంతో ముగ్గురు పేసర్లతో పాటు వీరిద్దరిలో ఎవరో ఒకరికి జట్టులో చోటు దక్కడం ఖాయం. మరి నితీశ్‌కే అవకాశం ఇస్తారా? లేదంటే అనుభవానికి ఓటు వేసి శార్దూల్‌కు అవకాశం ఇస్తారా? అన్నది చూడాల్సిందే. లేక వీరిద్దరిని కాదని మరో ఆటగాడికి ఛాన్స్ ఇస్తారా ?అన్నది ఆసక్తికరంగా మారింది.







# వరల్డ్ నం. 1గా హ్యారీ బ్రూక్

## బౌలింగ్ టాప్‌లో బుమ్రా..

## బ్యాటర్ల టాప్10లోకి గిల్

**న్యూఢిల్లీ:** ప్రపంచ నెంబర్1గా ఇంగ్లండ్ స్టార్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ నిలిచాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో సరికొత్త రారాజుగా ఉద్భవించాడు. ఐసీసీ ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో బ్రూక్ తన సహచరుడు జో రూట్‌ను అధిగమించి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ ఇంగ్లండ్ వైస్ కెప్టెన్ 886 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. అతడి తర్వాత స్థానంలో జో రూట్ 868 పాయింట్లతో ఉన్నాడు. భారత్‌తో ఇటీవల ముగిసిన రెండో టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్ 158 పరుగులతో అద్భుతమైన సెంచరీ చేసి చెలరేగాడు. అంతకు ముందు తొలి టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో బ్రూక్ రాణించాడు. ఈ క్రమంలో అతడు వర్డ్ నెంబర్ 1 టెస్టు బ్యాటర్‌గా అవతరించాడు. ఇక ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో ఇంగ్లండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (269), రెండో ఇన్నింగ్స్‌లో భారీ శతకం (161) సాధించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సైతం తాజా ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. గిల్ 807 పాయింట్లతో ఏకంగా 15 స్థానాలు మెరుగుపరచుకుని తన కెరీర్ బెస్ట్ ర్యాంకింగ్ అరో స్థానానికి చేరుకున్నాడు. ఇక గిల్‌తో పాటు, మరో ఇద్దరు బ్యాటర్లు టాప్10లో చోటు దక్కించుకున్నారు.

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 4వ స్థానంలో ఉండగా, వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ 8వ స్థానంలో నిలిచాడు.. మరోవైపు భారత్‌తో రెండో టెస్టులో సత్తా చాటిని ఇంగ్లండ్ కీపర్ జెమీ స్మిత్ 753 పాయింట్లతో 16 స్థానాలు ఎగబాకి 10వ ప్లేస్‌కు చేరుకున్నాడు. అయితే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు. టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా (898) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, సఫారీ పేసర్ కగిసో రబాడ (851) రెండో ప్లేస్‌లో ఉన్నాడు. ఇక అల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## ఆసియా ఛాంపియన్‌షిప్‌లో..

# ఛాంపియన్‌గా భారత్ రెజ్లింగ్ టీమ్

## ఖాతాలో 6 స్వర్ణాలు సహా 8 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా అండర్ 15 ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లింగ్ బృందం ఆధిపత్యం చెలాయించింది. బిష్కెక్‌లో జరిగిన ఈ పోటీల్లో పురుషుల ఫ్రీస్టైల్ జట్టు ఛాంపియన్‌గా, మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. కిర్గిజస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 2025 అండర్15 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లింగ్ జట్లు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాయి. ఫ్రీస్టైల్ జట్టు 6 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యంతో సహా 8 పతకాలను గెలుచుకుని మొత్తం 203 పాయింట్లను సాధించాయి. ఈ నేపథ్యంలో 166 పాయింట్లతో జపాన్‌ను అధిగమించి మొత్తం ఛాంపియన్‌గా నిలిచింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్లో 9 8 స్కోరుతో జపాన్ ప్రత్యర్థిపై విజయం సాధించి వాన్ష్ అహ్లావత్ పతకాల పట్టికను ప్రారంభించాడు. 44 కిలోల విభాగంలో ఆర్యన్ కిర్గిజ్ రెజ్లర్‌ను సాంకేతిక ఆధిపత్యంతో (16 6) ఓడించాడు. అలాగే ప్రథమేష్ సూర్యకాంత్ పాటిల్ తన ఉజ్బెక్ ప్రత్యర్థిని 74 తేడాతో, శరదృతువు నాటికి సచిన్ (68 కిలోలు) తన ఉజ్బెక్ ప్రత్యర్థిని ఓడించి గెలిచారు. రోహిత్ మాన్ తజికిస్తాన్‌పై 100 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని సాధించాడు. కార్తీక్ (85 కిలోలు) కజకిస్తాన్‌పై 31 విజయంతో పోరాడాడు. కాగా మహిళల జట్టు సాహసోపేతమైన ప్రదర్శనను ప్రదర్శించి, 202 పాయింట్లతో మొత్తం మీద రెండవ స్థానంలో నిలిచింది. జపాన్ 217 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. భారతదేశం మరియు జపాన్ మధ్య జరిగిన పోటీలో భారతదేశం 2 స్వర్ణాలు, కాంస్యాన్ని గెలుచుకుంది, చివరికి మొత్తం 3 స్వర్ణాలు, 5 రజతాలు మరియు 1 కాంస్య పతకాన్ని సాధించింది. జియా (33 కిలోలు) తన జపాన్ ప్రత్యర్థిపై 42 తేడాతో విజయం సాధించి స్వర్ణం గెలుచుకోగా, పూర్వి శర్మ (66 కిలోలు) తన జపాన్ ప్రత్యర్థిపై 80 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. ఇక దీక్ష (39 కిలోలు) తన కిర్గిజ్ ప్రత్యర్థిని పతనంలో ఓడించడం ద్వారా అద్భుత ప్రదర్శన ఇచ్చింది. 58 కిలోల కాంస్య పతక పోరులో, భారతదేశం జపాన్‌ను అధిగమించి మరో పతకాన్ని జోడించింది. గ్రీకో రోమన్ రెజ్లర్లు కఠినమైన సవాళ్లను ఎదుర్కొని మొత్తం పతకాల జాబితాలో 5వ స్థానంలో నిలిచారు. చాలా మంది రెజ్లర్లు కాంస్య పతక పోటీలలో ఓడిపోయినప్పటికీ, అభిషేక్ (48 కిలోలు) ఫైనల్‌కు చేరుకుని రజత పతకాన్ని సాధించాడు, కజకిస్తాన్‌పై 80 స్కోరుతో ఓడిపోయాడు. అదనంగా, పర్నమ్ సింగ్ (68 కిలోలు) కిర్గిజ్ రెజ్లర్‌పై 101 తేడాతో ఘన విజయం సాధించి కాంస్యం సాధించాడు.





# వాణిజ్యం


# ఆపిల్ సిఒఒగా సబిహ్ ఖాన్..

**వాషింగ్టన్, జులై 9:** టెక్ దిగ్గజం ఆపిల్ నాయకత్వ బాధ్యతల్లో కీలక మార్పులు చేసింది. భారతీయ మూలాలున్న వ్యక్తికి ముఖ్య బాధ్యతలు అప్పగించింది. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జెఫ్ విలియమ్స్ కంపెనీని వీడనుండడంతో, సిఒఒ టిమ్ కుక్ అదనపు భారం స్వీకరించనున్నారు. విలియమ్స్ సిఒఒ బాధ్యతలను ఆపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సబిహ్ ఖాన్‌కు ఈ నెలాఖర్లో అప్పగించనున్నారు. ఈక్రమంలో డిజైనింగ్ టీమ్ బాధ్యతలను నేరుగా టిమ్ కుక్ స్వీకరించనున్నారు. ఇక విలియమ్స్ స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్న సబిహ్ ఖాన్‌కు సంస్థలో 30యేళ్ల అనుభవం ఉంది. గత ఆరేళ్లుగా ఆపిల్ గ్లోబెల్ సప్లై చైన్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఉత్పత్తి కార్యకలాపాలనూ పర్యవేక్షిస్తున్నారు. ఖాన్ మూలాలు భారత్‌లో ఉన్నాయి. ఆయన ఉత్తరప్రదేశ్ మొరాదాబాద్ జిల్లాలో 1966వ సంవత్సరంలో జన్మించారు. ఖాన్‌కు ప్రమోషన్‌పై సిఒఒ టిమ్ కుక్ మాట్లాడుతూ, ఆపిల్ పంపిణీ వ్యవస్థలను పర్యవేక్షిస్తూనే, అత్యాధునిక ఉత్పాదక విధానాలకు సంబంధించి కీలక టెక్నాలజీల్లో సంస్థకు మార్గదర్శకత్వం చేశారు. అమెరికాలో ఆపిల్ కంపెనీ మానిఫ్యాక్చరింగ్ విస్తరణలో ఆయన కృషి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను ఆపిల్ చురుగ్గా ఎదుర్కొనేలా సిద్ధం చేశారు అని పేర్కొన్నారు. ఈ యేడాది విలియమ్స్ సిఒఒ పదవి నుంచి వైదొలగినా, సిఒఒ టిమ్ కుక్‌తో కలిసి కొంత కాలం పనిచేయనున్నారు. దీంతో పాటు డిజైన్ టీమ్, ఆపిల్ వాచ్, కంపెనీ హెల్త్ ఇనీషియేటివ్‌ను పర్యవేక్షించనున్నారు. కానీ డిజైన్ టీమ్ మాత్రం టిమ్‌కుక్‌కు రిపోర్టింగ్ చేయ నుంది. జెఫ్‌తో కలిసి సుదీర్ఘకాలం పనిచేశాను. అతడు లేకుండా నేడు ఆపిల్ ఇలా ఉండేది కాదు. ఆయన ప్రపంచంలోనే అత్యంత గౌరవప్రద మైన పంపిణీ వ్యవస్థను సృష్టించారు. ఆపిల్ వాడ్ లాంచింగ్, దాని డెవలప్‌మెంట్ పర్యవేక్షించారు. ఇక ఆపిల్ హెల్త్ వ్యూహాన్ని రూపొందించారు. అద్భుతమైన దార్శనికతతో మా డిజైనర్స్ బృందానికి నాయకత్వం వహించారు అని సిఒఒ టిమ్ కుక్ పేర్కొన్నారు.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జులై 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిసాయి. రేంజిబౌండ్ సెషన్ తర్వాత దిశా సంకేతాలు లేకపోవడంతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల వద్ద ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 176.43 పాయింట్లు క్షీణించి 83,536.08 వద్ద, ఎన్ఎస్ఇ నిఫ్టీ 46.4 పాయింట్లు నష్టపోయి 25,476.10 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్100 0.13శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.59శాతం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ రియాల్టీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ వరుసగా 1.49శాతం, 1.4శాతం, 1.25శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఎనర్జీ, ఐటి, మీడియా, పిఎస్‌యు బ్యాంకు, హెల్త్‌కేర్ వంటి షేర్లు క్షీణించాయి. వేదాంత షేర్లు 3శాతానికిపైగా నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసిజి, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్‌లోని 17 షేర్లు ప్రతికూలంగా ముగిసాయి. అదే సమయంలో హెచ్‌సిఎల్ టెక్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు రెండు శాతం వరకు నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఏసియన్ పెయింట్స్ భారీ లాభాల్లో ముగిసాయి.





# ఆర్‌బిఐ బాండ్లకు 8శాతానికిపైగా వడ్డీ!

**న్యూఢిల్లీ, జులై 9:** ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించడంతో దాదాపు అన్ని బ్యాంకులూ ఫిక్స్‌డ్ డిపాజిటర్లపై వడ్డీరేట్లను తగ్గించాయి. దీంతో అధిక వడ్డీనిచ్చే ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల కోసం చాలా మంది చూస్తున్నారు. అధిక ప్రతిఫలం ఉన్న చోట రిస్క్ కూడా పొంచి ఉంటుంది. అలా రిస్క్ వద్దనుకునే వారికి మరో స్కీమ్ అందుబాటులో ఉంది. అదే రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రవేశ పెట్టిన ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్ 2020. ఈ బాండ్లపై అధిక వడ్డీతో పాటు ఆర్‌బిఐ సార్వభౌమ గ్యారెంటీ కూడా లభిస్తుంది. మన డబ్బుకు పూర్తి భద్రత, దీర్ఘ కాలంలో మంచి రాబడి లభిస్తుంది. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లలో వడ్డీ రేటు ఎల్లప్పుడే ఒకేవిధంగా ఉండదు. ఆరు నెలలకోసారి మారుతూ ఉంటుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఒకటైన నేషనల్ సేవింగ్స్ స్కీమ్ (ఎన్ఎస్‌సి)తో ఈ వడ్డీ రేట్లు ముడిపడి ఉంటాయి. ఎన్ఎస్‌సి వడ్డీ రేటును పెంచితే ఈ బాండ్ల రేటు కూడా పెరుగుతుంది. అలాగే



ఎన్ఎస్‌సి వడ్డీ రేటు తగ్గితే ఈ బాండ్లపై వడ్డీ కూడా తగ్గుతుంది. ఎన్ఎస్‌సి అందించే వడ్డీ రేటు కన్నా 0.35శాతం ఎక్కువ రేటు ఈ బాండ్లపై లభిస్తుంది. 2025 జులై-డిసెంబరు అర్ధ వార్షికానికి 8.05శాతంగా వడ్డీ రేటును ఆర్‌బిఐ జులై 1న ఖరారు చేసింది. నేషనల్ సేవింగ్స్‌స్కీమ్ 7.7శాతం వడ్డీరేటు లభిస్తుండగా, ఆర్‌బిఐ బాండ్లపై 8.05శాతం వడ్డీ అందుతుంది. యేడాదికి రెండుసార్లు జనవరి1, జులై1 వడ్డీ మొత్తంఖాతాలో జమ అవుతుంది.

# 24% పెరిగిన 'ఫండ్స్' పెట్టుబడులు

## 'ఆంఫీ' లెక్కలప్రకారం మొత్తం రూ.74.4 లక్షల కోట్ల టర్నోవర్


**ముంబై, జులై 9:** భారత్ ఈక్విటీ మ్యూచువల్‌ఫండ్స్ మార్కెట్‌లోకి పెట్టుబడులు ఒక్కసారిగా పెరిగాయి. గతనెలలో 24శాతం పెరిగి 23,587 కోట్ల రూపాయలు వచ్చినట్లు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ వెల్లడించింది. గడచిన ఐదునెలల క్షీణత నుంచి ఒక్కసారిగా మెరుగుపడింది. ఈక్విటీ రంగాల్లోకి మ్యూచువల్ ఫండ్స్ 23,587 కోట్లు వచ్చాయి. అంతకుముందు నెలలో 19,013 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడులు ఉన్నట్లు తేలింది. గడచిన సంవత్సరం డిసెంబరు నుంచి వరుసగా తగ్గుతూనే వచ్చాయి. 41,156 కోట్ల నుంచి డిసెంబరులో 39,688 కోట్లకు దిగివచ్చాయి. ఫిబ్రవరిలో 29,303 కోట్లు, మార్చిలో 25,082కోట్లు, ఏప్రిల్‌లో 24,269 కోట్లు పెట్టుబడులు క్షీణించాయి. ఈ తగ్గుదలకు ముందు పెట్టుబడులు నవంబరులో 35,943 కోట్లు వరకూ వచ్చాయి. ఇక ఇతరత్రా చూస్తే డెట్‌ఫండ్స్‌లో 1711 కోట్లు విత్‌డ్రా అయ్యాయి. మేనెలలో 15,908 కోట్ల కంటే కొంతమేర మెరుగనిపించింది. అంతకుముందు ఏప్రిల్‌లోనే ఫండ్స్ మార్కెట్‌లోకి కరెన్సీ, ఈక్విటీ, ఫండ్స్ రంగాల్లోకి 2.2 లక్షల కోట్లు పెట్టుబడులుగా రావడం విశేషం. మొత్తంగా మ్యూచువల్‌ఫండ్ రంగం మొత్తం 49 వేల కోట్ల మేర జూన్‌నెలలో పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. ఈ మొత్తంతో ఫండ్స్‌రంలో మొత్తం పెట్టుబడులు 74.4 లక్షల కోట్లుగా ఉన్నాయి. మేనెలాఖరునాటికి 72.2 లక్షల కోట్లుగా ఉంటే కొంతమేర మెరుగుపడింది. ఈక్విటీ అనుసంధానిత పెట్టుబడుల పథకాల్లో 556 కోట్లు వరకూ పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీ ఫండ్ కేటగిరీల్లో ఫ్లెక్సీ క్యాప్‌ఫండ్స్ జూన్‌నెలలో 5733కోట్ల వరకూ పెట్టుబడులు అందాయి. వీటికి అదనంగా స్మాల్ క్యాప్‌ఫండ్స్ 4024కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్ 3754 కోట్లు పెట్టుబడులు సాధించాయి. భారీ పెట్టుబడులపరంగా ఫండ్స్ నికరంగా 1694 కోట్లు మాత్రమే వచ్చాయని ఆంఫీ ప్రకటించింది.





# జూన్‌లో సిప్ పెట్టుబడుల రికార్డ్

**న్యూఢిల్లీ, జులై 9:** క్రమానుగల పెట్టుబడి విధానం (సిప్)లో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జూన్ నెలలో రికార్డు స్థాయిలో రూ.27,269 కోట్లు మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు వచ్చాయి. మే నెలలో ఈ మొత్తం రూ.26,668 కోట్లుగా ఉంది. సిప్ పెట్టుబడులు తొలిసారి రూ.27వేల కోట్ల మార్కు దాటడం ఇదే తొలిసారి. గత నెలతో పోలిస్తే మొత్తంగా మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు 67శాతం మేర పెరిగాయి. మే నెలలో రూ.29,572 కోట్లు పెట్టుబడులు రాగా, జూన్‌లో ఈ మొత్తం రూ.49,310 కోట్లుగా ఉన్నట్లు మ్యూచువల్ ఫండ్ సంస్థల సంఘం (ఆంఫీ) బుధవారం వెల్లడించింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ కేటగిరీలో జూన్ నెలలో రూ.23,587 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మే నెలలో ఈ మొత్తం రూ.19,013 కోట్లుగా ఉంది. ఇఎల్ఎస్ఎస్ ఫండ్స్ మినహా అన్ని ఈక్విటీ కేటగిరీల్లోనూ పెట్టుబడులు తరలివచ్చాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.5,733 కోట్లు రాగా, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,024 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,754 కోట్లు వచ్చాయి. డెట్ మ్యూచుల్ ఫండ్స్ కేటగిరీలో జూన్ నెలలో నికరంగా రూ.1,711 కోట్లు పెట్టుబడులు తరలి వెళ్లాయి. మే నెలలో ఈ మొత్తం రూ.15,908 కోట్ల ఔట్‌ఫ్లో ఉంది. షార్ట్ డ్యూరేషన్ ఫండ్స్‌లోకి రూ.10,276 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్‌లోకి రూ.9,484 కోట్లు వచ్చాయి. లిక్విడ్ ఫండ్స్ నుంచి అత్యధికంగా రూ.25,196 కోట్లు తరలిపోయాయి. హైబ్రిడ్ ఫండ్స్‌లోకి ఇన్‌ఫ్లోస్ 12శాతం మేర పెరిగి రూ.23,222 కోట్లుగా నమోదైనట్లు డేటా వెల్లడించింది. ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోకి రూ.15,584 కోట్లు వచ్చాయి. జూన్ నెలలో గోల్డ్ ఇటిఎఫ్‌ల్లోకి అత్యధికంగా రూ.2,080 కోట్లు వచ్చాయి. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 3శాతం పెరిగి రూ.74.14 లక్షల కోట్లకు చేరింది. మే నెలలో ఈ మొత్తం రూ.71.93 లక్షల కోట్లుగా ఉంది. జూన్ నెలకుగానూ సిప్ చేసిన ఖాతాల సంఖ్య మే నెలతో పోలిస్తే 8.56 కోట్ల నుంచి 8.64 కోట్లకు పెరిగాయి.





# రిలయన్స్ జియో ఐపిఒ ఈ యేడాది లేనట్లే!

**ముంబై, జులై 9:** ఇన్వెస్టర్లు ఎంతగానో ఎదురుచూస్తున్న ఐపిఒల్లో రిలయన్స్ జియో ఒకటి. రాబోయే ఐదేళ్లలో రిలయన్స్ నుంచి రిటైల్, జియో కంపెనీలు లిస్టింగ్‌కు రాబోతున్నాయంటూ ముఖేష్ అంబానీ ప్రకటించినప్పటి నుంచి జియో ఐపిఒ పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. కానీ ఎప్పటికప్పుడు ఈ ప్రణాళికలు వాయిదా పడుతూనే ఉన్నాయి. ఈ యేడాది కూడా ఐపిఒకు తీసుకురాకూడదని రిలయన్స్ భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అతిపెద్ద టెలికం కంపెనీ అయిన జియో విలువను 100 బిలియన్ డాలర్లుగా అనలిస్టులు పేర్కొంటున్నారు. ఈ మొత్తాన్ని ఐపిఒకు ముందే పెంచాలని జియో భావిస్తోంది. టెలికం విభాగంలో అధిక ఆదాయం సాధించడంతో పాటు సబ్‌స్క్రైబర్ల బేస్ పెంచుకోవడం ఇందులో మొదటిది. జియో ప్లాట్‌ఫామ్స్‌కు వచ్చే వార్షికాదాయంలో దాదాపు 80శాతం ఆదాయం టెలికం వ్యాపారం నుంచే సమకూరుతోంది. ఈ సంస్థ టెలికం వ్యాపారంతో పాటు వివిధ యాప్స్‌ను, కనెక్టెడ్ డివైజులు, ఎంటర్‌ప్రైజెస్‌కు ఎఐ సొల్యూషన్లను అందిస్తోంది. దీన్ని విస్తరించాలని భావిస్తోంది. తద్వారా రెవెన్యూను పెంచుకోవాలనుకుంటోందని కూడా పేర్కొన్నాయి. జియోను ఐపిఒకు తీసుకురావానుకుంటున్న విషయాన్ని 2019లో ముఖేష్ అంబానీ ప్రకటించారు.





Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps